

# నిద్రాహీనత

మనుజునకు నిద్రాహీనత దేహమనో దౌర్బల్యమువల్లను సంభవించును. మనుజునకు సహజముగ నుండవలసిననిద్ర లేకపోయినచో మలబద్ధము, అజీర్తి, తలనొప్పి, ఆకలి మందము, మెదడుక్షీణత యేర్పడి కండ్లు గుంటలు పడి బహునిస్సత్తువగ నుండును.

జీవామృతము వీర్యవృద్ధిని, కండపుష్టిని, జవసత్వములను పెంపొందించుట కేర్పడి మనుజదేహములకు అమూల్యమైనది. దీని సేవనము వల్లను దౌర్బల్యహేతువగు సమస్తవిధజాడ్యములను అరికట్టబడి సంపూర్ణ ఆరోగ్యస్థితి లభించును స్త్రీ పురుషులెల్లరు సేవింపతగిన ఉత్తమ బలవర్ధకౌషధము.

## జీవామృతము

(పూర్ణారోగ్యప్రదాయిని)

పెద్దసీసా రు 3-4-0. చిన్నసీసా రు. 1-12-0.

ఎల్ల ఔషధవిక్రేతలయొద్దను దొరకును, లేక

**ఆయుర్వేదాశ్రమము.**

151, గోవిందప్పనాయకవీథి, తపాలుపెట్టె287,
మదరాసు.

# ది సౌత్ ఇండియా కోఆపరేటివ్ ఇన్సూరెన్సు సొసైటీ, లిమిటెడ్.

పోస్టుబాక్సు నెం 183 రు. మద్రాసు.

ఈసొసైటీలో ప్రీమియములు చాలతక్కువే! ఎందుచేత ? కార్యనిర్వహణమునకగు ఖర్చు చాల తక్కువగుటచేత.

దక్షిణహిందూదేశమునకంతకు నీ సొసైటీ యొక్కటియేనా ? ఔను. ఎందువలన ? సహకారధర్మముల మీద నడుపబడుటవలన.

జనసామాన్యమునకు చాల ఉపయోగించునట ! ఏ విధమున ? రు 100 లు తక్కువ మొత్తము మొదలు రు 5000 లు వరకు మాత్రమే పాలసీలు జారీచేయుట వలన.

దీనిలో కార్యనిర్వహణవ్యయము చాలతక్కువా? ఔను. ఎట్లు ? సహకారసంఘలాభములను పొందుటచేతను, విశేషవ్యయమునకు కారణమగు బ్రాంచి ఆఫీసుల నెలకొల్పక పోవుటచేతను.

బ్రాంచి ఆఫీసులస్థాపింపకయే మంచివ్యాపారము చేయుచున్నట్లున్నది. ఏలాగున ? రాజధానిలోని సహకార సంస్థల కనుబంధములుగా లోకల్ బోర్డులను స్థాపించి.

ఈ ప్రణాళిక పాలసీదారులకు చాల సౌకర్యమే! ఔను. మనియార్డరునకగు కమీషనుఖర్చు లేకుండ పాలసీదారులు సహకారసంస్థలలో వారి ప్రీమియములను చెల్లింపవచ్చును.

సహకార సంఘలాభము లెవ్వి ? ముఖ్యమైనవా ? ఔను. రాబడిపన్ను లేకపోవుట, స్టాంపుడ్యూటీ లేకపోవుట మొదలైనవిన్ని పాలసీదారులే వాటాదారులగుట.

నీకు లాభముకావలెనా, నష్టముకావలెనా? లాభమే. ఐన, ఆలస్యముచేయక నేడే ఈ సౌత్ ఇండియా కోఆపరేటివ్ ఇన్సూరెన్సు సొసైటీలో నొక పాలసీ తీసికొనుము.

# దియునైటెడ్ ఇండియాలైఫ్

## అస్యూరెన్సు కంపెనీ లిమిటెడ్

హెడ్ ఆఫీసు : మదరాసు. 1906 లో స్థాపింపబడినది.

ట్రస్టీ : మద్రాసుయొక్క అఫీషియల్ ట్రస్టీ.

| | | |
|---|---|---|
| అమలునందున్న పాలసీలు | రెండుకోట్ల రూపాయలను | మించినవి. |
| మొత్తపుఆస్తులు | ఏబదియైదులక్షల రూపాయలను | మించినవి. |
| సంవత్సరాదాయము | పంద్రెండులక్షల రూపాయలను | మించినది. |

పెట్టుబడులలో పూర్తియైన, నికరమైన రక్షణ; క్లెయిముల సత్వరమును, న్యాయసమ్మతమునగు పరిష్కారము; కార్యనిర్వహణమున పొదిమి; మంచిబోనస్సుతో కూడియుండు తగుమైన ప్రీమియములు; పోలసీహోల్డరులకు ఫలకరమును, సహాయకరమును, సత్వరమును అగు సేవ,

ఈ కంపెనీకి ఘనత కలుగజేయుచున్న ప్రత్యేక లక్షణములు.

మనదేశమునందు వివిధతావులయందు గల ఈకంపెనీ ప్రతినిధులకుగాని, హెడ్ఆఫీసునకుగాని వ్రాయుచో పూర్తివివరములు వెంటనే పంపబడును.

"యునైటెడ్ ఇండియాలైఫ్ అస్యూరెన్సు బిల్డింగులు."
సెంబుదాస్ వీథి, మద్రాసు.

యం. కె. శ్రీనివాసన్.
మేనేజింగ్ డైరెక్టరు.

---

# గమనింపుడు

మా మ్యాన్ ఇన్సూరెన్సు పద్ధతియొక్క అత్యద్భుతమైన అభివృద్ధిని గమనింపుడు

ఇంతటి కొద్ది కాలములో జరిగిన **42,00,000** ఇట్టి క్రొత్త పద్ధతిని నమ్మగలరా ?

## నిజముగ జరిగిన సంగతి

వైద్యపరీక్ష లేదు. స్త్రీపురుషవివక్షత లేదు.

ఇది శాస్త్రీయమైనది—ఇందు బోనసుగలదు—గ్యారంటీడ్ లాభములనిచ్చును.

మీ అర్ధాంగితో కలసి ఒకజాయింటు పోలసీని తీసికొనుడు.

ఏజెన్సీ షరతులకు, ఇతరవివరములకు నేడే వ్రాయుడు

## దివీనస్ అస్యూరెన్సు కంపెనీ లిమిటెడ్, ఢిల్లీ.

మద్రాసు బ్రాంచి : ౨౨, సెకండులైన్ బీచ్, జార్జిటవున్.

మదరాసు రాజధానిలో ఇతర బ్రాంచీలు :—1. విజయనగరము, 2. గుంటూరు, 3. తెలిచ్చేరి, 4. ట్యూటికారిన్ లేక సదరన్ యిండియాడిస్ట్రిక్టున్.

నొప్పుల నివారించుటలో సాటిలేనిది. బుడ్డి వెల 0-5-0.

## హనుమాన్ పెయిన్ బాం




పలుతావులయందు పలువురచే వాడబడి తృప్తికరముగా పనిచేసినట్లు యోగ్యతాపత్రములను పడసినది. అన్ని విధములైన నొప్పులకు, కత్తిగాట్లకు జెణుకు నొప్పులకు, వరిబీజములకు, వాపులకు, జలుబులకు, చిగురు ఉబ్బులకు, తిమ్మురులకు నమ్మకమైన మందు. ఎంత తలనొప్పియైన 2, 3 నిమిషములలో గారంటీగా పోవును.

హెడ్ ఆఫీసు: హనుమాన్ పెయిన్ బామ్ వర్క్సు, 89 పూనమల్లి హైరోడ్. పి. టి. మదరాసు.

ఏజెంట్లు: పి. స్వామినాయుడుగారు, ప్రొప్రయిటర్, శ్రీరామక్రిష్ణ ట్రేడింగుకంపెని, నర్సారావుపేట.

కె. నాగభూషణరావుగారు, తాడేపల్లిగూడెం, వెస్టుగోదావరిజిల్లా.

ఏజెంట్లు లేనితావులయందు ఏజెంట్లు కావలెను. మంచికమీషను ఈయబడును.


## ట్రావెలింగు యేజెంటు

శ్రీయుత నేతి కామేశ్వరశాస్త్రిగారిని ఆంధ్రభూమికి ట్రావెలింగు యేజెంటుగ నియమించినారము. కావున ఆంధ్రభూమి అభిమానులు వారికి చందాలనిచ్చి తగుమైన రసీదు పొందనగునని తెలియజేయుచున్నాము. యిట్లు ఆంధ్రభూమి మేనేజరు.





యీ ట్రేడుమార్కును చూచిన మోసపోరు.

## అత్యాశ్చర్య కుష్ఠరోగ నిర్మూలిని

(రిజిస్టర్డు.)

గుణములేదని ఋజువుచేయువారికి రు. 1000 లు బహుమానము 18 రకముల కుష్ఠులు, బొల్లి, సుఖరోగములు యేస్థితిలో యెంతకాలము నుండి జీర్ణించియున్నను గ్యారంటీగా బాగుచేయుదుము. మృత్యుముఖమునుండి అనేకవేల రోగులు రక్షింపబడిరి. యింజక్షనువలన ఫలితముగానని రోగులు మామందువలన పూర్ణారోగ్యమును పొందిరి. పూర్తి వివరములకు అన్నిభాషలలోను దొరకు మా కేట్లాగులకు యీ దిగువ యడ్రసుకు వ్రాయుడు.

లక్ష్మి అండ్ కంపెనీ (రిజిస్టర్డు.)
కుష్ఠు అండ్ సుఖరోగ చికిత్సా నిపుణులు,
అల్లిపురం మెయిన్‌రోడ్డు, వాల్తేరు ఆర్. యస్ పోస్టు.

## కామశాస్త్రము

ఇది వాత్స్యాయనమహర్షి సంస్కృత భాషలోవ్రాసిన సూత్రములకు చక్కని తేటతెల్లమగు తెలుగుసేత. రైలులో అమ్ము పుస్తకాలవంటిదికాదు. సరియైన శాస్త్రగ్రంథము. మనపూర్వులు 'కామ'మను మూడవ పురుషార్థమునకిచ్చిన ప్రాముఖ్యము, ప్రాభవము ఇది చదివినచో తేటమగును. అల్లరి చిల్లర వ్రాతలుకావు. ఆదిలో వ్రాసినవారు పూజ్యులగు మహర్షులు కాబట్టి దీని గొప్పతనము సరసులగు చదువరులు గ్రహింతురుగాక. వెల, ఒక్కరూపాయ.

కొత్త సత్యనారాయణచౌదరి, పండిట్, బోర్డు హైస్కూల్, నిడుబ్రోలు, గుంటూరుజిల్లా.

# విషయసూచిక


౧. కావలెను ... ౪౭౩
—బొడ్డు బాపిరాజు

౨. నమూనాకథ ... ౪౭౪
—కొడవటిగంటి కుటుంబరావు

౩. ఊర్వశీపురూరవము ... ౪౭౭
—కవికొండల వేంకటరావు, బి. యల్.

౪. అస్సీరియా రాజు—'ఎసార్డన్' ... ౪౮౧
—తల్లాప్రగడ ప్రకాశరాయుడు, ఎం. ఏ

౫. అశ్రుగీతి ... ౪౮౬
—శేషాద్రి రమణ కవులు

౬. ఏదిసౌఖ్యం ... ౪౮౭
—క. సాంబమూర్తి

౭. విధి ... ౪౯౦
—కాశిరాజు రామమోహనశర్మ

౮. గుసగుసలు ... ౪౯౧
—చిరుమామిళ్ళ శివరామకృష్ణప్రసాదు, బి.ఏ.

౯. గీత ... ౪౯౫
—స్థానాపతి సత్యనారాయణశాస్త్రి

౧౦. మంచు ... ౪౯౫
—పద్మపురాణము

౧౧. ప్రబంధలక్షణములు ... ౪౯౬
—చేకుమళ్ళ అచ్యుతరావు ఎం.ఏ; యల్.టి.

౧౨. గానము ... ౫౦౧
—సమీరకుమార విజయము

౧౩. నూలుఁబోఁడు వాలుగంటి .. ౫౦౧
—హంస వింశతి

౧౪. తపోభంగము ... ౫౦౨
—మొదలి సీతారామస్వామి బి. ఏ.

౧౫. భారతీయ గ్రంథాలయములు ... ౫౦౪
—మారేమండ రామారావు, ఎం. ఏ; బి. ఇడి.

౧౬. "చిన్నచిన్నవ్యాసాలు" గురించి ... ౫౦౯
—ఓలేటి సీతారామమూర్తి బి.ఏ.

౧౭. ధర్మజునితో రారాజు ... ౫౧౧
—కొత్త సూర్యనారాయణ

౧౮. నా ఆంధ్రభూమి ... ౫౧౨
—కనుపర్తి వరలక్ష్మమ్మ

౧౯. సర్ ఈసాక్ హిల్ ... ౫౧౩

౨౦. త్యాగి ... ౫౧౯
—కంటిపూడి జానకిరామచౌదరి

౨౧. రాధాకృష్ణ ... ౫౨౧
—వజ్ఝల కాళిదాసు

౨౨. నూలువడికి రప్పద్మముఖులు ... ౫౨౨
—శుకసప్తతి

౨౩. మహాత్ముఁడు : వర్ణవ్యవస్థ ... ౫౨౩
—వెన్న అనంతరామమ్మ

౨౪. అపనీతముల యుత్పత్తి ... ౫౨౭
—బాగు గోపాలరావు

౨౫. పువ్వులు ... ౫౩౦
—కనకదండి గోపాలకృష్ణశాస్త్రి

౨౬. మణిమాల ... ౫౩౩

౨౭. ఆరోగ్యవిజ్ఞానము ... ౫౩౫
—డాక్టరు ఐ. వి. శర్మ ఎ. ఎం. ఎ. సి.

౨౮. ఇన్సూరెన్సువిషయములు ... ౫౩౭

౨౯. జిజ్ఞాస : మీమాంస ... ౫౪౦

30. సంపాదకీయ సమాలోచన ... ౫౪౧



# నిజాము రాష్ట్రమునకు

ఆంధ్రభూమికి ఈ క్రిందివారిని చీఫ్ ఏజెంటులుగ నియమించినాము. బ్రిటీషు పోస్టలు సౌకర్యములు లేక ఆంధ్రభూమికి చందాకట్టుటలో ఇబ్బందిపడుచున్న నిజాము రాష్ట్రాంధ్రులు ఇకమీఁదట తమతమ చందాధనమును వారికి పంపుచు ఆవిషయమును ప్రత్యేకముగ మాకార్యాలయమునకుగూడ తెలుపుచుండగలరు. శికిందరాబాదు, హైదరాబాదు వాస్తవ్యులు మాసము మాసము విడిసంచికలు వీరికడ కొనుక్కొననగును.

—ఇట్లు, ఆంధ్రభూమి మేనేజరు.

చీఫ్ ఏజెంటు నామము, చిరునామా :

శ్రీయుత కాలేరు వెంకటయ్యగారు, 4121 మూసాఖాన్ వీధి, శికిందరాబాదు.

ఆంధ్రభూమియందు ప్రప్రథమమున స్థాపింపబడిన

# ఆంధ్ర ప్రావిడెంటు కంపెనీ లిమిటెడ్

ప్రధాన కార్యస్థానము :— బెజవాడ. స్థాపితము 1929.

మేనేజింగు డైరెక్టరు :

మ-రా-రా-శ్రీ దిట్టకవి వీరరాఘవయ్యపంతులుగారు.

స్వల్ప ప్రీమియములు. నవీనపద్ధతులు.

ఏజంట్లకు ధారాళమైన కమీషన్ యియ్య బడును.

## ప్రత్యేక సౌకర్యములు.

1. స్త్రీ పురుషులకు సమానమైన ప్రీమియం రేట్లు.
2. రు 100 లు మొదలు రు 500 ల వరకు పట్టాలు జారీచేయబడును,
3. వైద్యపరీక్ష లేని భీమాపద్ధతులు,
4. క్లెయిములు గ్యారంటీ చేయబడినవి,
5. పట్టాదారులకు ఋణము లియ్యబడును,
6. జననభీమాలో నెలకు 1 రూ. లేక 2 రూపాయలుప్రీమియం చెల్లించిన రు 500 లు లేక రు 1000 ల వరకు క్లెయిమును పొందవచ్చును. కవల పిల్లలు జనించిన రెండు క్లెయిములు యియ్యబడును.
7. ఉత్తర ప్రత్యుత్తరములు తెలుగుభాషలో జరుపవచ్చును.
8. పట్టాదారులకు ఫలప్రదమును సహాయకరమునగు సేవయే ఆదర్శము.

జననభీమా శిశు పోషణకు గొప్ప సహాయకారి.

పూర్తి వివరములకు :

సూపరింటెండెంటు ఆఫ్ ఏజన్సీస్.

## ఆంధ్రప్రావిడెంటు కంపెనీ,

గాంధినగర్, బెజవాడ.

# ఆంధ్ర ఇన్స్యూరెన్సు కంపెనీ

## లిమిటెడ్

## బందరు

స్థాపితము—1925.

కొలది సంవత్సరములలోనే అద్భుతమగు అభివృద్ధిగాంచిన సంస్థ.

| | |
|---|---|
| 1933 లో జరిగిన వ్యాపారము | 19,42,000 |
| సాలీనా ఆదాయము | 3 లక్షలు |
| భీమానిధి | 7 లక్షలు |

మితవ్యయము, సిర్దుష్టపరిపాలన మా కంపెనీయొక్క ముఖ్యలక్షణములు.

సాలీనా చెల్లించు ప్రీమియములపై నూటికి రు 2—8—0 లు మినహాయింపు; రద్దయిన పట్టాలు, బాకీలుపడిన ప్రీమియములు చెల్లించవలసిన అవసరంలేకుండగా తిరిగి అమలులోనికి తెచ్చుట మొదలగు అనేకసౌకర్యములు గలవు.

మొదటి వాల్యుయేషనులోనే సాలుకు 1000-కి రు 10 లు బోనసుపంచబడినది.

అన్నిచోట్లను మంచి కమీషనుపై పలుకుబడిగల ఏజంట్లుకావలెను.

వివరములకు :—

య. మంగయ్య, బి.ఏ, బి.ఎల్.,

కార్యదర్శి.

ఆవడి ఆరోగ్యాశ్రమ దృశ్యములు



1 హకీమ్‌నగర స్థాపనసమయమున



2 దర్భంగ భవనము

ఆవడి ఆరోగ్యాశ్రమ దృశ్యములు



3.



4.

# కావలెను

తొగరు కెమ్మోవి సోయగ మ్ముట్టిపడగ వెన్నెలలు గాయించెడి మొలకనవ్వు
పొలుపు రెప్పలను దోబూచులాడుచు చెందొవల మాలలం గ్రుచ్చు సోలపుమాపు
జోలపాటల తల్లిపాలు ద్రావిననోట వెలువడ్డ కమ్మని కులుకు పలుకు
చిన్నికోయిల గొంతుచించి పాడినపాట చిన్నబుచ్చెడి సన్నసన్న యేడ్పు
చివురుపాదాల చేతుల చిట్టిపెదవి రేకులను పాలబుగ్గల ద్రిమ్మరించు
అంద చందాల పొందు పసందులమరు పాలపాప డొకండు కావలెను మాకు

నిలయమ్ము మేలితావులనింపి వలపింపజాలిన నిత్య వసంతమూర్తి
చిత్తమ్ము లమృతాభిసేచనమ్మున సంతసముగొల్పు పున్నమ చందమామ
తెరపిలేకుండ క్రొందేనియల్ చవిసూపు ధరణికిడిగిన గంధర్వరాజు
అనవద్య శాంతజీవన వైభవమున కుదాహరణమగు తథాగతుండు
శిథిలనైతిక జీవన శృంఖలముల బందిగానట్టి నిర్మలానంద యోగి
యిన్ని చనుబాల సంతృప్తి నెనయుదొడ్డ కులుకు బిడ్డ యొకండు కావలెనుమాకు.

'కను మూసితివిర నాయన!' యన్న లేదను రీతి బుగ్గల నవ్వు రేకవిప్పి
'బంగారుకొండ మా బా' బన్న ఔనను విధి చేతులూపి పింపిసలు గూసి
'ఉయ్యాల దిగవె మా యయ్య!' నా గనుమోడ్చి యురక యేదియొ ఉఊలు చదివి
'బుచ్చితండ్రీ! నిద్రపోవరాయిక' యన్న వలదంచు ముద్దుచూపులు మరల్చి
'వద్దురా!' యన్నమనసులో భ్రమలు పుట్ట యెత్తికొమ్మని చేతుల నెత్తి చూపి
గడియకొక క్రొత్త ముచ్చట్ల పడననడుపు వలపుల కొటార మొకడు కావలెను మాకు.

రాజాధిరాజ స్వర్గమునకును లేని పాదమ్ముక్రింద దింపనిది రాణ
ఒకవేళ భగవంతునకు గూడ యుండని తలపులమించిన పలుకుబడియు
భక్త సత్తముల కబ్బనిదైన చిన్మయజ్యోతి సాక్షాత్కార సుఖసమృద్ధి
కవిలేఖినీ సుధాకలశమ్మునకు లేని యనిదంప్రథమమైన తీపి
భావనాతీత వేదనా వ్యథితహృదయ మునకు విశ్రాంతి యొసగజాలిన విభూతి
కలుగువాడు కన్నులకైన వెలుగువాడు వలెను పాపాయి యొకడు కావలెనుమాకు.

తన సేవకని చేతులను కట్టుకొని యెల్ల యుల్లమ్ము నిడి తత్తరిల్లు సిల్లు
తన మాట యాణిముత్యపు మూట ముద్దు కిన్నరసానిపాట క్రొవ్విరుల బాట
తన తృప్తి మోవి నిల్చిన వెన్నెలలె వే ప్రపంచమ్మునకు వరాలవాన జల్లు
తన వీక్ష సర్వచేతనకోటి కెదురొడ్డి దాటిపోజాలని గీటుగాగ
యీ యరాజకమైన మా హృదయసీమ కొలువు సాగించి యేలుబడి గొనగ నిప్పుడు
పోతపోసిన వలపుముద్ద ముద్దు పాప యొకడు కావలెను ; కావలెను మాకు.

— బొడ్డు బాపిరాజు.

# నమూనా కథ

కథకుల్లో గోపాలం చెప్పుకోదగ్గ మనిషి. అతని కథల్లో మొత్తానికి కొంత ఇది లేకపోలేదు. కాని ఆవిషయం ఎక్కువమంది గమనించినట్టు తోచదు. నామట్టుకు నేను కథేదైనా చదివినప్పుడు, బాగుంటే బాగుందనీ లేకపోతే లేదనీ అనుకోటమేకాని ఎందువల్ల బాగుంది, ఎందువల్ల బాగాలేదు అంటే చెప్పలేక పొయ్యేవాణ్ణి. అయితే నేను కథ ఈవిధంగా ఉంటే బాగుంటుంది అనే సిద్ధాంతం చెయ్యాలని ప్రయత్నించక పోలేదు. కాని నాప్రయత్నం సాగక పోయింది.

ఎందుచేతంటే, ఎడ్గార్ ఏలెన్ పో కథలు చదివితే అసంభవాలను గురించి రాస్తానే కథలు బాగావుంట య్యనిపించేది; షెర్లాక్ హోమ్సు కథలు చదివితే డిటెక్టివుకథలే కథ లనిపించేది; మరో కథలు చదివితే ప్రణయకథలే కథలనీ, జేకబ్స్ కథలు చదివితే నావికుల కథలే కథలనీ; ఇంకోటివి చదివితే పొట్టికథలే కథలనీ, వేరొకప్పుడు నలభై పేజీలు దాటనికథ ఏం కథ అనీ అనిపించేది. ఇట్లా సందర్భానుసారంగా అభిప్రాయాలు మార్చుకుంటూ ఒక తీర్మానానికి రావటం దుస్సాధ్యమైంది.

ఈ పరిస్థితుల్లో మా "దూర్వాసుడు" ఒకనాడు నా దగ్గిరి కొచ్చి తనకూ గోపాలంతో పరిచయం చెయ్యమన్నాడు. ఎందుకురా అని అడిగాను. పనుందన్నాడు. నేను సహజంగా ఏంపనన్నాను. వాడు కాస్సేపు సిగ్గు నమిలి, "మరే, మరేంలేదు కాని—అసలు సంగతేమిటంటే—అప్పుడే ఒక్క రోజులోనే పెద్ద రాతగాణ్ణి కాలే ననుకో—అసలు వాని ఫక్కీ ఏమిటో కనుక్కుంటే—తరవాత క్రమంగా అభ్యాసం మీద—తెలీలా?" అనటం మొదలుపెట్టాడు. నేను నిర్మొహమాటంగా తెలీలే దన్నాను. ఎట్లాగైతేఏం బయట పెట్టాడు తనకు కూడా కథలు రాయాల నుందనీ అది గోపాలం కొస్త చేయూత ఇస్తే జయప్రదంగా కొనసాగు తుందనీ తనకు ధైర్యం ఉందనీ!

"హరి దూర్వాసుడా!" అన్నాను. వాడు మండిపడి అదే అనవ ద్దన్నది అన్నాడు. పాపం ఆపేరు పెట్టే వరకూ వాడు కోపం ఎరగడు జీవితం అట్లాగే ఉంటుంది! న్యాయం లేదంటాను!

సరే తప్పే దేముంది? వీలు చూసుకుని ఇద్దరం గోపాలం ఇంటికి వెళ్ళాం. నాదోషం లేకుండా ముందే చెప్పాను "అతను నిన్ను వేధించుతాడురా! కాలాంతకుడు!" అని!

క్షణంలో దుర్వాసుణ్ణి ముగ్గులో దింపి వాగించటం మొదలుపెట్టాడు గోపాలం.

"నాకు మరేం లేదు కానీండి, దాంతాడు తెగా! మనిషిని వర్ణిద్దా మన్నా, ఇంటిని వర్ణిద్దా మన్నా కలం సాగదు!" అన్నాడు దూర్వాసుడు.

"మరేమీ ఫర్వాలేదు. వర్ణనలు లేకుండానే కానివ్వండి. నాకూ వర్ణనలు నడవ్వు. అవి లేకుండానే కాలక్షేపం చేస్తున్నాను!" అన్నాడు గోపాలం.

"నిజంగానా!" అన్నాడు దూర్వాసుడు.

"నమ్మండి నామాట!" అన్నాడు గోపాలం.

దూర్వాసుడి మొహం వికసించింది.

"నాకు మరేం లేదు కానీండి, దాందుంప తెగా! విషయం దొరికి చావదండి! రెండు మూడు సార్లు ప్రయత్నం చేస్తే మా ఇంటో జరిగే సంగతులూ మా మామగారింటో జరిగే సంగతులూ దిగ్గినై! ప్లాటు ఊహించలేను!" అన్నాడు దూర్వాసుడు.

"సరిగా అదే నాకూ వచ్చిపడ్డది, చూశారో లేదో! నేనూ ప్లాట్లు ఊహించి యాడవలేను. ఎక్కడైనా జరిగిన సంగతులే మసి పూసి నేరేడు కాయ చేసి గీకేస్తుంటాను!"

"నిజం?" అన్నాడు దూర్వాసుడు నవ్వుతూ.

"నిజం!" అన్నాడు గోపాలం గంభీరంగా.

ఈపాటికి దూర్వాసుడి భయం యావత్తూ అంతరించింది తను కూడా కథకుల్లో ఒకడని ధైర్యం గట్టిగా కలిగింది గోపాలానికీ తనకూ ఒక్కటే తేడా! అతను కొన్ని కథలు రాసి ఉన్నాడు, తను రాయనున్నాడు! ఆప్రకారంగానే తన్ను కాబోయే రాతగాడి కింద భావించుకుని, తను కూడా గోపాలం మొదలైనవాళ్ళలో ఒకడుగా మాట్లాడటం మొదలు పెట్టాడు. ఈవిధంగా గోపాలం మావాడికి కొంత పురెక్కించి మెల్లిగా దించటం మొదలు పెట్టాడు. మావాడు, మొద్దు, కనుక్కోలేక పోయినాడు.

"కాని చిక్కంతా ఎక్కడ వస్తుందంటే ఒక మనిషి జీవితం తీసుకున్నామంటే మొదటినించీ చివరదాకా కథగా చెప్పటానికి వీలు పడదు. జీవితంలో కథలు జరుగుతూంటై. ఆకథ ప్రారంభమై అంతం కావటానికి ఒక రోజు పట్టవచ్చును, పదిసంవత్సరాలు పట్టవచ్చును. అందులో కూడా; ఈలోపల జరిగిందంతా కథలోకి రావటానికి వీలులేదు. అది కనుక్కునే నేర్పు కథకుడిది!" అన్నాడు గోపాలం.

"ఎట్లా గెట్లాగూ? ఏమన్నారు?" అన్నాడు దూర్వాసుడు.

"కథకుడికి ఎక్కడ కథ ప్రారంభించాలో ఏమేం భాగాలు వదిలెయ్యాలో, చిన్నచిన్న సంస్కరణలు—మనలో మాట్లాడుకునేటప్పుడు మార్పులందాం!—"

"అవును పేర్లూ అవీ మార్చకపోతే డెమరేజి పడుతుంది!"

"చక్కగా సెలవిచ్చారు!...ఎక్కడెక్కడ మార్చాలో, చివరకు ఎక్కడ ఆపాలో కూడా నమ్మకంగా తెలిసి ఉండాలి!"

"తప్పకుండా!" అన్నాడు దూర్వాసుడు.

"కథ ప్రారంభించటం కన్నా ఆపటం చాలా కష్టం. ఒకరిద్దరు మరీ చాతకాని వాళ్ళు నన్ను 'ఏమండీ, కథ కథానాయకి గర్భం దాల్చిన చోట ఆపటం శ్రేష్టమా, కొడుకు పుట్టిన తరవాత అంతా సుఖంగా ఉన్నారని చెప్పేసి ఆపటం మంచిదా?' అని అడిగారు. 'అదంతా ఎందుకండీ? సినిమా మోస్తరుగా నాయకీ నాయకులు ముద్దుపెట్టుకుంటూండగా "ఫేడౌట్" వేసెయ్యండి!' అని చెప్పాను."

"మీ ఆలోచన చాలా బాగుంది!"

"ఏమాత్రం అనుభవం ఉన్న వాడికైనా తెలుస్తుందండీ! నూటికి తొంబైతొమ్మిది మంది కథ అయిపోవటం కనుక్కోగలరు. చూడండి! సినిమాలో ఇంకా గుడ్‌నైట్ రాకమునుపే నేలలో వాళ్ళు కూడా ఎట్లా లేస్తారో!"

"అవును కానండి, నామటుకు నాకు సినిమా చూస్తుంటే అప్పుడే అయిపోయిందనిపిస్తుందండీ!"

"దాందేమిటిలెండి!"

"ఇంతకూ నేను కూడా కథలు రాయవచ్చునంటారు!"

"అనుమాన మేమిటి?...ఇంత దూరం వచ్చారు కనక, ఉత్త కబుర్లెందుకు? నేను జీవితంలో కథ ఎట్లా ఇమిడి ఉండేదీ మీకు చూపిస్తాను. మీరు ఊఁ కొడుతూ ఉండండి! కథ అయిపోగానే మీరిక ఊఁ కొట్టరు! నేను చెప్పే కథ మీకు నమూనాగా కూడా పనికొస్తుంది!"

"చెప్పండి! చెప్పండి!" అన్నాడు దూర్వాసుడు

అతను చెప్పటం! ఇతను ఊఁ కొట్టటం!

"శంకరమని నాతో చదువుకున్న వాడొకడున్నాడు. వాడూ దిట్టంగా డబ్బున్నవాడూ! వాడికి చదువెందుకు?, ఉద్యోగాలెందుకు? స్కూలుఫైనలుతో చదువు చాలించాడు. అందుచేతనో, మరి ఇంట్లో అధికారం ఎక్కువ భాగం ఆడవాళ్ళదవటం చేతనో వాడికి ఆడనాగరికత అబ్బింది. మన సంఘంలో ఆడనాగరికత ఒకటీ మగనాగరికత ఒకటీ తగలబడ్డయ్‌గా!

"కాలక్రమానా, కర్మవశానా వాడికి పెళ్ళికావటం, భార్య కాపరానికి రావటం జరిగినై.

"శంకరం, వైధవ, ప్రబంధాలైనా చదివిన పాపాన పోలేదు మరి. వాడికి శృంగారం తెలీదు సరేకదా, భార్యతో స్నేహంగా ఉండటం కూడా చాతకాదు. ఆభార్య పక్కలో ఉన్నంత సేపూ ఏమో, ఆ తర

వాత ఎన్నడూ ఎరగని పరాయి మనిషిని చూసినట్టు చూసేవాడు. తన పెట్టెలు, బట్టలు, వస్తువులు—ఏమీ ఆవిణ్ణి ముట్టుకో నిచ్చేవాడు కాదు. ఆ అమ్మాయికి వీణ్ణి ఉడికించి కోపం తెప్పించటం సరదా. వీడిలో ఇటువంటి దౌర్భాగ్యపు గుణాలన్నీ గమనించి, అయిదు నిమిషాల కోసారి వాడి కిష్టం లేని పని చేస్తుండేది. పట్టపగలు వీడే పని మీదైనా పడక గదిలో అడుగు పెట్టాడా, తను కూడా లోపలి కొచ్చి తలుపేసేది. అది వాడికి గిట్టదు. అందరూ చూస్తే ఏమను కుంటారు?—"

మా దూర్వాసుడు నావంక తిరిగి "చూశావా? అదీ కారెక్ట్రైజేషన్! మొదటనే చెప్పారు, అతని నాగరికత ఆడవాళ్ళ నాగరికత అని!...కానివ్వండి.'" అన్నాడు.

'కాని అన్నిటి కన్నా శంకరం వెధవ పెట్టెలు ముట్టుకో నివ్వక పోవటం ఆ పిల్లకు చాలా అనుమానాస్పదంగా కనపడ్డది. ఎవరైనా ఆడవాళ్ళు వాడికి ఉత్తరాలు రాస్తున్నారేమో నన్న అనుమానం కూడా పోయినట్టు తెలుస్తుంది! ఇంకేముంది? నవ్వులు నువ్వులైనై. అదివరకు వాణ్ణి ఏడిపించటానికి పెట్టెలు తెరిచిన మనిషి ఒకనాడు వాడులేకుండా చూసి, వాడు అన్నిటి కన్న ప్రాణపదంగా కాపాడుతున్న పెట్టె తెరిచి సవరించింది. అందులో ఆ పిల్ల కేం దొరికిం దనుకున్నారు? ఒక చక్కని స్త్రీ ఫోటో!

"ఇహ చెప్పేదేమిటి? ఆ అమ్మాయి కొక్క సారి కోపమూ ఏడుపూ కూడా వచ్చినై. ఆ ఫోటో చించేద్దా మనుకుంది కాని అది అకస్మాత్తుగా మొగుడి మొహం ముందు పెడితే ఆ మొహం ఎట్లా ఉంటుందో చూసి ఆనందించుదామని, ఆ ఫోటో తీసి జాగ్రత్తగా దాచిపెట్టింది. మళ్ళీ పెట్టె సర్ది మూసేసింది.

'ఇంకేం? ఆ రాత్రే పాశుపతాస్త్రం ప్రయోగించింది. ఆ ఫోటో చూసి ఊసరవిల్లల్లే రంగులు మారటం మొదలుపెట్టాడు శంకరం. దాంతో ఆపిల్ల అనుమానం కాస్తా రూఢయింది. ఏడిచింది, తన్ను తను తిట్టుకుంది, వాణ్ణి మాటలంది, ఎంత కంగారు పడాలో అంత కంగారు పడి, వాణ్ణి కూడా అంత కంగారు పెట్టింది. ఆ కంగారులో శంకరం కోప్పడటం కూడా మర్చిపోయినాడు.

'అది వాళ్ళిద్దరికీ ప్రథమ కలహం, ఇద్దరికీ మొత్తం మీద బాగా చెడ్డది. ఇప్పుడు శంకరం భార్యను తన పెట్టె సవరించి నందుకు కోప్పడేం లాభం? ఆపిల్ల అనవసరంగా వ్యథ పడుతున్నదని కూడా తెలుసు. కాని ఆ ఫోటో ఏమిటో, దానికీ తనకూ ఏం సంబంధమో చెప్పటానికి ధైర్యం లేదు. ఆకాస్త రహస్యం తెలిస్తే తన మీద భార్యకు జన్మలో మళ్ళీ గౌరవం రాదేమో నని భయం! అందువల్ల వాడు నోరు తెరవలేదు కొంత కాలం.

'ఇంతలో వాడికో మంచి ఆలోచన తట్టింది. వెంటనే వాడు పెళ్ళాం దగ్గిరికి పోయి ఆ ఫోటో తన చెల్లెలి దన్నాడు. వాడికి చెల్లెలు లేదని పెళ్ళాం ఎరగదూ? కావలిస్తే పోలికలు చూసుకో మన్నాడు ధైర్యంగా పోలికలైతే ఉన్నై!

'శంకరంపెళ్ళాం దిగ్భ్రమ చెంది పోయిం దంటే నమ్మండి! ఆపిల్ల నేవిధంగా భావించటానికీ పాలుపోలేదు. తను పొరపాటు పడ్డట్టు ఒప్పుకుని సంధి కొచ్చింది; కాని ఒక షరతు పెట్టింది. ఆ ఫోటో ఎవరిదో చెప్పమంది. ప్రాణం పోయినా చెప్పనన్నాడు శంకరం! మొద్దు!

'ఈ సమయంలో, బాబూ, నేను వాడి కొంపకు వెళ్ళటం తటస్థించిందండి! నేను వాడితో భార్య ముందే 'ఏంరా శంకరం? మరి రేపు అనివర్సరీకి ఆడవేషం వేస్తావా? వెనకటి ఓపిక పోయిందా?' అన్నా. వెంటనే వాడిపెళ్ళాం 'ఏమండీ, మీరు ఆడవేషం వేస్తే నాకూ కూడా చూపించరూ?' అంది ఆదుర్దాతో.'

'ఊఁ?—ఉఁహూఁ!—ఊఁ' అన్నాడు దూర్వాసుడు.

గోపాలం నోట్లో సిగరెట్టు పెట్టుకుని నిప్పెట్టె కోసం చూడటం మొదలు పెట్టాడు.

'కథ అయిపోయింది! మనం మెల్లిగా కొంప చేరుకుందామా?' అన్నాను.

—కొడవటిగంటి కుటుంబరావు.

# ఊర్వశీ పురూరవము

వెనుకటి తరువాయి.

-[భావరూపకము.]

| | | |
|---|---|---|
| ప్రథమాంకము. ద్వితీయ రంగము. | దృశ్యము—అడవి. | ఊర్వశి, చిత్రలేఖ. రంభాదులు. పురూరవుడు. వయస్యుడు. |

ఊర్వశి—చిత్రలేఖ.

చిత్రలేఖ :

చెలీ! నీవదిగోయని చూపి యింతదవ్వ నకుఁ గొనివచ్చిన లతానికుంజము మాట మఱచి యింకను ముందునకుఁ దీసికొని పోవుచుంటివి మనమప్పుడే మన చెలుల కందఱకుఁ జాలదూరమైతిమి. నిజముగ నీ మనస్సు నీలో లేదు.

ఊర్వశి :

సఖీ! అట్లేయనుము. ఇదియేనా నేనన్న లతానికుంజము?

చిత్రలేఖ :

ఇదియే! లోనికరుగుదమా?

ఊర్వశి :

లోపలికేల? పైనిఁగల చోద్యమొకటి చూచితిమి కనుకనా?

చిత్రలేఖ :

నిజముగ నీవీకడకుఁ బొదరింటి కొఱకు రాలేదు. మనస్సున నెయ్యది పుట్టూహ మెయ్యదియో పెట్టుకొని జగము రోయు చుంటివి. నాతోఁ జెప్పక కప్పిపుచ్చెదే?

ఊర్వశి :

ఏమియు లేదు. ఇచ్చోఁ జల్లగనున్నది. కూరుచుందము.

చిత్రలేఖ :

ఏవీ నీమేకపిల్లలు?

ఊర్వశి :

ఇందే తిరుగాడుచుండు: నవిగో, వాని మాటకేమి? రమ్ము. కూరుచుండుము.

చిత్రలేఖ :

[తనలో] అంత నిర్లక్ష్యముగఁ దన పెంపుడులను నాచెలి యింతకుము న్నెన్నండు నని యెఱుగదు.

[ప్రకాశముగ] నెచ్చెలీ! ఏమో అధిక సంతాపము సూచించుచుంటివి. మన చెలు లెల్లఱు విచ్చలవిడి విహరించుచుండ మన మిట్లుంటఁ దగునా?

ఊర్వశి :

సఖీ! నీకును విహరింపఁ గోరికయున్న వారితో నుండుము. ఏలొకో! నాకొక సంస్మరణ మధిక దుస్సహమగుచున్నది

చిత్రలేఖ :

అది సంస్మరణ మాత్రముగనే తోఁచుట లేదు.

మ. కనుఱెప్పల్ తెరువాట్లు గొట్టెడిని ను
 త్కంఠాతిరేకంబులై,
 తనువున్ జెమ్మటవోసెడిన్, క్షణచల
 త్తారుణ్యమే పాఱెడిన్,
 మునునొక్కప్పుడు నింద్రుసమ్ముఖమునన్
 భూపాలుఁ డొక్కండు చూ

పినయూవున్ బ్రతిదోఁచుచుంటివినుమూ!
వింతౌదు నాకెంతయున్,

ఊర్వశి :

ఏమే ? నీయుత్ప్రేక్ష !

సీ. ఎత్తు లతలఁ దలయెత్తి పువ్వులుగోయఁ
బడిన పుష్పాసి మూఁతవడిన కనులు,
ఇంచుసోవల నలయికనుజేయుచుఁ గ్రోలు
నపుడు దుంపులు నార్ద్రమైన యొకలు,
నీరెండ రమ రమణీయరాగముతోఁడఁ
బైఁబడునెడ మీఱు పసిడి మిసిమి,
వసుధ వేష్టను గనుబట్టు క్రొంగ్రొత్తలు
చూచుతోఁడను మదిఁ దోఁచువింత,
ఎంతగను జేసిచెప్పితే ? యింత కింత
నీకు నగవడునవి సుమ్మి ! నేరవేమొ ?
అయిన పోనిమ్ము - ఇంక నీకల్ల రాత్రి
అల్ల నృత్యంబు జ్ఞాపకంబటె యదంత ?

చిత్రలేఖ :

జ్ఞాపకముగాక మఱపువచ్చునా ? ఒక వేళ నాభూషాఖండు మఱపువచ్చినను వాని వైపు నీవు పఱపిన యోరచూపునాకు మఱపు రానేరదు. ఆచూపువల్లనే

క. తాళము రాగము నృత్యము
లీల నొకటికాక వేఱురీతిని బడఁగ
జాలనఁజేసితి దివిజుల
యేలిక నానాటిరేయి నెప్పుడుమఱువక

ఊర్వశి :

పోదూ ! ఏమి యాక్షేపింతువు ? [అని గుక్కిళ్ళుమ్రింగుచు] ఆ రాజశేఖరుఁడు రాకపోయినఁ దీఱిపోవును.

చిత్రలేఖ :

రాకపోయిన మాకునీవు తక్కియుందువా ? రక్కసులవాతఁ బడియుందువు.

ఊర్వశి :

ఆమాటిప్పు డనకుము. ఒడలు ఝల్లు మనుచున్నది.

చిత్రలేఖ :

భయముతో దతనిపేరు స్మరింపుము. అతని పేరేమి ? అయ్యో ! మఱచిపోతినే ?

ఊర్వశి :

పురూరవుఁడు. [తనలో] పేరనునంత తమి యుప్పతిల్లుచున్నది.

చిత్రలేఖ :

అగునే. పురూరవ చక్రవర్తి. భూమిపైనే యుండవలయును. ఎవ్వరికిఁ జయింపరాని రక్కసులఁ బరిమార్చి నిన్నింద్రుదన కప్పగించునెడఁ బురూరవ చక్రవర్తికి జయ్ ! జయ్ ! అని విజయఘోషతో లాజలు జల్లునప్పుడేని యా నామధేయము నానోటనుండి యిప్పుడు వెలువడియుండినంత మధుమధుర మని యనిపించలేదు. విను మెద్దియో మేఘ గర్జనమేమో ? మన పంథ కడ్డము రాగలదు.

ఊర్వశి :

[దిక్కులుసూచి] ఏమియు లేదు. మన చెలుల విహారగీతిక.

చిత్రలేఖ :

అటువైపుగా దిటు. విను. అదిగో రథనేమి ధ్వని. రథము. రథముపై నెవ్వరో వింత పురుషులు వచ్చుచున్నారు. రమ్ము లోపలికి రమ్ము. [అని యిరువురు లతానికుంజము సొత్తురు.]

[రథముపైఁ బురూరవుడు వయస్యుడు ప్రవేశము.]

ప్రియవయస్యుఁడు :

ఆర్యపుత్రా ! ఎంతదూరము దీసికొని వచ్చితివి ! చింతపైఁ గొంగలఁ జూపించి నల్లే యిదిగో అదిగో అనుచు లాగికొని

వచ్చితివి. వృథాప్రయాసతప్ప మఱొండు గాదు. వెనుకకు మఱలుదము.

పురూరవుఁడు :

ఏమి? మిత్రమా! రథముపై వచ్చియే యింత యలసిపోతివా? పైఁ నెగిరిన యచ్చఱలను జూచితిమని త్రోవలో మనకగపడ్డ గొల్లవాండ్రుగూడ చెప్పిరికదా. తొందఱ పడకుము. చూడుమీ వనసౌందర్యము.

ప్రియవయస్యుఁడు :

ఇట్టివనమ్ము లెన్నేనిగంటి. అందున లెక్కలేనన్ని పెద్దపులులంగంటి.

పురూరవుఁడు :

ఇక్కడ పెద్దపులులు లేవు. అవిగో! అవిగో! మేఁక పిల్లలు. [అని మేఁకపిల్లలం దీయును.]

చిత్రలేఖ :

ఊర్వశీ! అవి మన మేఁకపిల్లలవలెనే యున్నవి.

ఊర్వశి :

అవి మనవే ఆ పురుషవరేణ్యుఁ డెవ్వరో యెత్తుకొనుచున్నాడు.

ప్రియవయస్యుఁడు :

ఇంతకు మన మడవికిఁ గాళ్ళీడ్చుకొనుచు వచ్చినది మేఁకపిల్లల కొఱకా?

పురూరవుఁడు :

ఎంత నల్లని మృదులంపు టజాశాబకంబులోయీ! మనలోకమునసిట్టి వున్నె?

ప్రియవయస్యుఁడు :

నీ కంతయు వింతే! వేలకొద్ది! నాబోఁటి సద్బ్రాహ్మణుఁడు యజ్ఞము దలపెట్టిన నర్బుదములు నిర్బుదములు.

పురూరవుఁడు :

ఇట్టి యమాయకజంతు సంతానమును గన్నప్పుడు యజ్ఞ యాగములఁ దలపెట్టకు. మిత్రమా! ఈ మేఁకపిల్ల మెడ నేదియో ముద్రణమున్నది? దీని మెడనున్నది. చదువుము.

ప్రియవయస్యుఁడు :

నేనునేర్పిన నాగరలిపి నీకు వచ్చినదో లేదో పరీక్షింతు. నీవే చదువుము. ఊర్వశి యేమో.

పురూరవుఁడు :

'ఊర్వశి' యనియే యున్నది. నా మహారాజ్ఞి నామమునుమా! నీవుకూడ చూచి నిశ్చయపఱుపుము. [వయస్యుఁడు పరికించు]

ఊర్వశి :

నన్నుఁ దనమహారాజ్ఞి యనుచున్నాడీ యపూర్వ పూరుషుఁ డెవ్వరో కదా?

చిత్రలేఖ :

ఎవ్వరైననేమి? నీదయకుఁ బాత్రుఁడు. మన మిదివఱకుఁ జూచినవాని పోలికనే కన్పట్టుచున్నాడు.

ఊర్వశి :

ఎవరందువు?

చిత్రలేఖ :

ఏమే నీ మౌగ్ధ్యము?

ఉ. నీ ముఖసీమపైనిఁ జెలి!
నీ దగు చూడ్కిని నీదుమోవిపై
నీ ముఱియంపుఁ బేరుపయి
నీ దగు కౌనున నీదుసందియున్
గామునిగేరు నీ సొగసు
కాడె కదమ్మ నిమేషమైనఁ ద
న్నేమఱకట్టి చూచినది
యింద్రసభన్ మునుజంకు గొంకఱన్.

ఊర్వశి :

పురూరవుఁడందువా?

చిత్రలేఖ :

సందియ మేల? సందియమ్మింకఁ గనుఁగొని వత్తు [అని పోవుట నభినయించు]

ఊర్వశి :

ఉండుము. నెచ్చెలు లిటువచ్చుచున్నారు వారిపాట సమీపమున వినవచ్చుచున్నది.

[పాటవినిపించు]

పురూరవుఁడు :

ఏమి వయస్యా! ఇంకను జూచుచునే యుంటివా? శిష్యుఁడే మేలనిపించు గురువు వీవు. ఇదిగో.

ప్రియవయస్యుఁడు :

లేదు. అక్షరము లేర్పాటుగఁ గనబడు చున్నవి కాని కూడఁబలుకఁజాలకుంటి. ఊ ....ర్వ....శి....ఊర్వశియే. అచ్చర మచ్చర మనుకోనులో నేమిరో వినఁబడుచు వచ్చి నది. అదిగో! మఱలవిను.

[పాటవినిపించు]

పురూరవుఁడు :

అగును. తొల్లి దేవేంద్రలోకమున నాల కించిన మృదుమధుర కంఠ గీతికాస్థాయిని వినవచ్చుచున్నది. అదుగో! వారందఱిటు వచ్చుచున్నారు.

ప్రియవయస్యుఁడు :

ఆడుచున్నారు.

పురూరవుఁడు :

ఆచెట్ల మొదళుల సందులనుండి వారి జిలుఁగు టంబరము లెట్లు తొలకాడు చున్నవో!

ప్రియవయస్యుఁడు :

మనలం గన్నవారు కాకులవోలె నెగిరి పోదురు. ఇటురా! ఈపుట్టవెనుక పొంచి యుందము. [అట్లుచేయుదురు]

పురూరవుఁడు :

కాకులనకుము. కోకిలలనుము.

ప్రియవయస్యుఁడు :

కంఠమాధుర్యమున—రూపమున దేవ తాస్త్రీలే. అచ్చఱలే! ఇటురా ఇటురా!

పురూరవుఁడు :

కంఠమాధుర్యముననే కోకిలలనుము

ప్రియవయస్యుఁడు :

ఊఁ కోకిలములు—

[రంభాదులు నృత్యగీతముతోఁ ప్రవేశము.]

నృత్యము—గానము.

ద్విపద

"వసివాడి యొకపువ్వు వసుధఁబడఁగఁ
బసరు మొగ్గొక్కటి పైకొమ్మ తొడుగ,
బిసరుహాక్షిరో! చక్క విడిచిన పూత
అసదృశంబని కోయ నలరెనాచేత;
ఎండాకు నడరవణించుచు నెగురఁ
గొండాడునట్లుండె గోమలపు టిగురు;
దోరకాయనుగొట్టి దోసిటఁబట్ట.
నోరామ! యదిపండి యున్నది వెట్ట.
అట్లున్నపొద్దిట్టు లరుణిమఁగ్రుంకుఁ
జెట్ల కెంజిగురుల జిగిమీఱి యింకు
ఱనుజుఁడందుకె యిందుఁ మఱిమఱిఁ బుట్టు
మనమేల పుట్టమో మహినింత వట్టు?
సౌందర్య మీభూమి సర్వప్రదమ్ము!
అందఱయందమే అతిసౌఖ్యదమ్ము!

[అని అందఱును ఆడి పాడుదురు.]

[సశేషము.]

—కవికొండల వేంకటరావు, బి.యల్.

# అస్సీరియా రాజు—'ఎసార్డన్'

[టాల్‌స్టాయి మహాశయునిచే రచియింపబడిన కథావ్యాసమున కనువాదము]

'ఎసార్డన్' అస్సీరియాదేశపు రాజు. 'లైలీ' అనే పేరుగల మరొక రాజున్నాడు. ఎసార్డన్ లైలీని ఓడించి, అతనిదేశంలోవున్న వూళ్ళన్నీ తగులబెట్టి, ప్రజలెందరినో ఖైదీలుగ తనదేశానికి తీసుకొనిపోయినాడు. శత్రుసైన్యాధిపతులలో కొందరిని ఉరితీయించాడు. మరికొందరికి బ్రతికిఉండగానే చర్మాలు వొలిపించి, శత్రురాజైన లైలీనికూడ పట్టి బంధించి చెరసాలలో ఉంచాడు.

ఎసార్డన్ ఒకనాటిరాత్రి పక్కమీద పడుకొని లైలీని వురితీయించిచంపే సాధనమెట్లాగునని యోచిస్తున్నాడు. ఇంతట్లో రాజుపడుకున్న పక్కవద్ద యేదో చప్పుడయింది. ఆ యలికిడివిని, రాజు కండ్లుతెరిచిచూచేసరికి ముసలివాడొకడు యెదురుగావచ్చి నిలబడ్డాడు. తెల్లని పొడుగుపాటిగడ్డంతో, ప్రశాంత భావాన్ని సూచించే చల్లనిచూపుతో, ప్రత్యక్షమై రాజుతో యిట్లన్నాడు: 'అయితే నీవు లైలీని ఉరితీయించాలనే కోరుకుంటున్నావు కాదూ?'

రాజు:—అవునూ! అయితే ఆపనిమాత్ర మెట్లా నెరవేరుతుందో నాకేమీ తోచటంలేదు.

ముసలివాడు:—లైలీవి నీవే సుమా!

రాజు:—అదెట్లా? నీకుతెలియదు. లైలీ లైలీయే నేను నేనే. మేమిద్దరమూ ఒకరెట్లా ఔతాము?

ముసలి:—నీవూ లైలీ యిద్దరూ ఒకటే. నీవు లైలీవి కావని, లైలీ నీవుకాదని నీవు ఊరకే అనుకుంటున్నావు—అంతే. మీరు వేరువేరువ్యక్తు లనుకొనటమే తప్పు. అది వట్టిభ్రమ.

రాజు:—నీఉద్దేశం నాకు బోధపడటంలేదు. ఈ మెత్తనిపాన్పుమీద పడుకొని నేనిక్కడనే వున్నట్లు నాకు తెలియదా? నాచుట్టూ స్త్రీపురుషుల నేకులు బానిసలై సేవచేయడం నీవుమాత్రం చూడటంలేదా? ఈరోజెట్లా జరుగుతున్నదో రేపూ అట్లాగే జరుగుతుంది. రేపు నా స్నేహితులందరితో కలసి మహావైభవంగా విందుజరపడానికి యేర్పాట్లుచేశాను. లైలీ ఖైదీగా పట్టుబడి పంజరంలో పక్షిలాగున చిక్కబడి యిక్కడనే ఉన్నాడు. రేపే వానికి చిత్రవధ కనిపెట్టుకొని యున్నది. రేపు వానిశరీరం కుక్కలూ నక్కలూ చీరుకొని తింటాయి.

ముసలి:—నీవు లైలీప్రాణం తీయలేవుసుమా!

రాజు:—అదేంమాటయ్యా? శత్రుసైన్యాన్నంతనూ యెట్లాచెండాడి చంపగలిగినానో వీడినీ అట్లాగే! పదునాలుగువేలసైన్యం నాచేతిలో చచ్చి పెద్దగుట్టగా పడ్డారే! ఇక వీడొక్కడూనా నాకులెక్క? అంతమంది నొక్కసారిగా నాశనంచేసి, నేనింతహాయిగా బ్రతికియున్నానా లేదా? ఇక నాశక్తినిగూర్చి యింతకంటె పెద్దరుజువేమికావలె?

ముసలి:—వాళ్ళందరూ నాశనమైనారని నీవెట్లా చెప్పగలవు?

రాజు:—ఎట్లాగా? వాళ్ళిప్పుడు నాకంటికగపడకుండా పోయినారు కనుక. వాళ్ళందరూ మితిలేని మరణవేదన అనుభవించారు. నాకేమి బాధలున్నాయి? దురదృష్టమంతా వాళ్ళది; ఐశ్వర్యం, అదృష్టం నావి.

ముసలి:—అదీ నీవు కల్పించుకున్న భ్రమే. నిన్ను నీవే క్షోభపెట్టుకున్నావుగాని వాళ్ళను నీవు చేయగలిగినదేమీలేదు.

రాజు:—నీ మాటకర్థం నాకు తెలియటంలేదు.

ముసలి:—అసలు తెలుసుకోవాలని యున్నదా నీకు?

రాజు:—ఆ, వున్నది.

'ఐతే యిట్లారా!' అనిచెపుతూ ముసలివాడు ఎసార్డన్‌రాజు నొక నీటితొట్టిదగ్గరకు తీసుకొనిపోయి, ఆ తొట్టిలో దిగమన్నాడు రాజును.

ఎపార్డన్ తొట్టిలోదిగి నిలబడ్డాడు.

వృద్ధుడొక నీళ్ళకూజా చేతబట్టుకొని 'నేనీ కూజాలోని నీళ్ళు నీ తలమీదపోయటం ప్రారంభించగానే నీతల నీటిలోముంచవలె' నన్నాడు.

వృద్ధుడు పైనుంచి నీళ్ళు పోస్తున్నాడు. రాజు తల వంచి నీటిలో మునిగినాడు.

తల నీటిలో ముంచగానే తాను అస్సీరియారాజు ననే విషయమే పూర్తిగా మరచిపోయినాడు. ఎవరో మరొక కొత్తవ్యక్తిననే నమ్మకం కలిగింది. ఆ కొత్త స్వరూపంలోనే విలువైన మెత్తని తూలికాతల్పంమీద సౌందర్యవతియైన ఒకస్త్రీ పక్కనేపడుకున్నట్లు కనిపించింది. తానంతకుపూర్వం ఆమెనెన్నడూ చూచి గురుగననుకుంటాడు. అయినా ఆమెయే తన భార్య యని స్పష్టంగా తెలుస్తున్నది. స్త్రీ పక్కమీదనే కూర్చుని ఎపార్డన్‌తో యిట్లన్నది: 'ప్రాణేశ్వరా, లైలీ! నిన్న నీవుపడ్డశ్రమతో చాలా అలసిపోయినావు పాపం! అందుకేకాబోలు యీరాత్రి యింత యెక్కువసేపు నిద్రపోయినా వనుకుంటాను. కడచిన రాత్రంతా నిన్నెవ్వరూవచ్చి లేపకుండా, నీకు నిద్ర భంగంకాకుండా, నీపక్కనే కాచుకొని కూర్చున్నాను. మంత్రులందరూవచ్చి సభామందిరంలో నీకోసం వేచి కూర్చున్నారు. దుస్తులువేసుకొని, వెంటనేపోయి వారిని కలుసుకొనటం మంచిది.'

ఆమె మాటలసందర్భాన్నిబట్టి ఎపార్డన్ తాను తప్పక లైలీయే అని తెలుసుకున్నాడు. తానే లైలీనను కొనటంలో వింతయేమీ కనిపించలేదు. కాని ఆసంగతి యింతకాలంవరకూ తనకెందుకు తెలియలేదని ఆశ్చర్యపడుతూ పక్కమీదనుండిలేచి, దుస్తులువేసుకొని సభామందిరానికి పోయినాడు.

మంత్రులందరూ తమ ప్రభువునుచూచి విధేయతతో తలలువంచి జోహారుచేశారు. రాజుయొక్క ఆజ్ఞ కాగానే అందరూ తమతమచోట్ల కూర్చున్నారు. అందులో ముఖ్యుడొకడు లేచి రాజుతో యిట్లన్నాడు: 'స్వామీ దుర్మార్గుడైన ఎపార్డన్ రాజు పెట్టే హింసలను యిక నెంతమాత్రమూ సహించలేము. ఇప్పుడే ఆదేశంమీదికి దండెత్తి శత్రువుతో యుద్ధం చేయటమే మన ముఖ్యకర్తవ్యం.' లైలీ (నీటిలోమునిగి వున్న ఎపార్డన్) యీసలహా అంగీకరించలేదు. ఎపార్డన్ చేసేపని అక్రమమని అతనికే గట్టిగా నచ్చచెప్పటానికి రాయబారులను పంపే యేర్పాటుచేసి, అప్పటికి సభ ముగించాడు. ఎపార్డన్‌తో చెప్పవలసిన విషయం రాయబారులకు భోధపరచి పంపించాడు. ఈ పని ముగించుకొని రాజు అడవిగాడిదల వేటకు బయలుదేరి పోయినాడు. వేటబాగా జరిగింది. రెండడవిగాడిదలను రాజు స్వయంగా చంపినాడు. మహదానందంతో యింటికి చేరుకొని స్నేహితులతో విందారగించి, విలాసార్థంగా బానిసస్త్రీలచేత నృత్యంచేయించాడు. మరునాడు తగవులు విచారించి తీర్పులు చెప్పటానికి కోర్టుకు హాజరైనాడు. తీర్పులుచెప్పవలసిన అనేక వ్యాజ్యాలు రాజు రాకకొరకెదురుచూస్తున్నవి. విచారణచేయవలసిన నేరస్థులెందరో వున్నారక్కడ. కేసుల విచారణ పూర్తిచేసుకొని రాజు గుర్రాన్నెక్కి తిరిగి వేటకు బయలుదేరినాడు. రెండవతడవకూడ వేట జయప్రదంగా సాగింది. రాజు స్వయంగా ఒక ముసలి ఆడ సింహాన్ని చంపి, దాని రెండు పిల్లలనూ పట్టుకున్నాడు. వేటముగించి యింటికిచేరుకొని, యథావిధిగా బంధువులతోకలిసి విందారగించి, భార్యాసమేతంగా ఆటపాటలలో రాత్రి హాయిగాగడిపినాడు.

ఈవిధంగా కొంతసేపు రాచకార్యాలలోను, కొంతసేపు విహార వినోదాలలోను కాలంగడుపుతూ వచ్చాడు రాజు. రోజులూ, వారాలూ గడిచినాయి. ఎపార్డన్‌వద్దకు పోయిన రాయబారుల రాకకోసం నిరీక్షిస్తున్నాడు. రాయబారులు తిరిగివచ్చే సరికొక నెల పట్టింది. శత్రువుచేత అవమానకరంగా శిక్షింపబడి, చెవులూ ముక్కులూ కోయించుకొని వచ్చారు రాయబారులు. ఎపార్డన్ రాయబారుల నిట్లా అవమానించడమేకాక మరొక జబర్దస్తీ సవాలుకూడా యిచ్చి పంపించాడు. తక్షణమే కొంత బంగారం, వెండి, ప్రశస్తమైన కొంతకలప అపరాధంకింద తనకు సమర్పిస్తూ, యికముందెప్పుడూ తన అధికారానికిలోబడి

వుండవలెననిన్నీ, లేకుంటే రాయబారులకు జరిగిన శాస్తే లైలీకికూడ జరగటం నిశ్చయమనిన్నీ లైలీతోనే చెప్పవలసిందని కబురుపంపినాడు.

లైలీ యీ సవాలందుకున్నాడు. మంత్రులను పిలిచి కూర్చోబెట్టి, దీనికేమి ప్రత్యుత్తరం పంపవలసివుంటుందని అడిగినాడు. ఒక్కక్షణమైనా ఆలస్యంకాకుండా ఎపార్డన్ మీదికి దండెత్తి యుద్ధంచేయుటమే కర్తవ్యమని మంత్రులు సలహాయిచ్చారు. రాజందు కంగీకరించి, తానే సైన్యాధిపత్యం వహించి, దండయాత్రకు బయలుదేరినాడు. ఏడుదినాలు ప్రయాణంచేశాడు. ప్రతిదినం రాజు తన సైన్యాన్ని స్వయంగా పరీక్షిస్తూ, సైనికులలో ధైర్యసాహసాలు పురికొల్పుతుండేవాడు. ఎనిమిదవదినాన్ని రాజుసైన్యం ఎపార్డన్‌సైన్యాన్ని ఒక విశాలమైన కొండలోయలో రాసుకున్నది. లోయగుండా ఒకనది పారుతున్నది. లైలీసైన్యం చాల శౌర్యంతో పోరాడింది. కాని శత్రుసైన్యం అంతులేకుండా కొండలమీదినుంచి మహా ప్రవాహంలాగున లోయలోకి దిగివచ్చి, లైలీసైన్యాన్ని కనబడకుండా ముంచివేసింది. ఇకనైనా జాగ్రతపడకపోతే ప్రమాదం సంభవిస్తుందనుకొని లైలీ రంగంమధ్యకు దుమికి, చేతనైనట్లల్లా శత్రువధ ప్రారంభించాడు. లైలీ సైన్యమంతాకలిసి కొన్నివందలుమాత్ర ముంటారు. శత్రుసైన్యం వేలసంఖ్యను మించిపోయింది. లైలీకి తీవ్రంగా గాయాలుతగిలి పట్టుబడ్డాడు. యుద్ధంలో పట్టుబడ్డ యితర ఖైదీలతోపాటు లైలీనికూడా బంధించి, సంకెళ్ళతోనే ఎపార్డన్ పట్టణానికి నడిపించుకొనిపోయినారు. తొమ్మిదిదినాలు ప్రయాణంచేసి పదో దినానికి 'సైన్వే'పట్టణం చేరుకున్నారు. అక్కడనే లైలీని చెరసాలలోవుంచారు. లైలీకి లజ్జతో తలవంచుకొనిపోయింది. సహింపరాని అప్రతిష్ఠ, అశక్తత, అపైన కోపం—వీటన్నిటివల్లనూ చెప్పరాని బాధకలిగింది. ఈ పెద్దబాధలో ఆకలిబాధగాని, గాయాలబాధగాని కనిపించలేదు. పోనీ శత్రువుమీద యేవిధానైనా పగ తీర్చుకుందామంటే, అందు కవకాశంగాని, శక్తిగాని తన కేమాత్రంలేదని తనలో తనకు స్పష్టంగా తెలుస్తూనే వున్నది. ఏదియేట్లున్నా తన దురవస్థచూచి శత్రువులు సంతోషపడకుండా, వాళ్ళేటువంటి కష్టాలుపెట్టినా సరే ధైర్యంతో బాధనంతనూ లోపల అణచిపెట్టుకునేటందుకే దృఢనిశ్చయం చేసుకున్నాడు. చావుకెదురుచూస్తూ చెరసాలలో యిరవైదినాలున్నాడు. యుద్ధంలో పట్టుబడ్డ తన యనుచరులనెందరినో ఒకరితరువాత నొకరిని ఉరిస్తంభంవద్దకు లాగుకొనిపోతూండగా కళ్ళారచూస్తున్నాడు. చనిపోయేటప్పుడు వాళ్ళనుభవించిన మరణవేదన చెవులారవింటున్నాడు. కొందరికి కాళ్ళూచేతులూ నరకబడటం, బ్రతికివుండగానే కొందరికి చర్మాలు వొలిపించడం, యింకా యిటువంటి చిత్రవధలెన్నో చూస్తున్నాడు. ఏమైనాసరే జాలిగాని భయంగాని మరేవిధమైన కలవరంగాని పైకి రానీయకుండా లోలోపలనే అణచిపెట్టుకొని, మనోవేదనతో కుమిలిపోతున్నాడు. తానెంతో ప్రేమిస్తున్న భార్యనుకూడ సంకెళ్ళతో కట్టి, యిద్దరు కొజ్జాలు ఆమెను తమవెంట లాగుకొనిపోతుండగా చూచాడు, ఆమెను ఎపార్డన్ యింటికే బానిసగా తీసుకొనిపోతున్నారని తెలుసుకున్నాడు. దుఃఖమెంతైనా వచ్చింది. అయినా నోరెత్తి యేడ్వకుండా బాధంతా లోపలనే అణచివేసుకున్నాడు. చెరసాలగుమ్మంవద్ద కావలిభటు డొకడున్నాడు: 'అయ్యో లైలీ! ఎంత జాలికరంగావున్నదయ్యా నీస్థితి. ఒకప్పుడు మహారాజువైయుండి, యిప్పటి కీగతికివచ్చావా?' అన్నాడు భటుడు. ఈమాట వినేసరికి తానుపొందిన కష్టనిష్ఠురాలన్నీ ఒక్కసారిగా లైలీకి జ్ఞప్తికివచ్చాయి. ఇక ఆత్మహత్యే గత్యంతరమని తోచింది. తన ముందున్న యినపకటకటాల తలుపును రెండుచేతులతో గట్టిగాపట్టుకొని, తల దానికిపెట్టి కొట్టుకోబోయినాడు! కాని అందుకుకూడ శక్తి చాలిందికాదు. నిరాశతో గొంతడిల్లుతూ మొదలునరికిన చెట్టువలె కిందబడ్డాడు. కొంతసేపటికి శిక్షకభటులిద్దరువచ్చి, కొట్టుతలుపు తెరచారు. చక్కలు విరిచికట్టి ఖైదీని కొరత వేసేస్థలానికి తీసుకొనిపోయినారు. అక్కడిస్థలమంతా రక్తమయమైవున్నది. అక్కడనే ఒకచోట వాడిగా

చెక్కబడ్డ కొయ్యయొకటి భూమిలో దింపబడివున్నది. అప్పుడే లైలీయొక్క స్నేహితుణ్ణొకణ్ణి గసికయొక్క వాడికొనమీదబెట్టి చీల్చి ముక్కలు చేశారు. కొయ్యంతా రక్తంతో తడిసి భయంకరంగా కనిపిస్తున్నది. తన్నుకూడ ఆకొయ్యకేవేసి చీల్చ చంపనున్నారని నిశ్చయంచేసుకున్నాడు లైలీ. దండనభటులు వచ్చి, లైలీ తొడుగుకున్న దుస్తులు విప్పి, మనిషిని కొయ్యమీదపెట్టడానికి అంతా సిద్ధంచేశారు. పూర్వమెంతో బలిష్ఠంగా, కంటి కింపుగావుండేది లైలీ శరీరం. ఇప్పుడింత కృశించి పాడైపోయిన తన శరీరాన్నొక్కసారి చూచుకొని ఉలికిపడ్డాడు. దండనభటు లిద్దరువచ్చి, చెరియొక కాలూపట్టుకొని, లైలీనియెత్తి కొయ్యమీదికి విసరికొట్టబోతున్నారు.

'అయ్యయ్యో, చివరకు నాకీదుర్మరణమా ప్రాప్తించింది! ఇట్లా నాశనమైపోవలసిందేనా!' అంటూ ఒక్క పెడబొబ్బపెట్టినాడు లైలీ. తనబాధను పైకి కనబరచకూడదనే మనోనిశ్చయం యింక నిలిచింది కాదు. పెద్దపెట్టున యేడుస్తూ, రక్షించి విడిచిపెట్టమని భటులతో మొరబెట్టుకున్నాడు. కాని లైలీప్రార్థన ఒక్కరూ చెవిని బెట్టలేదు.

'అబ్బా, యేమిది! నిద్రపోతున్నానా యేమిటి? ఇదంతా స్వప్నంలాగున్నదే!' అనుకుంటూ నిద్ర మేల్కొనటానికి ప్రయత్నించి, కొంతస్పృహ తెచ్చుకున్నాడు. ఆస్థితిలో తాను లైలీగాని ఎపార్డన్‌గాని కాననుకుంటాడు. అసలు మనుష్యరూపమేపోయి తానొకవిధమైన నాలుగుకాళ్ళ జంతువుగా మారినట్లు తనలో తనకే కనిపించింది. 'ఇదేమిటి. జంతువునా నేను? ఇంతవరకూ నాకీసంగతే తెలియకపోయిందే.' అని యనుకుంటూ ఆశ్చర్యపడ్డాడు.

ఒకానొక కొండలోయలో పచ్చిగడ్డి మేస్తూ తోకతో యీగలను తోలుకుంటున్నాడు ఎపార్డన్ రాజు. గాడిదపిల్ల యొకటి చుట్టుపట్ల గంతులువేస్తూ, కానుకటి కాళ్ళు విసిరి తన్నుకుంటూ, వాయువేగంతో ఎపార్డన్‌వద్దకు పరుగెత్తుకొని వచ్చింది. రావడంతోనే తల్లిపొదుగుకోసం తడవుకుంటూ, తనలేతముట్టెతో ఎపార్డన్ పొట్టకింద పొడవటం ప్రారంభించింది. పొదుగు నోటికందగానే పొడవటంమాని, పాలు తాగుతూ నెమ్మదిగా నిలబడ్డది గాడిదపిల్ల. తానొక ఆడగాడిదనని, ఆగాడిదపిల్లయొక్క తల్లి తానేనని ఎపార్డన్ అప్పటికి తెలుసుకున్నాడు. తనకీవిషయం తెలిసినందుకు విచార మెంతమాత్రం కలుగలేదు. ఒకవిధమైన ఆనందమే కలిగింది. తనలోను, తన బిడ్డలోను ఒక్కసారిగా పొంగి పొర్లిన జీవితానందమే ప్రత్యక్షంగా అనుభవానికి వచ్చింది.

కాని మరొక్క క్షణానికే యేమూలనుంచో బాణమొకటి ధ్వనిచేస్తూ యెగిరివచ్చి, ప్రస్తుతం గాడిదగావున్న ఎపార్డన్ డొక్కలో గుచ్చుకొని, లోపలికంటా దిగిపోయింది. ఆదెబ్బతో అమితబాధపడుతూ, పిల్లనోటనున్న పొదుగు బలవంతంగా బయటకి లాగుకొని, యెగిరిపడి, చెవులునిగిడ్చి, కొంతదూరంలోవున్న గాడిదలమందవైపుకు శక్తికొద్దీ పరుగెత్తింది తల్లి గాడిద. పిల్లకూడా వెంటబడి తల్లితో సమంగా పరుగెత్తుతూ పోయింది. తల్లీ పిల్లా గాడిదలమందదాపుకు చేరేటప్పడికే మందగాడిదలన్నీ బయలుదేరి ముందుకు పోతున్నాయి. ఈస్థితిలో మరొకయీటె రివ్వున యెగురుతూవచ్చి గాడిదపిల్ల మెడలో గుచ్చుకున్నది. పిల్ల జాలికరంగా రోదనంచేస్తూ, మోకాళ్ళమీద ముందుకుపడి, తిరిగి లేవలేకపోయింది. అది చూచి ఎపార్డన్ మరింతబాధపడుతూ, కన్నబిడ్డను విడిచిపోలేక, అక్కడి వాడక్కడే నిలిచిపోయినాడు. పిల్ల లేచి నిలబడబోయింది. కాళ్ళువణికి లేవలేక తిరిగి కిందబడ్డది. ఇంతట్లో మరొకవైపునుంచి భయంకరుడైన కిరాతుడొకడు వచ్చి, ఒక్కదెబ్బతో గాడిదపిల్ల తల నరికి పారవేశాడు.

'అబ్బబ్బా, యిదేమవస్థ. ఇంకా యిదంతా స్వప్నమే కాబోలు!' ననుకుంటూ మెలకువ తెచ్చుకుందామని ఎపార్డన్ మరొకసారి ప్రయత్నించాడు. 'నేను లైలీనీకాను, గాడిదనూకాను. నిజంగా యెపార్డన్ నేనే.' అని ధృవపరచుకొని బిగ్గరగా కేకపెడుతూ, యింతవరకూ నీళ్ళతొట్టిలో ముంచి వుంచిన

తలను పైకెత్తి, లేచి నిలబడ్డాడు. కూజా అడుగున మిగిలివున్న నీళ్ళు రాజుతలపైన పోసూ. వృద్ధుడు నీటి తొట్టి పక్కనే నిలబడివున్నాడు.

వృద్ధునివంక చూచి 'అయ్యా, ఎంతెంత భయంకరమైన బాధలనుభవించానయ్యా నాయనా! ఎంతకాలం అట్లా అనుభవించానో కదా!' అన్నాడు ఎషార్డన్.

'ఎంతో కాలమా? ఇప్పుడిప్పుడే కదా తల నీటిలోనుంచి యెత్తినావు! కూజాలో నీళ్ళింకా పూర్తి కానేలేదు చూచావా?' అన్నాడు వృద్ధుడు.

ఎషార్డన్ జవాబియ్యలేదు. భయంతో శరీరమంతా పులకించింది. వృద్ధునివంక తెల్లబోయి చూస్తూ నిలబడ్డాడు.

'ఇప్పటికైనా తెలిసిందా? నీ శత్రువనుకొన్న లైలీ నీవే యని, యుద్ధంలో నీవు చంపించిన సైనికులందరూ కూడ నీవే యని ఇప్పుడు బోధపడినదా? సైనికులే కాదు, నీ వడవిలో వేటాడిచంపి ఆమాంసంతో విందులు చేయించిన జంతువులుకూడా నీవే యని తెలుసుకున్నావా? నీప్రాణంమాత్రమే ప్రాణమని, నీ బ్రతుకే అన్నివస్తువులకంటె విలువైనదని నీ వనుకొనేవాడవు. ఆ దురభిప్రాయమే నీనుండి నేను తప్పించాను. ఇతరులను హింసించబోయి నిన్ను నీవే హింసించుకుంటున్నావని నీకు చూపటానికే నే నీ ప్రతిక్రియ పన్నినాను. ఇప్పుడైనా నీవీ సత్యాన్ని తెలుసుకోవలె: జీవులన్నిటిలో వుండే ప్రాణమొక్కటే. ప్రపంచమంతటా నిండివున్న యీ ప్రాణశక్తిలో నీ బ్రతుకొక చిన్న అణువు. ఈ శక్తి జీవులన్నిటితోపాటు నీకుకూడ పంచబడ్డది. దానిని వినియోగపరచటంలోనే బ్రతుకును బాగుచేసుకోగలవు, లేక పాడుచేసుకోనూగలవు, నీజీవితాన్ని విశాలపరచి ఉన్నతిచెందించుకోగలిగినా, లేక సంకుచితపరచి ధ్వంసంచేసుకున్నా నీదే బాధ్యత. నిన్ను యితరజీవులనుండి విడదీసే కృత్రిమభేదాలను రూపుమాపి, జీవకోటినంతనూ నీవలె ప్రేమిస్తూ బ్రతకటంలోనే నీకు ధన్యతకలుగుతుంది. అట్లా సంచరించటంద్వారానే నీకీయబడ్డ జీవితాన్ని అనంతంగా అభివృద్ధిచెందించుకోగలవు. ప్రపంచంలోకల్లా నీబ్రతుకొక్కటే బ్రతుకనుకొని, యితరులను హింసించడంలోనే నీయాధిక్యత చూచుకుంటే, నీకునీవే మహాద్రోహం చేసుకున్నవాడ వౌతావు. అటువంటి కృత్రిమంద్వారా యితరులుగారు, నీవే నాశనమయ్యేది. నీయెదటివానిలో వున్న ఆత్మశక్తిని ధ్వంసంచేయటం నీతరంగాదుసుమా! నీవు హింసించిన జీవులలోనిశక్తి యిప్పుడు నీ కంటికగపడకపోయినా, అదినాశనంమాత్రం కాలేదని తెలుసుకో. ఇతరుల జీవితకాలాన్ని తగ్గించి నీజీవితం పొడిగించుకుందామని ఆలోచించావు. కాని అది నీశక్తికిమించినపని. జీవితమనేదానికి స్థలకాల నిర్దేశంలేదు. వెయ్యేండ్లు బ్రతికినా లేక క్షణమాత్రం బ్రతికినా (నీ ఒక్కని బ్రతుకైనా, లేక ప్రపంచంలో నిండివున్న జీవులన్నిటి బ్రతుకైనా) అంతాసమానమే. సర్వత్రా నిండివున్న యీ యాత్మశక్తిని నిర్మూలించటంగాని, మార్పుచెందించటంగాని నీపనిగాదు. అది నీ శక్తిలోనూ లేదు. ఎందుచేతనంటే ఎల్లప్పుడూ, అన్నిచోట్లా, నిత్యంగావుండే వస్తువొక్కటే కనుక. మిగిలినదంతా ఉన్నట్లు కనబడుతుందేగాని, నిజానికదంతా అనిత్యం, అసత్యం.'

ఈమాటలు చెప్పి వృద్ధుడు మాయమైనాడు.

మర్నాడు ఉదయాన్నే లైలీని, అతనితో పట్టుకున్న యితర ఖైదీలను విడుదలచేయమనిన్నీ, ఉరిశిక్షలు నిలిపివేయమనిన్నీ ఎషార్డన్ ఉత్తరువు చేశాడు.

మూడవదినాన్ని ఎషార్డన్ తన రాజ్యాన్ని కుమారునికి స్వాధీనంచేశాడు. తాను నేర్చుకున్న సత్యాన్ని గూర్చి తిరిగి యోచించుకొని ఆత్మగతం చేసుకొనటానికి, జనసంచారంలేని యెడారి మధ్యకు పోయినాడు. తరువాత యీ రాజు పట్టణాలూ పల్లెలూ తిరిగి దేశాటనంచేస్తూ, జీవులందరిలోవుండే ప్రాణమంతా ఒక్కటేనని, ఇతరులను హింసింపగోరేవాళ్ళు నిజానికి తమనుతామే హింసించుకుంటారనీ ప్రజలలో ప్రబోధంచేయటమే పరమావధిగా చేసుకున్నాడు.

—తల్లాప్రగడ ప్రకాశరాయుడు, ఎం.ఏ.

# అశ్రుగీతి

౧

భావిదుర్భర కష్టంబు పలుక లేక
వానచినుకుల పేరి బాష్పములు విడిచి
నీలమేఘావకుంఠన నెగడుచుండఁ
బ్రకృతియే నన్ను నాందోళపఱుపసాగె॥

౨

మేఘగర్జారవంబులు మృత్యుభయద
దష్ట్రిలం జిక్కువాని యార్తస్వరంబు
కరణి వినబడుచుండె నాకర్ణములకుఁ
బ్రకృతి వినిపింపవుగదమ్మ పాపవార్త॥

౩

భరతవర్షంబు మామకభవనరాజ
మందు జరియించు సోదరు లందఱికిని
వితత భూకంపమున నతివృష్టికతన
నాధిబాధలు లేవుగదమ్మ ప్రకృతి॥

౪

ఘోరదారిద్ర్యబాధచేఁ గొంతనాఁగిలి
గురుతరక్షామ బాధచేఁ గొంతచివికి
బడలికంకాలశేషులై పలవరించు
భారతీయులు కుశలులే ప్రకృతిదేవి॥

౫

తలఁకువాడ్చిన యీ లతాతతుల పొలుపు
సహజగతి గోల్పడిన వనస్పతుల విధము
మొగులుకొంగున నెమ్మోము మూసికొనిన
నేటి యాషాఢదినలక్ష్మి నిధనకళలు
భావి భారతవర్ష దౌర్భాగ్యమునకు
వగచుగతిఁదోఁచె హేతువేమగునొ ప్రకృతి॥

స్వాతంత్ర్య పదవికై శ్రమసల్పిసల్పి
స్రుక్కియున్నారు మాసోదరులెల్ల
కడుపుకక్కురితికై కలవారిఁగొలువ
వలసిలోనున్నారు భారతప్రజలు
ప్రళయతాండవశూలి ప్రథమలీలలకె
బీభత్సమైపోయె బీహారుభూమి
అతివృష్టి సంజాత హావళికృతులకుఁ
బ్రకృతి బద్ధలువారి వగులుచునుండె
ఘోరమారణ యంత్రకోటి నార్జించి
ఖండాంతరప్రభుల్ కవురుచున్నారు
అతులదారిద్ర్య ఘోరాంధకూపమున
భారతీయులుబడి బడలియున్నారు
ప్రకృతి బీభత్సకల్పన జేసియింక
మాతృదేశము నెట్లు మార్పనున్నదియొ
తండ్రి! యీ విప్లవోద్ధతి జాతబాష్ప
గీతినాచే వినజేతువా? నేను
విననేర్తునా యిట్టి విలయగీతికల॥

— శేషాద్రి రమణకవులు.

# ఏది సౌఖ్యం

## (గత సంచిక తరువాయి.)

### ౫

మిస్ సుశీ అసలు పేరు సుశీల. వకీలు తల్పశాయి గారికి లేక లేక కలిగిన గారాబుబిడ్డ. తల్పశాయి గారు యౌవనంలోనే బ్రహ్మసమాజమతంలో కలిసి వెనవ ముండను పెళ్ళిచేసుకున్నారు. ఆయనగారు వకీలువృత్తి వల్ల కావలసినంతధనం ఆర్జించారు. ఇంకా సుశీలకేం తక్కువ! ఇంగ్లీషులో ఇంటర్మీడియేట్ తరగతిదాకా చదువుకున్నది. టెన్నిసు బాగా ఆడుతుంది, ఇప్పటి ఫాషనులు, ఫేనుక్రీములు, బర్మాముళ్ళు, చెప్పాలా యింగ్లీషు చదువుకున్నవాళ్ళకు యీకాలంలో!

నారాయణరావు బ్రహ్మసమాజమతంలో చేరిన కొద్దిరోజులకే, సుశీలతో పరిచయంకలిగింది ఒకరి నొకరు ప్రేమించుకున్నారు. తల్పశాయిగారుగూడా వారి వివాహానికి అంగీకరించాడు.

సూరన్నగారు మనస్సు తెగింపుచేసుకొని వెళ్ళిపోయిన వారంరోజులకు, సుశీలా నారాయణరావుల వివాహం. వివాహం రేపనగా యివ్వాళ జరిగినసంగతి. నారాయణరావు ఆంధ్రపత్రిక చదువుతున్నాడు. కాగితాలు తిరగవేస్తున్నాడన్నమాటే గాని, చదివి గ్రహిస్తున్నదేమీ లేదనవచ్చు. మోహన, సంతృప్తి, సంతోషం తాండవమాడుతున్నై. గాలిలో మేడలు కడుతున్నాడు. చంద్రికకొరకు నిరీక్షించే చకోరమువలె వానచినుకులకొరకు కనిపెట్టుకుండే బలాకపక్షివలె మరుసటి దినంకోసం యెదురుచూస్తున్నాడు. వసంతమప్పటి కోకిలవలె, మబ్బుపట్టినప్పటి నెమలివలెగా సంతోషిస్తున్నాడు.

పెళ్ళి అయింతర్వాత, తాను ఒకకుర్చీలో సుశీల ఒకకుర్చీలో పడుకొనివుంటారు. సుశీల అవునన్నది తాను కాదంటాడు తమాషాకు. అన్నివిషయాలలోను తనే గెలుస్తాడు.

'గెలిచినందుకు నాకేమిస్తా'వని అడుగుతాడు సుశీలను. సుశీలకోపం వచ్చిమాట్లాడదు. తను సుశీలదగ్గరకు చేరి 'నువ్విచ్చేదేమిటి? నేనే తీసుకుంటా'నంటూ సుశీలను ముద్దుపెట్టుకుంటాడు.

ఇంకోసారి తాను ఆఫీసునుంచి ఆలస్యంగా యింటికి వెళ్తాడు. సుశీల తనకోసం యెదురుచూస్తూ గుమ్మంలో నిలబడివుంటుంది. తనను చూడగనే కంట తడిపెట్టుకుంటుంది ఆలస్యంగావచ్చినందుకు. అప్పుడు తను 'సుశీలా! నీకన్న పిచ్చిపిల్లలు యీ ప్రపంచంలో యెక్కడాలేరు. నేనురావటం కాస్తఫారబాటువల్ల ఆలస్యమయితే దిగులుపడి కూర్చోటమే!' అంటూ బుజ్జగిస్తాడు.

మరోసారి సుశీల తనకన్న ముందుపడుకొంటుంది. తాను రాత్రి పదిపన్నెండిటీదాకా చదువుకొని, గదిలోకి దొంగవలె కాళ్ళు చప్పుడుచెయ్యకుండావెళ్ళి సుశీల చెక్కుటద్దాలను ముద్దాడుతాడు. సుశీల వులిక్కిపడి లేస్తుంది. ఏడుపు ప్రారంభిస్తుంది. 'ఏమిటి, ఏమిటి' అని తను తరిచితరిచి అడుగుతాడు. మొదట చెప్పదు. తరువాత 'ఏమిటాపని? దడుచుకోరూ' అంటుంది కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ. తాను 'మరే, మరే, అనంగా అనంగా' అని కథ ప్రారంభిస్తాడు తమాషాకు. సుశీల ఫక్కున నవ్వుతుంది.

ఈవిధంగా ఆలోచించుకుంటున్నాడు. ఉబ్బిపోతున్నాడు. కాగితాలు తిరగేస్తునేవున్నాడు. ఒకచోట 'కొద్దిరోజులక్రిందటనే బ్రహ్మసమాజమతములో చేరిన నారాయణరావుగారిభార్య సావిత్రి చనిపోయినది' అని వున్నది. నారాయణరావు చదువుకున్నాడు. అట్టే కష్టం అనిపించలేదు. ('మూర్ఖుడు. ఆ దుఃఖానికి వెయ్యిరెట్లు ఇప్పుడనుభవిస్తున్నాడు.' అని కంటతడిపెట్టాడు బైరాగి) సముద్రంలో కాకిరెట్ట,

## ౬

వివాహం మహావైభవంగా, సమాజాచార ప్రకారంగా జరిగింది. దానితోటే నారాయణరావు శని మహర్దశా ప్రారంభంగూడా జరిగింది.

పెద్దపెద్దవాళ్ళ ఆసరావుండటంవల్ల, మంచీవుద్యోగం దొరికింది ఒక కారు కొన్నాడు నారాయణరావు తనూ తనసుశీల షికారుచేయటానికి.

వివాహంజరిగిన మొదట నెలరోజులుగూడా వారికి జీవితం స్వర్గతుల్యం 'పిచ్చివాళ్లు స్వర్గం యెక్కడో ఉన్నదంటారు. ప్రపంచకంలోనేయున్నది స్వర్గం, కావలసినవాళ్ళకు' అనిపించింది వారికి.

దేశపు ప్రాముఖ్యత ప్రపంచకంలో యెంత ఔన్నత్యం పొందుతుందో, అంత అధఃపతనతప్పదు. మనుష్యుడు సంఘంలో యెంత ఉన్నతస్థానం పొందుతాడో అంత అధఃపతనతప్పదు. అల యెంత పైకి లేస్తుందో అంతకిందికి పడిపోకతప్పదు. 'పెరుగుట విరుగుటకొరకే' అది భగవంతునిచే నిర్దేశింపబడ్డది.

సుశీలా నారాయణరావులను స్వర్గతుల్యమనిపించిన ప్రేమ, ఒకరి కౌగిలినుండి మరియొకరిని విడదీసిన బ్రతుకులపై ఆశవదలుకొనునట్లు చేసినప్రేమ, మెల్లమెల్లగా కాలవైపరీత్యంవల్ల, సళ్ళడం ప్రారంభించింది బహుశః సావిత్రియొక్క సంతాపాగ్ని వారిమధ్య ప్రవేశించిందేమో. మొట్టమొదట వారికి పొత్తుకుదరనిది టెన్నిసు విషయంలో. సుశీల టెన్నిసు బాగాఆడుతుంది. నారాయణరావుకు అదేరాదు. సుశీల సాయంత్రం నాలుగు కాకముందే టెన్నిసుకు బయలుదేరేది. మళ్ళీ టెన్నిసు క్లబ్బునుంచి రాత్రి తొమ్మిదింటికిగాని యింటికిరాదు. సుశీల సౌశీల్యాన్ని అనుమానించటానికి నారాయణరావంత పశువుగాదు. కాని తను ఆఫీసునుంచి, సుశీల ముఖసందర్శనంచేసుకొని శ్రమ బాపుకుందామన్నే ఆతురతతో యింటికివచ్చేటప్పటికి, సుశీల యింట్లోవుండేది కాదు. నారాయణరావు చొక్కా కోటూవిప్పి, గోడకు తగిలించి మొహానికి చేతులు పెట్టుకొని యింట్లో కూర్చుండేవాడు. సుశీల హాయిగా కిలకిలా నవ్వుకుంటూ, గంతులు వేస్తూ టెన్నిసుపార్ట్నరు ఆనందరావుతోసహా టెన్నిసు ఆడుకుంటూవుండేది.

మనస్పర్థలు ప్రారంభమయినై. టెన్నిసుమానమని సుశీలతో చెప్పటానికి ధైర్యంలేకపోయింది నారాయణరావుకు. మనసులోనే కుళ్ళిపోతున్నాడు. కొన్నిసార్లు సూచనగా అన్నాడు. కాని లాభంలేకపోయింది. సాయంత్రం నాలుగుకాకముందే వెళ్ళటం, మళ్ళ రాత్రి తొమ్మిదింటికిరావటం, తనకు యిష్టంగాలేదనీ, ఆడుకుంటే సాయంత్రంపూట యేదో ఒకగంట ఆడుకుంటే బాగుంటుందనీ ముఖాముఖీన చెపుదామనుకొన్నాడు. కాని మాటపోతుందని కనిపెట్టాడు. గప్‌చిప్‌గా వూరుకున్నాడు. శని ఆదివారాలు నారాయణరావు యింట్లో ఉండేవాడు. నాలుగు గంటలు కావటం ఆలస్యం. టెన్నిసుపార్ట్నరు ఆనందరావువచ్చేవాడు. 'మిస్‌సుశీ, మిస్‌సుశీ' ఆని పిలిచేవాడు. యెంతపనిలో ఉన్నాసరే సుశీలవెళ్ళి తలుపుతీసి నవ్వుతూ 'హల్లో. అయామ్ ఆల్సో రెడీ' అంటూ కారులోయెక్కి బుర్రునపొయ్యేది టెన్నిసుకోర్టుకు. ఇంట్లోవున్నాడుగా నారాయణరావు వాడుగూడా మనిషేగా. వాడితో యేమన్నాచెప్పవచ్చునా. ఊహూ. పోనీ ఆనందరావు వచ్చినవాడు నారాయణరావును పలకరించనన్నా పలకరించేవాడా. ఏమీలేదు. సుశీలను పిలుచుకోటం, తుర్రున కారులో పరుగెత్తటం. మళ్ళీ తొమ్మిదింటికిగాని యిల్లుపట్టడు. పోని వచ్చినతరువాతనైనా, నారాయణరావు సంగతేమైన కనుక్కుంటుండా అంటే, అదీపూజ్యమే. ఆనందరావుతోపాటు రావటం, వాడితో కొన్నేపు కబుర్లు చెప్పుకోటం, వాడితో కరస్పర్శచేసి యింటికిపంపటం- తర్వాత నారాయణరావుతో అవసరమయితే మాట్లాడటం.

ఒకప్పుడు స్వర్గమనిపించిన జీవితం, యిప్పుడు దుర్భరమనిపించింది నారాయణరావుకు. ఒకసారి సుశీలతో 'నీవు యెందువల్లనో వెనకటివలె ప్రేమించటంలేదు నన్ను' అన్నాడు.

'నీకు అటువంటిఅనుమానం ఎందుకు కలిగిందో నాకు చాలా ఆశ్చర్యంగావున్నది. నీలోగూడా నేను అటువంటివిషయమే చూస్తున్నాను కొద్దిరోజులనుంచి

అన్నది సుశీల నారాయణరావుతో.

ఇద్దరు కాసేపు మాట్లాడలేదు.

'అయినా మనకు వివాహమయినకొత్తలో నీకు యింత టెన్నిసుపిచ్చిలేదు' అన్నాడు నారాయణ రావు గొంతుపెకలించుకొని.

సుశీలకు కోపంవచ్చింది.

'వివాహం అనేది బానిసత్వం అయినట్లయితే నేను పెళ్ళిచేసుకునేదాన్నే కాదు' అన్నది కొంచెంకఠినంగా.

నారాయణరావు మాట్లాడలేకపోయినాడు. గదిలో మంచంమీదకూలబడి కుర్రాడికి మల్లే వెక్కివెక్కియేడవటం మొదలుపెట్టాడు. ఆయేడ్పులో అప్రయత్నంగా 'సావిత్రి అయితేనో' అనుకున్నాడు. సమాధానం రాలేదు.

౭

రోజులు గడచిపోతున్నై. రోజులుగడచిన కొద్దీ సుశీలా నారాయణరావులకు మనస్పర్ధలు హెచ్చినై. ఒకరిని చూస్తే ఒకరు అనుమానించుకోటంకూడా ఆరంభం అయింది.

ఇప్పుడు సుశీలా నారాయణరావులు కొత్తవాళ్ళు. ఎవరిపనివారిది. ఎవరిపక్కవారిది. అవసరమేమన్నా వుంటే మాట్లాడుకోటం. అదీ బహుమితంగా అపరిచితులవలె. సుశీల తనయిష్టంవచ్చినపుడు వస్తుంది. 'అదేమని' నారాయణరావు అడుగడు. నారాయణరావు తనయిష్టంవచ్చినపుడు వెళ్ళుతాడు. మళ్ళీ యిష్టంవచ్చినపుడు వస్తాడు. 'ఎందుకు ఆలస్యం అయింద'ని సుశీల అడుగదు. దారులు వేరయిపోతున్నై. సుశీల యింట్లో ఉన్నంతసేపూ మొహం మాడ్చుకుంటున్నా, బయటకు వెళ్ళితే ఉల్లాసంగానే వుంటుంది. నారాయణరావుకు యెప్పుడూ దుఃఖమే. ఎప్పుడూ యేదో ఆలోచిస్తూ కూర్చోటమే. అంతకంతకూ కృశించిపోతున్నాడు నారాయణరావు.

ఒకరోజున నారాయణరావుకు జ్వరంవచ్చింది. డ్రైవరువెళ్ళి డాక్టరుగారిని పిలుచుకొచ్చాడు. డాక్టరుగారు చెయ్యిచూసి యేదో మందుపంపించాడు. 'జ్వరం తీవ్రమయినదే జాగ్రత్తగా వుండాల'నికూడా చెప్పాడు.

'జ్వరం యెట్లావున్నది' అని అడుగకపోతుందా సుశీల అనుకున్నాడు నారాయణరావు. కాని సుశీల అడగలేదు. నారాయణరావుకు జ్వరంతోపాటు మనోవేదనకూడా యెక్కువయింది. నాలుగుకొట్టాడు, ఆనందరావువచ్చి తలుపుకొట్టాడు. సుశీల టెన్నిసు బాటుతీసుకొని బయలుదేరబోతున్నది. నారాయణరావు యింకా పట్టలేకపోయినాడు.

'సుశీలా, టెన్నిసు ఆడుకోటానికి వెళ్లుతున్నావా' అన్నాడు దీనంగానూ సాభిప్రాయంగానూ.

'ఆ' అని సుశీల వెళ్ళిపోయింది విసిరినట్టుగా.

నారాయణరావు యింకా భరించలేకపోయినాడు. జీవితంకన్న నరకం యింకొకటిలేదనుకొన్నాడు. అనేక ఆలోచనలుతట్టినై మనస్సుకు. 'ఈ ఆనందరావు యెక్కడదాపరించాడు నా సంసారానికి. అసలు ఆడవాళ్ళకు యీ టెన్నిసు ఆటలేమిటి? పరిశ్రమ కావలసివస్తే హాయిగా వడ్లుదంపుకోకూడదా? పూర్వకాలపు ఆడవాళ్ళందరు టెన్నిసుఆటలే ఆడారా? వాళ్ళకు శరీరదార్ఢ్యంలేకపోయిందా? స్త్రీ పురుషులందరు యథేచ్ఛగా కలిసిమెలిసి తిరిగితే, స్త్రీకి సహజమయిన కోమలత్వం నశించిపోదా? ప్రబంధాలలో వర్ణించినస్త్రీ సహజమయిన ఆ కోమలత్వం ఆ తళుకు బెళుకు చూపులూ, ఆ వయ్యారపునడకలూ, నవనాగరికతలో ఆరితేరిన ఒక్కస్త్రీకి ఉన్నవా? లేవు. ఉండటానికి వీల్లేదు. నవనాగరికతా ప్రవాహం అటువంటిది' అని లోలోపల గొణుగుకొంటున్నాడు నారాయణరావు.

ఈ ఆలోచనలలో అప్రయత్నంగా సావిత్రి తలపుకు వచ్చింది. 'సావిత్రి ఐతే నన్నీ అవస్థలో వదలిపోతుందా' అనుకున్నాడు. ఈతడవ త్వరగానే సమాధానంవచ్చింది. 'పోదు, పోదు. యెప్పటికీ అట్లా చేయదు. చేజిక్కినబంగారాన్ని మట్టిఅనుకొని వదలిపెట్టాను. దూరానవున్నమట్టిని బంగారమనుకొని ఆశపడ్డాను. అనవసరంగా ఆ పతివ్రతను, ఆ ముగుదను, ఆ సావిత్రిని అష్టకష్టాలుపెట్టాను. పాపం అది చచ్చిపోవటానికికూడా నేనే కారణం. పతివ్రతలను యేడి

పించిన పాపం కట్టి కుడుపకుండాపోతుందా? ఆ పాప ఫలం యిక్కడనే అనుభవిస్తున్నా. సావిత్రి యెదుట కనబడ్డది. నిర్ఘాంతపోయినాడు. మనిషి ఆపాదమస్తకం గజగజ వణికిపోయినాడు. లేచికూర్చున్నాడు. ఒక చెయ్యి కళ్ళకు అడ్డంపెట్టుకోని 'పో, పో, నేను ఘోర పాపిని. నన్ను చూడకు. నీవుకూడా పాపాత్మురాలి వవుతావు. నిన్ను చంపిన మూర్ఖునిమీద నీకు కనికర మేమిటి! పో, పో, నేను చూడలేను' అన్నాడు. నారాయణరావు పెద్దగా.

ఈ జీవితంలో తనకింకా సుఖంవుండదు. ఈ జీవితం వదలిపెట్టేసెయ్యాలి. దానికిమార్గం ఆత్మహత్య చేసుకోటమే. 'ఛా! ఛా! ఆత్మహత్య! చేసిన పాపాలు చాలకనా! దీనికికూడా పైన శిక్షిస్తాడుయముడు' అనుకున్నాడు. ఎన్నోవిధాల ఆలోచించాడు యీ జీవితాన్ని వదలటానికి. మార్గం కనబడలేదు. ఆలోచించుకొన్న కొద్దీ, జీవితంమీద అసహ్యం యెక్కువవుతున్నది గాని తగ్గటంలేదు. కొద్దిసేపటికి ఒక్క కునుకుపట్టింది.

రాత్రి తొమ్మిదిగంట లయివుంటుంది. నారాయణ రావుకు మెలకువవచ్చింది. ఏదో చప్పుడయినట్టుగా వినబడ్డది వసారాలో. నారాయణరావు లేచి, తలుపు కొద్దిగాతెరచి చూశాడు. వసారా అంతా చీకటిగావుంది. కిటికీదగ్గరగావున్న మంచంమీద సుశీల చెంప కిందఆనించి కూర్చొనివున్నది. ఆనందరావు సుశీలముందర కూర్చొని వున్నాడు. వెన్నెల కిటికీలోనుంచి వచ్చి యిద్దరి మొహంమీద పడుతున్నది. ఆ దుర్మార్గుడు, ఆనంద రావు మొహంవంచి సుశీల రెండోచెంపను ముద్దుపెట్టుకుంటున్నాడు. నారాయణరావు ఇంకా చూడలేక పోయినాడు. గిర్రున వెనక్కుతిరిగాడు. రెండుచేతుల మధ్య తలకాయపెట్టుకోని కాసేపు ఆలోచించుకున్నాడు. ఇన్నాళ్ళనుంచి వేధిస్తున్న జీవితసమస్య యిప్పుడు చప్పున మనస్సుకుతట్టింది. అంతజ్వరంలో వున్నవాడు వైగుడ్డతోనే దొడ్డివాకిలి తీసుకోని బైట పడ్డాడు. ఆరాత్రిఅంతా నడిచాడు. దారిలేదు తెన్నూ లేదు. ఎక్కడికో.

దేశదేశాలు తిరిగాడు. అడవులు, కొండలు, నదులు పట్టుకోని సంచరించాడు. గడ్డాలు మీసాలు పెంచుకున్నాడు. బైరాగి అయినాడు. సర్వసంగపరిత్యాగం చేసుకున్నాడు. శ్రీశైలపర్వతపు అరణ్యాలలో ఒక స్నేహితుణ్ణి సంపాదించుకున్నాడు.

అంగదుడూ! తలిదండ్రులను ఏడిపించిన ఆ దుర్మార్గుడు; భార్యనుచంపుకున్న ఘోరపాపి; స్వమతంకన్న పరమతం ఏమో జరిగిస్తుందని పోయిన తెలివితక్కువ కుంక; వెనకటిజీవితంలో జరిగిన సంగతులన్నీ జ్ఞాపకం తెచ్చుకోని పశ్చాత్తాపాగ్నికి దగ్ధమైపోతున్న ఆ, నా--రా--య--ణ--రా--వు, ఎవరో తెలుసునా?

'నేనే' అంటూ కళ్ళనీళ్ళు తుడుచుకోని,

'ఆ స్నేహితుడో'

'నువ్వే' అన్నాడు.

'ఏం, అంగదుడూ! వింటున్నావా?' అని వూపాడు బైరాగి అంగదుణ్ణి. అంగదుడు హాయిగా గుర్రుపెట్టి నిద్రపోతున్నది.

—క. సాంబమూర్తి.

## విధి

ఈయనంత విషమ దాస్య మేభరింప
జాల దివ్యాతిదివ్య స్వేచ్ఛాప్రపూర్ణ
మతిని బానిసీలనడుమ మనుమటంచు
నాజ్ఞ యిడనేల నోయి దేవాది దేవ!

సదమలానంద సామ్రాజ్య చక్రవర్తి
నీబహుళ దుఃఖమయభూమి నేలుమంచు
ముదల యిచ్చితేల మహాప్రభూ! వహింప
నీ జడ జన ప్రపంచైక రాజపదవి.

లలిత సంగీత నవసుధా లహరి తేజ
రిల్లు ఆదివ్య పథచరన్మృదుపదాళి
కీ యసహ్య మాక్రందనాకీర్ణ జగతి
కంటకావృత దుష్పథ గమన విధులె?

—కాశిరాజు రామమోహనశర్మ.

# గుసగుసలు

**స్థలము**

ఒకానొక పట్టణములో ఒక గ్రంథాలయమునందలి, ఒక ఆల్మయిరాలో, రెండవ అరలో కొంచెము ఎడమవైపున.

**కాలము**

అంధకారము. వెలుపల కుంభవర్షము. మెరుపులు, ఉరుములు, అప్పుడపుడు పెద్ద గాలితెర గంటలు, 12.

**ప్రవేశము**

రెండు గ్రంథాలు.

❖

ఒక గ్రంథము:—ఎందుకింత విరగబాటు? నామీద కాలా ఒరుగుతావెందుకు. సరిగా నిలవరాదా.

రెండవ గ్రంథము:—నీమీద కొరుగుతానా, నిన్ను వెడలనడిపించి తీర్తాను! జాగ్రత్త—కబడ్దార్.

మొదటి గ్రంథము:—నీ పేరేమి, నాయనా?

రెండవ గ్రంథము:—నా పేరు సింహగడ్ విజయము.

మొ. గ్రం:—ఓహో! హిందీ గ్రంథానివా? అందుకా విరగబాటు!

రెం గ్రం:—నీపేరేమి?

మొ. గ్రం:—నన్ను ఆంధ్ర భాగవతమంటారు.

సింహగడ్ విజయము:—ఇంకా భాగోతాలేమిటి? తెలుగు, తెలుగువానికే తెగులుగా మారింది. హిందీయొక్క శంఖరవము ఆంధ్రదేశాన్ని ఆక్రమించినది. ఆంధ్ర భాగోత భారతాలు చెదలకు ఇక ఫలాహారమే!!

భాగవతము:—నాయనా! సత్యం పలికేవు. కాలవాహినిలో కలిగిన కల్లోలంవలన కొన్ని సుడిగుండాలేర్పడినా, ప్రాచీనవైభవమంతా సుడిగుండాలలో పడి ముంచబడినా. మా తెలుగునాటిలో మీదే ప్రస్తుతం ప్రభ.

సింహ:—తెలుగుదేశమే కాదు. హిందూదేశమంతటాను!

భాగ:—నిజమే! భరతఖండానికంతటికి హిందీయే జాతీయభాషయై బీరపీచులాగు దేశంలో ఒకవిధమైన ఐక్యం తేగలదనేగా, ఇప్పటివారు చెప్పేమాటలు?

సింహ:—అందు అసత్యంలేదు సుమా! ఏనాటికైనా హిందీ అనే నూలుపోగుతో భరతఖండం బంధింపబడి, ఒకే పలుకుమీద, ఒకే బాటవెంట, ఒకే విధంగా, నడువనున్నది; ముందున్నది మోక్షం కండ్లుతెరచి కనిపెట్టిచూడు........!

భాగ:—అన్నీచూస్తాను! ఎంతవరకీ వ్యామోహం నిలచియుంటుందో, నా కెఱుక లేకపోలేదు. ఇదియొక వేలంవెఱ్ఱి అంటాను. మరీ ఆంధ్రుడికి కలిగిన ఒక ఉన్మాదంక్రింద దీనిని లెఖ్ఖవేయవచ్చు. కొంచెం ఉబ్బిస్తేచాలు, మావాడికి, మీది గుడ్డనిలవదు. ఏమేమో అవస్థలుపడతాడు; ఎన్నెన్నో వేషాలువేస్తాడు; తన ఇల్లుగుల్ల

యినా; తనభాష నాశనమైనా, తనప్రతిష్ట భగ్నమయినా; తనరక్తం చచ్చిపోయినా; అర్థంలేని వేషాలన్నీ వేస్తాడు. ఇతర రాష్ట్రాల వారు ఒక్కరు ఇతనిని జూచి సంతోషించే వారు లేరు. ఒక్కసారైనా కాంగ్రెసు మహాసభకు పిల్చి పీఠమిచ్చినవారు లేరు. ఎందువల్ల? తెలుసుకొన్నారు. ఇది నేతిబీరకాయ అని! ఆంధ్ర దేశంలో, ఎసెంబ్లీసభకు ఒక్క అభ్యర్థిఅయినా పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నుకోబడలేదే? ఇతరరాష్ట్రాలలో దాదాపు ఆరుగురుపైగా అట్లావచ్చారు. ఇదే, మనవారికి కాంగ్రెసుపైగల అభిమానము! ఇంట్లోకూర్చుని, ఒకరితో పోటీ లేకుండా, లోకానికి తెలియకుండా, ఆ అమ్మ నేర్చుకుంటున్నదని ఈ అమ్మ, ఈ అమ్మ అని, ఆ అమ్మ, ఇలా హిందీ, హిందీ, అని మారుమ్రోగిపోతున్నది దేశమంతా! కాంగ్రెసు అంటే పనిచేసి చూపించలేనపుడు. హిందీ పలుకులు నేర్చుకొని, జాతీయత పెంచి, మీరు దేశంలో ఐకమత్యం, కుదర్చగలరా? తెలుగువారి నాలుకపై ప్రతి దినము, మ్రోగిపోతూ గాంధీగారివంటి మహనీయుడు, ఏయూరుపోయినా ఈయన పేరే చెప్పుకుంటారేమని, ఆశ్చర్యపోయిన, నాగేశ్వరరావు పంతులుగారికికూడా తెలుగు దేశంలో పోటీనిల్చారు కదూ! ఆంధ్రునకెంత త్యాగమున్నదయ్యా!

హిందీ నేర్చుకోవడం ఒక 'ఫాషను'గా మారింది. కాని ఒక మహోత్తరవిషయాన్ని సాధించడానికని కాదు మీరందరు ఇలా ఎగబడడం. ఎన్నిహిందీలు నేర్చుకున్నా, మనస్సులో దేశకళ్యాణానికి దారితీయాలని తలచుకొననిది లాభంలేదు; కేవలం ఒక భాష నేర్చుకున్నంతమాత్రంలో దేశం బాగుపడదు, జాతీయత అభివృద్ధి కానేరదు. హృదయము నిర్మలంకావాలి, ఒకడు బాగుపడిపోతున్నాడే అనేఏడ్పు తగ్గిపోవాలి, జీవితమంతా, దేశాభ్యుదయానికి వినియోగించి, కారాగారములందు, సంవత్సరములపాటు కుమిలిపోయి, వెలుపలకువచ్చిన త్యాగమూర్తులపై ఆంధ్రుడు గౌరవంచూపాలి. ఒకవిధమైన భక్తి సంపాదించాలి; అభిమానం. ప్రేమ, గలగాలి అంతేగాని, హిందీ నేను నేర్చుకున్నాను, పట్టాభి సీతారామయ్యగారికి నాకు భేదంలేనేలేదు, ఆయనంతటివాడను నేను అనుకుంటున్నాడు తెలుగువాడు. హిందీ నేర్చినంతమాత్రాన, ప్రతివాడు, దేశభక్తుడేనా? హిందీ నేర్వని వారంతా దేశద్రోహులేనా? హిందీ నేర్వని వారికి జాతీయత దేశంలో అభివృద్ధి కావాలని అభిప్రాయంలేనట్లే? హిందీ నేర్చుకున్నవారే, దేశాన్ని మరమ్మతుచేసి, రేపటి దినము, స్వరాజ్యం సంపాదించి తెస్తారన్నమాట! ఎవరైనా పూచీఇస్తారా?

దేశభక్తి, దేశాభ్యుదయానికి దోహదం గూర్చాలనేటి ఆసక్తి,పుట్టించగలుగున దేది? మన మనస్సులోకలుగు మాలిన్యరహితమైన ఆవేశమే అందుకు కారణం, ఆ ఆవేశం కలిగించడానికి ఏభాషఅయినా ఒకటే!

సింహ:—దేశమంతా ఒక్కభాష నిలచిన, ఐకమత్యం కలుగుతుంది, రేపు స్వరాజ్యం వచ్చినా పరిపాలన సులభంగా దొల్లిపోతుంది. ఒక రాష్ట్రమువారి ఉద్దేశ్యాలు వేరొకరాష్ట్రమువారు సులభంగా గ్రహించి, వ్యవహారాలు ఇబ్బందిలేకుండా జరుపుకోవచ్చు మన హిందూదేశంలోగల భాషలు ఏ ఇతరదేశమందు లేవు. అందుకనే మనదేశమున ఐకమత్యంలేదు. అట్టి కష్టాలను గట్టెక్కించడానికే గాంధీగారివంటి నాయకులు హిందీ, దేశమంతటా వ్యాపిం

చాలని ప్రబోధించుచున్నారు. దేశకళ్యాణానికి తోడ్పడే ఈ యుద్యమాన్ని నిరసించడం కేవలం అన్యాయము. ఈ యుద్యమమువలని ఫలితములు కొన్నివత్సరములు గడచినగాని తెలియవు, ఇపుడిది యొక వెఱ్ఱియుద్యమంగా దోపకపోదు మాట్లాడేముందు బాగా ఆలోచించాలి!

భాగ:—నీవు చెప్పినవన్నీ సత్యములు కాకపోవు. అందలి ప్రతిఅక్షరము ఆచరణలోనికివచ్చిననేగాని అది ఫలవంతముకాదు. ప్రతివ్యక్తిలో రెండుభేదాలున్నవి. ఒకటి, మాటలతో హృదయాన్ని సంతోషపెట్టుకొనేవిధము. రెండవది పనిచేసి హృదయాన్ని తృప్తిపరచుకునే విధము. రేపటి దినము ఆపనిచేసి, దానిఫలితం ఎల్లుండి అనుభవించవచ్చుననుకోవడం, ఒకతృప్తి. పని చేస్తూ ఫలితం కండ్లారచూస్తూ, తృప్తిపడడం రెండవవిధము. హిందీ నేర్వడంవల్ల, జాతీయత అభివృద్ధిచెంది ముందు భావిభారతానికి భాగ్యం కలుగజేస్తుందని అనుకున్నంత మాత్రంలో ఆనందంలేదు. హిందీతో పాటు దేశాభ్యుదయానికి అనువగు ఆలోచనలు కలుగజేస్తూ అదేవిధంగా ప్రతివారికి అవిదితమగు, దేశాభిమానం కలుగ చేయాలి, కేవలం ఒకభాష చేయగలదిలేదు. ఆభాషలో తేలే అభిప్రాయాలు. ఆశయాలు, ప్రయోజనకారి కాగలవుగాని, కేవలం హిందీ అక్షరాలు, క్రియలు, నామ వాచకములు, ఏమీచేయలేవు. ఒకేభాషను దేశమంతటా వ్యాపింపజేయాలని ఏలా ఆలోచిస్తున్నామో, ఆలాగే, ఒకేభావాన్ని, ఒకే ఆశయాన్ని, భాషతోపాటు దేశంలో వ్యాపింపచేయగలిగితేనే మనం చేసేపనిలో అర్థమున్నట్లు. ఆంగ్లము మనదేశంలో చాలావరకు వ్యాపించింది, ఆ భాషయొక్క వ్యాప్తితోపాటు ఎట్టిభావాలు, దేశంలో వ్యాపించినవో తెలియనివారున్నారా? ఆ భాష మనదేశంలో ప్రవేశించిన తరువాత, మన వాఙ్మయములు, మన రాజకీయపరిస్థితులు, మన ఆచారవ్యవహారములు ఏలా మారినవో తెలియనివారున్నారా? ఐతే, ఈమార్పులు చెడ్డవా? మంచివా? అని ఆలోచించి, అందలి మంచిచెడ్డలు గ్రహించి, హిందీ ప్రచారకులు పనిచేయవలసియుంటుంది. ఇంతవరకు వీరిప్రచారము మంచిదైతే, సంతోషించాలి, కాకపోతే విరమించాలి. కేవలం భాషావ్యాప్తికి తంటాలుపడితే లాభంలేదు, దానివ్యాప్తి ఎంతవరకు జాతీయతను పెంచగల్గునట్లు వినియోగించాలో, ఆలోచించి, ఆబాటవెంట నడవాలి; పరీక్షలు, ప్రయిజులు, భాషపై వ్యామోహాన్ని పెంచేవేగాని, హృదయాన్ని మరమ్మతు చేసేవికావు. వీటివలన భాషలో ప్రవీణుడౌతాడేమోగాని, భావంలో పవిత్రత సంపాదింపలేడు. ప్రథమంలోనే దేశభక్తి బీజము హృదయక్షేత్రములో నాటితే భాషాప్రవీణుడయ్యేటప్పటికల్లా భావములో కూడా ప్రతిభావంతుడై తనవిజ్ఞానాన్ని సక్రమముగా వినియోగింపగలుగుతాడు.

హిందీ నేర్చుకొనినంత మాత్రములో జాతీయత అభివృద్ధిచెందుతుందని, ఐకమత్యం అధికమగునని తలచేవారు ఈ చిన్ని ఉదాహరణమును చిత్తగించండి..................

జాతీయతను అభివృద్ధిచేయాలని, స్వరాజ్యం సంపాదించాలని, కంకణము ధరించి, హిందీయందు అధిక పాండిత్యము సంపాదించియున్నవారితో విలసిల్లుచున్న ఈ కాంగ్రెసు సంఘాలలో ఇన్ని కలహాలెందుకు, ప్రతిదినము బయలుదేరుతున్నవో? పెద్దల తీర్పులెందుకు కావలసి వచ్చు

చున్నవో? అందరూ హిందీలో పండితు లేగా? జాతీయత ఎందుకు మరచిపోయారు? ఐకమత్యం ఎందుకు నిలబెట్టుకోలేరు? హిందీ దేశమంతా మాట్లాడే రోజువచ్చినా అపుడు ఇంతేగా? భావాలు విషపూరితము లైతే భాష మనలను బంధించనేరదు. హృదయములోని భావములను వెలువరిం చుట కేర్పడిన 'పనిముట్టు' భాష. అది ఒక టైనా, దానివలన వెలువరింపబడే భావాలు ఒకటి కానిది, దేశానికి కలిగే లాభం, నిండుసున్న.

సింహ:—చిల్లరభాషలు పెక్కులుండుట కన్న; ఒకేభాషయుండుట కొంతవరకైనా మంచిదే కదా! వేరువేరు భాషలతో వేరు వేరు అభిప్రాయాలున్నచో ఇంకా చిక్కు లెక్కువకలవు గదా! ఒకేభాష దేశంలో ఉన్నప్పుడు, భావాలు వేరుగానున్నా క్రుడ్డిలో మెల్లగా కొంతవరకు నయమే గదా!............

భాగ:—కావచ్చును, గాని,మన దేశమున గల భాషలు, మతములు, ఇతరచోట్ల లేవు. ఇందుకు నీవుకూడా ఒప్పుకున్నావు. ఏభాష వారు ఆయాభాషను పెంపొందించుకోవడం సహజము. అలాచేయకూడదని చెప్పేవారుం డరు. మాతృభాష నేర్చుకోవడం, జాతీయ భాష నేర్చుకోవడం, అనే రెండుపనులు ప్రతి భారతీయుడు ప్రస్తుతం చేయవలసి వచ్చింది. ఇదిట్లుండగా, ఇంగ్లీషు నేర్చుకోవలసి వచ్చింది ఇది లేకపోతే, కాలుకదపడం కష్టం, అదిప్రస్తుతం రాజభాష, వ్యవహారానికి అత్యా వసరం: కాబట్టి,హిందీని,తనమాతృభాషను, యింగ్లీషును, ప్రతివాడు నేర్చుకొనవలసి వచ్చింది. జీవితమున మూడు భాషలు నిత్య వ్యవహారానికి ఉపయోగించేవిధంగా నేర్చు కోవాలంటే, ఎంత కాలం పట్టునో విచారింప వలె. కాలమంతా నేర్చుకోవడంతో పోతుంటే, ఈసంపాదించిన విజ్ఞానాన్ని వినియోగించేదెపుడు? అయితే మా తెలుగు వారిలో కొందరు మాతృభాషను చాలా వరకు అభివృద్ధి చేసుకోవడం వదలివేశారు, ఆకాలాన్ని హిందీకి వినియోగిస్తున్నారు. పునాది లేని మేడకట్టడఃమంటే యిదే అర్థము, తల్లిభాషను వదలి ఎంతజాతీయతను అభి వృద్ధిచేసేదైనా యితరభాషను అన్నివేళల ఆరాధించడం అతితెలివితక్కువక్రింద జమ పచ్చి తీరుతుంది. మహాత్ముడు తన స్వీయ చరిత్రను హిందీని వ్రాయక, తనస్వభాష యగు, గుజరాతిలో ఎందుకువ్రాశాడో? ............మాతృభాషయొక్క మర్యాద, దానియొక్క ఉపయోగం, స్వానుభవం వల్ల కనుగొనకపోతే, మహాత్ముడు, మొన్న బొంబాయి కాంగ్రెసులో 80000 మంది ముందు, ఏమన్నాడు: దయతో విప్పిచూడు. Hindu: 29-10-34 తేదికలది; పుట 9, కాలం 3 లో "Addressing the house in English, Mr. Gondhi said that it was impoissible to pour out one's soul, again in another language." అదే విధంగా తల్లిబాషనుగూర్చి ఒక ఆధుని కాంధ్రకవి అన్నాడు:—

"తనదుబాసకన్న తల్లి యెవ్వానికి
సత్యమన్యభాష సవతి తల్లి
తనదు ధర్మమందు తానుమ్రగ్గుటలగ్గు
అన్యధర్మ మది భయావహంబు."

మనలో కొందరు ప్రస్తుతంచేయుచున్న పని చాల శోచనీయమైనది. తల్లిబాషను ఈ రీతి నిరసించడం; ఈలాగా అనాదరించడం. ఎవరు మెచ్చుకొనరు. హిందీమీద తమకు గల ప్రేమను సగమైన, తెనుగుతల్లికి విని యోగించి ఋణంతీర్చుకొందురు గాక!

సింహ:—ప్రస్తుతం పత్రికలయందు ఈ విషయాన్నిగురించి ప్రకటింపబడుచున్న వాదనలు విన్నారా?

భాగ:—ఈమధ్య నొకకుఱ్ఱాడు, ఈ ఆల్నయిరా దగ్గర కూర్చుని చదువుచుండగా కొన్ని నాచెవిని పడినవి. ఆంధ్రుని కుండవలసిన ఆతురత, చాలవరకు ఆవ్యాసాలలో కనబడుతున్నది. విషయాన్నివదలి, అక్రమంగా వ్యక్తిదూషణకి దిగినాడు. హిందీ - తెలుగు, ఎట్లున్నా, కొద్దిలో తెలుగునాటిలో, కల్లోలం బయలుదేరేటట్లున్నది. విషయానికి చెందిన వాదన లెంతకఠినముగానున్నా మంచిదే కాని ఆకఠినత్వం, ఆవిషయాన్ని చర్చించే వ్యక్తులయెడ కనబడటం శోచనీయము. యిది ఒకరియింటి విషయం కాదు, కొట్లాడడానికి! కృష్ణాపత్రికలో ఒక హిందీ అభిమాని, 'దండయాత్ర' అనే వ్యాసంవ్రాశారు. వ్యాసమంతా చాల పెటుకుగానున్నది, ఎందుకీదండయాత్రలు? అనవసరమైన మాటలతో అన్యులహృదయాల నెందుకు, కష్టపెట్టడం? ఈలాచేస్తే హిందీకి వ్యాప్తి ఎక్కువకాగలదా? విషయాన్నిగురించి ఎంతజోరుగానైనా వ్రాయటం తప్పులేదు, కాని వ్యక్తులనుగురించి...

సింహ:—నీపలుకులు అన్నీ విన్నాను. నాకు, నీకంటే లోకానుభవం లేదుసుమా?

భాగ:—మొదలు కొంచెం చూపించావు, తుదిని సంతోషంకలిగించావు. అభిప్రాయాలు మారడం వేరేవిషయము, మర్యాదాతో అభిప్రాయాలు ఒకరికొకరు వివరించుకోవడం, వేరేవిషయము.

సింహ:—తెల్లవారినది. తలుపులుతీస్తున్నారు.

భాగ:—గప్ చిప్.

--చిరుమామిళ్ల శివరామకృష్ణప్రసాదు, బి.ఏ.

## గీత

నీలిమములేని యీ శరత్కాలరాత్రి
విధివశమ్మున బ్రిదివిన హృదయవీణ
కోరుచున్నది జీవాల తారతంత్రి
గగనమంటెడు జయపతాకములగాంచి
పారతంత్ర్య నిర్మాల్య పథముద్రొక్కి
విశ్వమంతయు మనమయి విరిసిపోయి
తారుమారైన యావదాంధ్ర ప్రశస్తి,
మరల నెగడునందాక కర్మప్రకర్ష
పాడుకొందాము జగతి విప్లవమురేగ
మానవేవద్దు గీతోక్త గానరవళి.

—స్థానాపతి సత్యనారాయణశాస్త్రి.

## మంచు

సీ. నేలయంతంతయు నెఱిఁ జంద్ర కాంతపు
  జాలఁ గట్టించిన లీలమెఱసె
నింగి యంతంతయుఁబొంగి దుగ్ధాభోంధి
  నిట్ట దొట్టినమాడ్కి దట్టమయ్యె
సకలజీవులమీఁదఁ బ్రకటమై హరికీర్తి
  కలయఁ బర్వినమాడ్కి దెలుపుచూపె
నక్కజంబుగ నెల్లదిక్కులు నొక్కటఁ
  దెరచీరలెత్తిన కరణిఁదోఁచె

గీ. నగములెల్లను నీహార నగములయ్యెఁ
దరువులెల్లను ఘనసార తరువులయ్యెఁ
బక్షులెల్లను రాయంచ పదువులయ్యె
గురుతరంబగు పెనుమంచు గురియుకతన.

—పద్మపురాణము.

# ప్రబంధ లక్షణములు

ఆంధ్ర వాఙ్మయమునకు సంస్కృత వాఙ్మయము ముఖ్య మాతృకగా నుండిన కారణమున నాంధ్ర ప్రబంధముల యుత్పత్త్యాదుల గురించి విచారించునపుడు సంస్కృత వాఙ్మయమున నట్టి గ్రంథవిశేషము లుండెనా యను నంశమును ముందుగ నాలోచింపవలసి యున్నది. సంస్కృత వాఙ్మయమున మతగ్రంథములగు బ్రాహ్మణములు, ఉపనిషత్తులు మున్నగునవి వెలువడిన తరువాత సంస్కృతకవులు జనరంజకములగు లౌక్యవిషయముల గురించి వ్రాయనుద్దేశించి కావ్యములను నొక వాఙ్మయ శాఖను నుద్భవింపజేసిరి. కావ్యమనగా కవికృతమగు వస్తువు. కావ్యములు రెండు తెరగులుగా మొదట నుండియు విభాగింపబడినవి. ఒకటి పద్యాత్మకమనియు రెండు గద్యాత్మకమనియు. కొంతకాలమైన తరువాత మిశ్రమస్వరూపమగు చంపువు గద్యలతోను పద్యములతోను కలసి వెలసిల్లినది.

పద్యకావ్యములు రెండువిధములు. 1. దృశ్యములు, 2. శ్రవ్యములు. దృశ్యకావ్యములనగా నాటకములు. శ్రవ్యకావ్యములనగా ప్రత్యేకముగ కావ్యములని రూఢి నామముచే పిలువబడు గ్రంథములు. గద్యకావ్యములన్నియు శ్రవ్యకావ్యముల విభాగములోనే జేరియున్నవి. ఏలననగా కేవలము గద్య నాటకములు సంస్కృతమున లేవు. ఈయుభయ విధములగు కావ్యములను సంస్కృత కవులు ప్రాచీనకాలము నుండియే అనగా బౌద్ధయుగము నుండియే రచింప ప్రారంభించినట్లు కానవచ్చుచున్నది. వాల్మీకి మహాకవి రచించిన శ్రీమద్రామాయణము ఆది కావ్యమని యందరెఱిగిన విషయమే * వ్యాస రచితమైన మహాభారతము మొదటినుండియు వేద సమానమైన ఐతిహాస గ్రంథముగా పరిగణింపబడినది **అశ్వఘోషుడను మహాకవి బుద్ధచరిత్రమను కావ్యమును క్రీస్తుశతాబ్దమునకు వెనుకనే వ్రాసినట్లు కాన్పించుచున్నది. మహాభాష్య కర్తయగు పాణిని జాంబవతీ విజయమను పేరున నొక కావ్యమును గూడ రచించెను. తరువాత రానురాను సంస్కృత మహాకవులందరు నాటకములను కావ్యములను గూడ వ్రాయుచువచ్చిరి. కాళిదాసు శాకుంతలాదినాటకములను వ్రాయుటయే గాక రఘువంశము, మేఘసందేశము, కుమారసంభవము మున్నగు కావ్యములను రచించెను. ఈ మహాకవి రచించిన కుమారసంభవ కావ్యము తరువాతవచ్చిన కవులకు మార్గదర్శకమైనట్లు కాన్పించుచున్నది. భారవికవి 'కిరాతార్జునీయము', మాఘుడు 'శిశుపాలవధ', శ్రీహర్షుడు 'నైషధము', యితరకవులు యితరకావ్యములను రచించిరి. ఈ కావ్యములను వ్రాయుచున్న కాలములోనే నాటకములుకూడ యా కవులచేతను, యితర కవుల చేతను, రచింపబడి వృద్ధిలోనికి వచ్చినవి.

ప్రస్తుత మాంధ్రప్రబంధముల విషయము మన మాలోచించుచున్నప్పుడు సంస్కృతనాటకముల గూర్చియు నాటకలక్షణముల గూర్చియు మనము విచారింప నవసరము లేదు. ఏలననగా ఆంధ్రప్రబంధములకు మొదట దారిచూపుటయే గాక వానికి మాదిరిగాను మేలుబంతిగాను ఉపకరించినవి కావ్యములను రూఢినామమొందిన కుమారసంభవాది సంస్కృత గ్రంథములే. కావున సంస్కృతకావ్యముల లక్షణములేవో మనము ముందుగ కనుగొనవలసియున్నది. ఈ లక్షణములే సామాన్యముగ నాంధ్రప్రబంధములకుగూడ వర్తించును. కావ్య

---

* కావ్యంరామాయణంకృత్స్నం సీతాయాశ్చరితంమహత్ ।
పౌలస్త్య వధమిత్యేవ చకార చరితవ్రతః॥

(వాల్మీకిరామాయణము.)

** ఇదం హి వేదైః సమితం పవిత్ర మపిచోత్తమం ।
శ్రావ్యాణాముత్తమంచేదం, పురాణమృషిసంస్తుతం॥

(వ్యాసమహాభారతము.)

లక్షణములగురించి కావ్యాదర్శములో ఆచార్యదండి యిట్లు వ్రాసియున్నాడు:—

శ్లో॥ పద్యం గద్యంచ మిశ్రంచతత్ త్రిధైవ వ్యవస్థితమ్
పద్యం చతుష్పదీ తచ్చవృత్తం జాతిరితి ద్విధా.

శ్లో॥ ఛన్దోవిచిత్యాం సకలస్తత్ప్రపఞ్చో నిదర్శితః
సావిద్యానౌర్వివిక్షూణాంగమ్భీరంకావ్యసాగరం.

శ్లో॥ ముక్తకం కులకం కోశః సంఘాత ఇతితాదృశః
సర్గబన్ధాంశ రూపత్వా దనుక్తః పద్యవిస్తరః.

శ్లో॥ సర్గబన్ధో మహాకావ్య ముచ్యతే తస్యలక్షణమ్
ఆశీర్నమస్క్రియావస్తు నిర్దేశో వాపితన్ముఖమ్.

శ్లో॥ ఇతిహాస కథోద్భూత మితరద్వా సదాశ్రయం
చతర్వర్గ ఫలాయత్తం చతురోదాత్త నాయకం.

శ్లో॥ నగరార్ణవ శైలర్తు చన్ద్రార్కోదయ వర్ణనైః
ఉద్యాన సలిలక్రీడా మధుపాన రతోత్సవైః.

శ్లో॥ విప్రలంభైర్వివాహైశ్చ కుమారోదయ వర్ణనైః
మన్త్రిదూత ప్రయాణాజి నాయకాభ్యుదయోరపి.

శ్లో॥ అలంకృతమ సంక్షిప్తం రసభావనిరంతరమ్
సర్గైరనతి విస్తీర్ణైః శ్రవ్యవృత్తైః సుసంధిభిః.

శ్లో॥ సర్వత్రభిన్న వృత్తాన్తైరుపేతం లోకరఞ్జనమ్
కావ్యం కల్పోత్తరస్థాయి జాయతే సదలంకృతి. *

ఇట్టి లక్షణములుగల కావ్యములను మాదిరిగ గైకొని మన యాంధ్రకవులు ప్రబంధములను వ్రాయనేర్చిరి.

ప్రబంధమను శబ్దమునకు

'ప్రకర్షేన బధ్యతయితిప్రబందం' అనగా 'చక్కగా సమకూర్పబడినది' అని వుత్పత్త్యర్థము. చక్కగా రచింపబడిన గ్రంథమేదయినను ప్రబంధమనియే మన ప్రాచీనాంధ్ర మహాకవులు నిర్ణయించుకొనిరి. పైన జూపిన ఆచార్యదండి సూత్రములలో 'ఛంధోవిచిత్యాం

* ఆచార్యదండి సూత్రములకు బ్రహ్మశ్రీ అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రిలుగారి ఆంధ్రీకరణము.

కావ్యభేదములు.

తే. గీ. కావ్యమిది పద్యమనఁగను గద్యమనఁగ
మిశ్రమనఁగను త్రివిధమై మెలగుచుండుఁ
బద్యమున నాల్గుపాదముల్ బరగుచుండు
వృత్తమన జాతియన నది ద్వివిధమగును.

తే. గీ. ఆ విశేషంబులెల్ల ఛందోవిచితియ
నంగఁదగు గ్రంథమందుఁ జూపంగఁబడియెఁ
జాలగంభీరమౌ కావ్య జలధి నీదఁ
దలఁచు వారి కవ్విద్య పోతమగుచుండు.

తే. గీ. కులకముక్తక సంఘాత కోశములను
దాదృశంబగు పద్యవిస్తరముఁ గూడఁ
జెప్పనైతి నంగంబులై చెలఁగునవియు
నావచించెడి సర్గబంధమున యందు.

మహాకావ్యము

సీ. అవని మహాకావ్యమనఁబడు సర్గబం
ధము దానికిదె లక్షణమువచింతు
ఆశీస్సు వస్తు నిర్దేశమో ప్రణతియో
దానికి ముఖముగాఁ దనరవలయు
నితిహాసకథనుండి యేర్పడినదిగాని
యుత్తమాశ్రితము వేఱొకటిగాని
కలిత చతుర్వర్గ ఫలమువృత్తమ్ముగ వ
ర్ణ్యము చతురోదాత్త నాయకమ్ము

తే. గీ. పురగిరి సరస్వదృతు చంద్రమోదినకృదు
దయరతోత్సవ మధుపాన తనయ జనన
వారి కేళివివాహోప వనవియోగ
యానమంత్ర దూతాజి నాయకజయయుతి.

తే. గీ. ఉక్త వస్తువర్ణనలతో నొప్పుచుండి
రసములను భావములను నిరంతరమయి
సంగ్రహితము గాక యాశ్చర్యకర మ
హోజ్వలాలంకృతి స్ఫూర్తి నొప్పవలయు.

తే. గీ. శ్రవ్యవృత్తంబు లగుచు సుసంధులగుచు
భిన్నవృత్తాంతములు నతి విస్తృతములు
నైన సర్గంబులంబొల్చి యఖిలలోక
రంజకంబగు కావ్యవా ప్రశయవర్తి.

సకలస్తత్ప్రబన్ధో నిదర్శితః' యనియున్నది. ప్రబంధమను సీమాటకు రచనాప్రకారమని వ్యాఖ్యాతయిచ్చిన యర్థము. అందుచేతనే ఆంధ్రమహాభారతము ఐతిహాసికమగు పురాణగ్రంథమైనను కావ్యమని నన్నయభట్టారకుడును ప్రబంధమండలియని తిక్కన సోమయాజియు నభిప్రాయపడిరి. ఇంక ఎఱ్ఱాప్రగడ మహాకవిని ప్రబంధపరమేశ్వరుడను నుపనామముతో పిలుచుటకాతను భారతమందలి ఆరణ్యపర్వశేషమును పూరించుటయే యని యూహింపదగినది. ఏలననగా భారత మహాప్రబంధమును పుట్టించిన బ్రహ్మ నన్నయభట్టారకుడు, వృద్ధిచేసిన విష్ణువు తిక్కయజ్వ. పూర్తిగావించిన మహేశ్వరుడు ఎఱ్ఱాప్రగడ. కావున నీ ముగ్గురును ఆ ప్రబంధమునకు బ్రహ్మ విష్ణు మహేశ్వరులైరి.

కావున ప్రబంధశబ్దము తొలునొల్త నన్నియుద్గ్రంథములకు వర్తించినది. అనగా సంస్కృతమునండి కావ్యములను పురాణములను యథారూపముగా తెనిగించినను వానిని ప్రబంధములనియే మనవారుచెప్పిరి. సంస్కృత నాటకములను నాటకములుగ తెనిగించుటగాని ప్రత్యేకముగ నాటకములను రచించుటగాని మనపూర్వకవులు చేయలేదని యెల్లరెరిగిన విషయమేకదా! సంస్కృత నాటకములను తెనిగింపవలసివచ్చినను నాటకరూపమును విడనాడి ప్రబంధరూపముగానే వానిని రచించిరి. ఇట్లు నాటకములను వ్రాయక ప్రబంధములను మాత్రమే రచించుటకు కారణములు నిర్ణయించుట ప్రస్తుతాంశముగాదు గాన నిటచర్చింపను.

భారతమంతయును ప్రబంధమనినట్లు యితర పురాణములనుగూడ ప్రబంధములనియే మనవారు తెనిగించిరి. మారనమాత్రము మార్కండేయ పురాణము తెనిగించి నన్నయభట్టువలె కావ్యమని చెప్పికొనెను. నన్నెచోడుడు తన కుమారసంభవమును ప్రబంధమనెను. ఎఱ్ఱాప్రగడ తన హరివంశమును ప్రబంధమనియు నృసింహపురాణమును మహాప్రబంధమనియు వేర్కొనెను. మంచనకవి విద్ధసాలభంజికయను సంస్కృతనాటకమును తెనిగించి రచించిన కేయూరబాహుచరిత్రమును మహాప్రబంధమని నుడివెను. కేతన మహాకవియు దశకుమారచరిత్రను ప్రబంధమనియే చెప్పెను.*

కావున మొట్టమొదటలో ప్రబంధములను పేరు అనేకవిధములగు గ్రంథములకు వర్తించినను రానురాను ఆ శబ్దార్థము సంకుచితమై ప్రత్యేకముగ నొక వాఙ్మయస్వరూపమునకే యుపయోగింపబడినది. ఆ వాఙ్మయ స్వరూపము సంస్కృతకావ్యము ననుసరించి యనుకరించి యుండుటచే చాలవరకు దాని లక్షణములనే పొంది యున్నది. ప్రబంధలక్షణముల నాంధ్రలాక్షణికులీక్రింది విధముగా నిరూపించిరి.

కం. కృతి ముఖమున దేవనమ
స్కృతియొండె నభీష్టవస్తు కీర్తనమొండెన్
వితతాశీః పదమొండెను
బ్రతిపాదింపంగవలయు భద్రాపేక్షన్.

మ. కవిసంసిద్ధపదంబు భావ
రసవిఖ్యాతంబు లోకోచిత
వ్యవహారంబు నుదాత్తనాయకము
శ్రవ్యంబుం జతుర్వర్గసం
భవసద్మంబును నైన కావ్య
మిల నాపద్భవస్థాయియై
కవి సంస్ఫూర్తియు దాత్మకీర్తియు
దగం గల్పించు నెల్లప్పుడున్.

## కావ్యభేదములు.

తే. అట్టికావ్యంబు త్రివిధమై యతిశయిల్లు
నవని బద్యమయంబు గద్యాత్మకంబు
పద్యమయమొప్పు ఛందోనిబద్ధమగుచు
గద్యబయమొప్పు వాక్య సంకలితమగుచు.

క. ఆ పద్యగద్య కృతములు
రూపకములు నాటకములు రూఢములగునా

* పాలకురికి సోమనాథుడు రచించిన బసవపురాణమును రంగనాథుడు రచించిన రామాయణమును ద్విపద గ్రంథములుగా నుండినకతన గాథలు నాయా కవులచే కథలని పిలువబడినవి గాని వానికి ప్రబంధములని గాని కావ్యములనిగాని పేరు పెట్టబడలేదు.

రూపమ చంపూకావ్యత
ప్రాపించును నాటకములు బహుళములరయన్.

తే. సర్గబంధంబు కావ్యంబు సంస్కృతమున
బ్రాకృతమున నాశ్వాస భాసురంబు
నాటకములెల్ల నంకసనాదకములు
గద్యముచ్ఛ్వాసలంబకోంకంబ యండ్రు.

క. ఇటువలెనె ముక్తకాది
స్ఫుటతర చాటుప్రబంధముల లక్షణముల్
పటుమతి నెఱుగుట సుయశో
ఘటనంబులకెల్ల గుదురుకవి నృపతులకున్.

తే. అట్లు కవికృతమైన కావ్యత్రయంబు
గద్యపద్య విమిశ్ర సంపాద్యమండ్రు
నగరముఖ్యాష్ట దశవర్ణనముల చేత
బరగునదియును భవ్య ప్రబంధమనగ.

మ. పురవారాశి మహీధరర్తు శశ
భృత్సూర్యోదయోద్యాన పు
ష్కరకేళీ మధుపాన మోహన
వియోగ క్షేమయానస్వయం
వరపుత్రోత్సవ మంత్రదూత్య
రణదోర్వైర్యాక్రాంతి సంకీర్తనా
కరమష్టాదశవర్ణనాన్వితము
తత్కావ్యంబు భవ్యరిబిలన్.

(విన్నకోట పెద్దన: కావ్యాలంకార చూడామణి.)

కావ్యాదర్శములోనున్న సంస్కృతకావ్య లక్షణములును ఈ కావ్యాలంకార చూడమణిలో నున్న యాంధ్ర ప్రబంధలక్షణములను ఈ పద్యేదములతో సమానములుగా నున్నట్లు మనకు గాన్పించుచున్నది. కథావిషయము పౌరాణికముగాని మరియొక యుత్కృష్టమైనది గాని యుండుటయు నాయికానాయకులు చతురోదాత్తులుగా నుండుటయు చతుర్విధ ఫలములును, అష్టాదశవర్ణనలును కలిగియుండుటయు, ఇత్యాది ముఖ్యవిషయములలో కావ్యమును ప్రబంధమును సరిపోలియున్నవి. మరి భేదములున్ననో లక్షణములలోగాక రచనాక్రమములో మాత్రమే ముఖ్యముగా గాన్పించుచున్నవి.

సంస్కృత కావ్యస్వరూపమునుంచి మన యాంధ్ర ప్రబంధ మవతరించినదని మనకు విస్పష్టమైనది. అట్లయినను సంస్కృత కావ్యములకును మన యాంధ్రప్రబంధములకును కొన్ని గొప్పభేదములు గాన్పించుచున్నవి; ఈ భేదములను మనము సాకల్యముగా బరిశీలించినచో నాంధ్రప్రబంధములు సంస్కృత కావ్యములకంటె రసవత్తరములనియు జనరంజకములనియు తెలియవచ్చుచున్నవి. ఆంధ్రమహాకవులు తమ యప్రతిమ ప్రతిభాసంపత్తిచే కేవలము బింబప్రతిబింబ సామ్యముగా సంస్కృతకవుల ననుకరించక కావ్యకళాశిల్ప కోవిదులై రస నిరూపణవిధానమును నిపుణముగా వినియోగించి తమ ప్రబంధములను సంస్కృతకావ్యములకంటె మనోహరములుగా జేయగలిగిరి.

ఇట్లు ప్రబంధరచనయందు సంస్కృత కవులకంటె యొకించుక భిన్నమార్గమున బోవుటయందు వీరికి వేరొక సహాయముగూడ కలిగియుండవచ్చునని తత్కాలపు దేశచరిత్రను పరిశీలించినచో విశదముకాగలదు. ఇప్పటివరకు మనకు లభ్యములైన యాంధ్రగ్రంధములలో నన్నయభట్టు మహాభారతమే మొదటిదిగానున్నది. అది పురాణమైనను చంపూకావ్యముగా వ్రాయబడినది. సంస్కృతమునందు చంపూకావ్యరచన ప్రాచీనమైనది కాదు. చంపూకావ్యమనగా గద్య పద్యాత్మకములే. కావున చంపూవిధానము నన్నయభట్టుకు సంస్కృతమునుండి ద్యోతకమైనదని చెప్పుట చాలవరకు నిరాధారమై యున్నది. అట్లయిన నన్నయభట్టు స్వయముగా నిట్టి రచనావిధానమును కనిపెట్టెనాయను సంశయము నిర్ణయింపవలసినచో నాతను స్వతంత్రముగా దీనిని కనిపెట్టి యుండలేదని చెప్పవలసియున్నది. ఏలయన నన్నయభట్టు పోషకుడగు రాజరాజనరేంద్రునకు సమకాలికుడగు భోజమహారాజు (క్రీ. శ. 1040) రామాయణమును చంపూకావ్యముగా నా కాలముననే ప్రథమ ప్రయత్నముగా సంస్కృతమున రచించెను. కావున చంపూకావ్యరచన సంస్కృతమున నన్నయకాలమున యాచరణలోనికి వచ్చినదని చెప్పదగియున్నది.

మరియు కన్నడకవులు సంస్కృతమునకంటె ముందు

గానే తమభాషయందు చంపూ ప్రబంధములను రచింప మొదలుపెట్టిరి. వారు క్రీ. శ. యెనిమిది, తొమ్మిదవ శతాబ్దములలోనే యిట్టి గ్రంథములను వ్రాసినట్లు కాన్పించుచున్నది. మన యాంధ్రకవులకును కన్నడ కవులకును చాలకాలమునుండియు పరస్పర సంబంధము లుండుట చారిత్రకవిషయమే. కన్నడకవులను పోషించిన పశ్చిమచాళుక్యులును, ఆంధ్రకవులను పోషించిన తూర్పుచాళుక్యులును అన్నదమ్ముల వంశస్థులగుటచే రాజకీయ విషయములలో నన్యోన్యసంసర్గము కలిగి యుండిన కారణమున కన్నడకవులు మన యాంధ్రకవులకు చంపూమార్గమును కావ్యరచనయందు జూపియుండ వచ్చును.

ఇంక సంస్కృతకావ్యమునకును ఆంధ్ర ప్రబంధమునకునుగల ముఖ్యభేదములేవన 1. సంస్కృతకావ్యము మొట్టమొదట కేవలము పద్యాత్మకముగానే యుండెను. గద్యరచన యెంతమాత్రము నుండెడిది కాదు. ఆదికావ్యమగు రామాయణము, కాళిదాసుని రఘువంశకుమారసంభవాది కావ్యములు, మాఘ భారవి శ్రీహర్షకవుల కావ్యములును యీ విషయమున నుదాహరణములు. అట్లు సంస్కృతకావ్యములు నిర్వచనములైన పద్యాత్మకములే యగుటచేత నీరసభాగములును కేవలవర్ణనములును పద్యరూపముగానే రచింపబడవలసి వచ్చినది. అందుచే సంస్కృతకావ్యము చదువునపు డొకవిధమైనవిసుగు జనించును. ఆంధ్రప్రబంధములట్లుగాక ప్రథమమునుండియు అనగా ఆదిమకావ్యమగు మహాభారతమునుండియు, చంపూ రూపముగా అనగా గద్యపద్య మిశ్రితముగా వ్రాయబడినవి. ఆ కారణమున ఆంధ్రప్రబంధము లెక్కువ మనోహరములును శ్రావ్యములును నున్నవి. కేవలవర్ణనా విషయములు రసహీనభాగములు నామావళులు వంశావళులు మున్నగునవి వచనరూపముగా వ్రాయబడియుండుటచే పద్యభాగము రసవంతముగను ఉత్సాహపూరితముగను నుండును. 2 సంస్కృత కావ్యములన్నియు ననేకములగు సర్గలు కలిగి బహుదీర్ఘములై యున్నవి. ఏ కావ్యమైనను పదునారు పదునేడు సర్గలకు తక్కువగానుండదు. అశ్వఘోషుని బుద్ధచరిత్రము పదియేడుసర్గలు గలదు. కాళిదాసుని కుమారసంభవమును, భారవి కిరాతార్జునీయమును పదియేడుసర్గలు కలవియే. మాఘుని శిశుపాలవధయందు నిరువదిసర్గలును శ్రీహర్షుని నైషధమందు నిరువదిరెండు సర్గలునుయుండి యవి దీర్ఘతరములైనవి. ఆంధ్రప్రబంధములట్లుగాక సామాన్యముగ నైదారాశ్వాసములమాత్రమే కలిగి నాతిహ్రస్వములై నాతిదీర్ఘములై యున్నవి. ఒక్క నన్నిచోడుని కుమారసంభవము మాత్రము పదియారాశ్వాసములు కలిగియున్నది. దీనికి కారణమా కవివరుడు పండ్రెండవ శతాబ్దమువాడై బహు ప్రాచీనుడై యుండుటచే నాతను తనకు పూర్వమున నున్న సంస్కృతకావ్యములనే యనుకరించెను. అతడైనను తన ప్రబంధమును సంస్కృతకావ్యములవలె దీర్ఘమైనదానినిగా జేసినను వానివలె కేవలపద్యాత్మకముగా రచింపక చంపూకావ్యముగనే రచించెను. ఈ గ్రంథవిస్తృతి విషయములో మన యాంధ్రకవులు సంస్కృతకవులకంటె మిన్నలగుటయే గాక తమనాటి ద్రావిడ కర్ణాటకవీశ్వరులకంటె గూడ నెక్కువ వివేకముజూపిరని నిశ్చయముగ జెప్పవచ్చును. ద్రావిడ వాఙ్మయములోనున్న 'చిలప్పత్తికారము' అను కావ్యము ముప్పది యాశ్వాసములతోను, 'మణిమేఖల' యను కావ్యము గూడ ముప్పది యాశ్వాసములతోను రచింపబడినవి. కర్ణాట వాఙ్మయములో పదియవశతాబ్దమున పంపకవి విక్రమార్జున చరిత్రమును పదునాలుగు సర్గలుగాను ఆదిపురాణమును పదునారు సర్గలుగాను రెంటిని చంపూకావ్యములుగానే రచించినాడు. పొన్నకవి (క్రీ.శ.950) శాంతి పురాణమును పండ్రెండాశ్వాసములుగల చంపూకావ్యముగాను రన్నకవి (క్రీ. శ. 993) అజితపురాణమును పండ్రెండాశ్వాసములుగల చంపూకావ్యముగాను రచించిరి కాబట్టి యీ విషయములో నాంధ్రకవులా కాలపు సంస్కృత ద్రావిడ కర్ణాట కవులకంటె ప్రశంసనీయులని చెప్పవచ్చును.

3. మరియొక విషయములోగూడ నాంధ్రకవు లత్యధికమగు కావ్యశిల్పజ్ఞత కనుపరచిరి. ఆదియేదన కావ్యమునకు మహత్తరమగురసము పుట్టింపదగు ఛందోనిబం

థన విషయము. సంస్కృతకవులు తమ గ్రంథములలో సామాన్యముగా నొక్కొక్కసర్గ నొక్కొక్కవృత్తమున వ్రాయుచుండిరి. అనగా అనుష్టుభు, వుపజాతి మాలినీ, మందాక్రాంత, ఇత్యాదివృత్తములలో నేదో యొకదానిని తీసికొని ఆవృత్తమే సర్గయంతకు నుపయోగించుచుండిరి. ఇట్లుచేయుటచే సంస్కృతకావ్యములయందు శ్రవణానందము తక్కువై కొంతవడి కీదుర్భరమగు విసుగుపుట్టుచుండును. ఆంధ్రప్రబంధము లట్లుగాక ప్రతియాశ్వాసమునందు ననేకవిధములగు వృత్తములను జాతులను వాడుకచేయుటచే సందర్భానుసారముగా ఛందోరూపములను మార్చుట కవకాశముగలిగి గతిభేదములలోనుండు మాంద్యదోషములను శ్రవణయోగ్యములుగా ప్రసాదించుచున్నవి.

4. ఆంధ్ర ప్రబంధములలో సామాన్యముగా ప్రతిగ్రంథమును నెవరో యొక మహాపురుషున కంకితము చేయబడుటయు నట్లంకితము చేయుటలో కృతికర్త తనవంశమును కృతిభర్తయగు తనపోషకుని వంశమును విపులముగా రచించి దేశకాల చరిత్రాంశముల నిచ్చుటయు వాడుకగానుండెను. ఆ కారణమున నాయా కవులను నాయాగ్రంథములు నేయేకాలమునాటివో తెలిసికొనుటయే గాక యప్పటి రాజవంశముల చరిత్రాంశములుగూడ విపులముగా గ్రహించుట కాధారము గలుగుచున్నది. ఇట్టిసౌకర్యము సంస్కృత కావ్యములనంత గానరాదు.

కావున మన యాంధ్రప్రబంధములు సంస్కృత కావ్య జనితములైనను మాతృకలకంటె కొన్నివిషయములలో నెక్కువ మేలైనవని నిర్ణయింపవచ్చును.

"ఆ. వె. జనని సంస్కృతంబు సకలభాషలకును
దేశభాషలందు తెనుగు లెస్స;
జగతిఁ దల్లికంటె సౌభాగ్యసంపద
మెచ్చు టాడుబిడ్డ మేలుగాదె!"

(వల్లభామాత్యుని "క్రీడాభిరామము.")

—టేకుమల్ల అచ్యుతరావు ఎం.ఏ.యల్.టి.

# గానము

సీ. బహువిధాలంకార పర్యాప్తి చిత్తముల్
గరఁగించుటను వారకాంతఁ బోలి
పటుతరాలాప సంబంధప్రబంధ ని
ర్వహణవైఖరిఁ గవివాణిఁ బోలి
మహితాంగరాగ సంపత్తి గ్రామస్ఫూర్తి
బహుళమై నృపుని వైభవముఁ బోలి
వరతారకాంతర స్ఫురితనాద ప్రౌఢిఁ
దగి మహాయోగి కృత్యంబుఁ బోలి

గీ. వెండియు భుజంగమోహనోద్వేలరక్తి
జాలమాధుర్య గతిమించి రాలువెలయు
పారవశ్యైక హేతువై పవనసూను
మానితానూన వల్లకీ గానము మరె.

—సభారంజకమారవిజయము.

# నూలుఁదోడు వాలుగంటి

సీ. పోఁగువెంబడిఁ బర్విపోల్చు వాల్పూవుల
ధళధళ ల్పూదండ కళలనీనఁ
బుంజంపుకట్లు దెంపుటకుఁ బర్వెత్తుచో
మట్టెల ఘణఘణ ల్బెట్టుగ్రమోయఁ
గేలెత్తుచో బాహుమూల జాతప్రభా
చకచకల్ పైఁడి వసంతమాడఁ
బటుఁద్రిప్పఁగ జాఱుపైటలోఁ గన్నట్టు
గుబ్బల మిసమిస ల్దొబ్బులాడ

గీ. వింతవగకప్పు నెఱిఁగొప్పు వీటమెఱయు
నిగనిగల్జాత్తి నీలాల నిగ్గునింపఁ
గుచధరంబున నడుము కొంచుకువడంక
నూలుఁదోడును వేడ్క నవ్వాలుగంటి.

—హంసవింశతి.

# తపోభంగము

## ౧

ఘోరమైన తపస్సుచేస్తున్నాడు విశ్వామిత్రుడు త్రిలోకాధిపత్యం సంపాదించడానికి. ఆ తపోవేడిమికి చతుర్దశభువనాలూ అట్లు ఉడికినట్లు ఉడికిపోతున్నాయి. తపస్సు ఫలోన్ముఖమయ్యే సూచనలు కనబడుతున్నాయి.

దేవేంద్రుడు గడగడలాడిపోయినాడు. ఏమిచేయడానికి తోచలేదు. తన ఇంద్రత్వానికి ఎసరొచ్చింది. అప్సరసల్లోకల్లా అగ్రగణ్యురాలైన మేనకనుపిలిచి నా పరువునిలబెట్టమని మరిమరీ ప్రార్థించాడు.

"రాజకులానబుట్టి తపశ్శక్తిమూలాన బ్రహ్మత్వము సంపాదించిన మహానుభావుడు. సృష్టికి ప్రతిసృష్టిచేసిన జగజ్జెట్టి. మహాతేజస్వి. అయనకు కోపమువచ్చి ఒక్కసారి చూసినంతమాత్రాన సప్తసముద్రాలు ఇంకిపోవా? మూడులోకాలు కుమ్మరిసారెవలె గిరగిర తిరిగిపోవా? గాలిదేవుడు గట్టిగా వీచగలుగుతాడా? వీటికన్నిటికి తగినట్లు మహాకోపి అలాంటి వాడివద్దకా నన్ను వెళ్ళమంటావు? వెళ్ళితేమాత్రం నాబోటివాళ్ళకు శక్యమా ఆ మహాత్ముడి తపస్సు చెరచడానికి? పైగాపోయి ఆయనకోపాని కెరగావడమే తప్ప లాభములేదు. ఒక్కొక్కరము ఎవళ్ళముపోయి ఆయనదృష్టి మరల్చలేము. కాదు కూడదంటావా? నాకుతగిన బలగాన్నంత సమకూరుస్తే, నీ తిండితిని, నీ బట్ట కడుతున్నందుకు శక్తివంచనలేకుండా ప్రయత్నిస్తాను" అన్నది మేనక.

"ఏమికావలెన"న్నాడు దేవేంద్రుడు.

మేనక తనతోబాటు అనిలుణ్ణి, వసంతుణ్ణి, మన్మథుణ్ణి తోడుచేసి ఇంకాకొందరు అప్సరసలనుకూడ పంపమన్నది.

దేవేంద్రుడు సరేనన్నాడు.

## ౨

హిమవత్పర్వత ప్రాంతారణ్యంలో తపస్సు చేస్తున్నాడు విశ్వామిత్రుడు. మేనక, అనిలుడు, వసంతుడు, మన్మథుడు, తక్కంగల అప్సరోగణము ఆ అరణ్యం చేరారు విశ్వామిత్రుణ్ణి సమీపించారు.

ఆయనముఖమునుంచి బ్రహ్మతేజస్సు ఉట్టిపడుతున్నది మనస్సు శ్రీమన్నారాయణమూర్తి పాదపద్మాలమీదఉంచి తదేకనిష్ఠతో ఇతరచింత ఏమీలేకుండా తపస్సుచేస్తున్న విశ్వామిత్రుణ్ణి చూసి తాము వచ్చినపని ఏలా సఫలమౌతుందా అని భయపడ్డారు వాళ్లు. అంతటి నిశ్చలత్వాన్ని తామెంతమందికలిస్తే మాత్రము చెఱచ కలుగుతారు? లాభము లేదనుకున్నారు.

స్వామి యాజ్ఞకు బద్ధులై కర్తవ్యం ఆచరిస్తే అపైన భగవంతుడున్నాడని సమాధానము చెప్పుకున్నారు.

వసంతుడు తన ప్రతిభచూపాడు. అరణ్యమంతా చిగిర్చింది. పూలతీగెలనున్న పూలన్నీ వికసించినవి. ప్రకృతి నూత్నశోభను దాల్చింది. ఆకులసందునుండి కోకిలలు గొంతెత్తి గానముచేస్తున్నవి. ఈ నూతన పుష్పాల సౌరభాన్ని దక్షిణానిలుడు తపస్వికి అందించాడు.

అది విశ్వామిత్రుడు సమాధినుంచి లేచేవేళ. ఆయన కళ్ళుతెరిచిచూచాడు. అరణ్యమంతా కళకళలాడుతున్నది. ఏచెట్టున చూచినా ఎర్రనిచిగుళ్ళు. లేతపచ్చిక రంగుగల ఆకులు తాకితే వాడిపోయేటట్లున్నవి. అన్ని చెట్ల చిగురుటాకులు ఎర్రగానే ఉన్నవి. కాని చెట్టును బట్టి చిగురుటాకుల ఎరుపు మారుతున్నది. మామిడి చిగుళ్ళ ఎరుపూ, వేపచిగుళ్ళ ఎరుపూ వేరువేరు. వేప చిగురు ఎరుపూ, చింతచిగురు ఎరుపూ వేరువేరు. కావడానికి అన్నీ ఎరుపులే అయినా మనుష్యుడు లెక్కబెట్టలేనన్ని మార్పులు అనేకరకాల వింతరంగులుకలిపి మానవచిత్రకారుడి ఊహాకు అందజాలనీ ఒక విచిత్రమైన అందాన్ని అమర్చింది ప్రకృతి. ఈ రంగులమీద తన తెల్లనికిరణాలు ప్రసరింపజేసి ప్రకృతిలోని సహజకాంతిని రెట్టించాడు సూర్యుడు.

పూచినపూలన్నీ కమ్మనివాసనలు వెదజల్లుతున్నవి,

ఒక పూవుయొక్క వాసన, మరొకపూవువాసన ఒక మాదిరిగా లేవు. మల్లెకు ఒకవిధమయిన వాసన. గులాబికి మరొకవాసన. రెండూ కమ్మనివే.

కోకిలలన్నీ ఒకేస్థాయిన పాడుతున్నవి. ఒకే విధమయిన హాయిఉన్నది వాటిపాటలో. కాని పాడేవి వేరువేరు కోకిలలనీ, ఒకే కోకిలకాదనీ చెప్పవచ్చు. వాటిగొంతులలో లెక్కకుమించిన మార్పులున్నవి.

ఈ ఆలోచనలన్నీ ఒకదానివెనుక ఒకటి క్షణమాత్రంలో కలిగినవి. ప్రకృతిలోని సౌందర్యానికీ, దానిలోని అనంతమైన మార్పులకూ, ఎప్పుడూ ప్రకృతిమధ్యనే నివసించే విశ్వామిత్రుడే ఆశ్చర్యపోయినాడు. ఈ ప్రకృతికీ, కారణభూతుడైన శ్రీమన్నారాయణమూర్తికీ మనసా నమస్కరించాడు.

ఇంతలో అందెలరవళి వినుపించింది. అటువైపు తన దృష్టి త్రిప్పాడు ఋషి సత్తముడు. ఆప్రక్కన దగ్గరలో మేనకాద్యప్సరసలు నాట్యము చేస్తున్నారు. పాటలు పాడుతున్నారు. ప్రకృతి సౌందర్యాన్ని తనివిదీర గ్రోలి ఇటుచూచేటప్పటికి సృష్టిలోని అందానికి మరోశాఖ దృగ్గోచరమైనది. వాళ్ళందరూ అందగత్తెలు. సమానమైన అందగత్తెలు. హెచ్చుతగ్గులు నిరూపించడానికి వీలేలేదు. కాని వారి అందాలు వేరువేరు విధాలు. ఒకఆమె అందము ఆమెకళ్ళలోనున్నది. అవి అతివిశాలములు. కాంతివంతములు. మరొకతెయందము ఆమె చెక్కిళ్ళలోనున్నది. ఇంకొకయప్సరస అందము ఆమె యవయవముల పొందికలోనున్నది.

ఇట్టి మనోహరమైన సృష్టికి మూలకందమయిన శ్రీమన్నారాయణమూర్తికి నమస్కరించాడు విశ్వామిత్రుడు.

ఈ దృశ్యాలురెండూ విశ్వామిత్రుని దృష్టిమార్చలేదు. పరమాత్ముని పాదపద్మములయందు లగ్నమైన ఆయనమనస్సు మరలలేదు. దీనిని చూచినా దానిమూలాన ఆయనకు భగవంతుడిమహిమే కనబడుచున్నది.

మేనక తక్కిన అప్సరసలను వదలి పూలుకోయనవనసీమమీద, ఒయ్యారంగా నడుస్తూ, పూలుకోసుకుంటూ విశ్వామిత్రునివైపు నడచినది. ఆమె యాతనివైపు చూడలేదు. విశ్వామిత్రుడికి మాత్రము ఆమె ప్రక్కవాటుగా కనబడుచున్నది. "ఈమె తక్కినవారికంటె చక్కనిదిసుమా!" అనుకున్నాడు విశ్వామిత్రుడు.

ఈ మాటలో పూర్వపునిశ్చలత్వము లేదు. సమయముకొరకు కనిపెట్టుకొనిఉన్న మన్మథుడు ఒక్కసారిగా వెయ్యిబాణాలు నాటాడాయన హృదయంలో మనిషిలో కొద్దికదలిక కలిగింది. ఆయన ఆమెవైపు చూశాడు. ఆమె అతిలోకసౌందర్యము ఆయనకు భగవన్మహిమ జ్ఞాపకము చేయలేదు.

మేనక విశ్వామిత్రుడివైపు వోరగాచూస్తూ పూలుగోస్తున్నది. దక్షిణానిలుడు సమయానికి పమిటతొలగించాడు. ఆమెనిండైన చనుకట్టు, ఉండీ లేనట్టున్న నడుము కనుపించినవి. ఆ మనోహరరూపానికి ముగ్ధుడైనాడు.

దక్షిణానిలుడు సువాసనల గొనితెచ్చి ఆయన్ను ఉక్కిరిబిక్కిరి చేశాడు. అదేసమయంలో పంచబాణుడు తన ఐదుబాణాలు ఒక్కసారిగా ఉపయోగించి వెర్రెత్తించాడు.

చుట్టూ చూశాడు విశ్వామిత్రుడు. ప్రకృతిలోని అందముకూడా తనను తొందరచేస్తున్నది. చల్లనిగాలి, చక్కనిపూలు, హాయిఅయిన పాటలు, అందమయిన మేనక ఒకదానికొకటి సరిపోయినవనుకున్నాడు. ఇంతకంటె కోరతగినదిమాత్రము ఏమున్నది?

మహా తపశ్శాలియైన తనకే ఈ భావాలు వస్తున్నవేమి చెప్మా అనుకున్నాడు మానిశేఖరుడు. ఇంతకాలమునుంచి చేసినతపస్సు వ్యర్థముకాదా ఇలాటి భావాలకు చోటిస్తే?

ఈ ఆలోచనలు ఎక్కువసేపు ఆయన్ను కలవరపరచలేదు. సర్వమూ మరచిపోయిన ఆయనకు మేనక మాత్రమే మిగిలింది. దేవేంద్రుడి కోరికే సిద్ధించింది.

— మొదలి శీతారామస్వామి బి. ఏ.

# భారతీయ గ్రంథాలయములు

## ౧ లిపిజ్ఞానము లేఖనాసామగ్రి

గ్రంథ సముదాయమే యుత్తమమగు విశ్వవిద్యాలయమని సుప్రసిద్ధాంగ్ల కవియగు కార్లయిలు వ్రాసియున్నాడు. ప్రాచీనకాలమునుండియు భారతదేశము విజ్ఞానమునకును, విశ్వవిద్యాలయములకును, గ్రంథాలయములకును గూడ విశేషమగు ఖ్యాతిని గాంచియుండెను. యాత్రార్థమును, విజ్ఞానము నార్జించుటకు నీదేశమున కేతెంచిన విదేశీయులెందరో యీ విషయమును పేర్కొనియుండిరి. పూర్వకాలమున నీదేశమునంగల యసంఖ్యాకములగు గ్రంథాలయము లన్యదేశీయుల నాకర్షించినవి. గ్రంథములును, గ్రంథాలయములు నిట్లు దేశమునందెల్లెడలను సర్వసామాన్యముగ గాంచనగుటను బట్టి బహు ప్రాచీనకాలమునకే భారతదేశవాసులకు లేఖనమును, పుస్తకనిర్మాణమును చక్కగ దెలిసియుండినవని స్పష్టమగుచున్నది. గాన భారతదేశమునందలి గ్రంథాలయముల చరిత్రమును వర్ణించుటకు పూర్వము దేశీయుల కేకాలమునుండియు లిపిజ్ఞానము గలదు? వారలాయా కాలములయం దేయే వస్తువులను వ్రాయుట కుపయోగించియుండిరి? అను విషయములను చర్చింపవలసియున్నది.

ఈ దేశమునందలి లిపిపరిజ్ఞానముయొక్క ప్రాచీనతనుగూర్చి పండితులలో నెన్నియో యభిప్రాయములు గలవు. వీబరు, బోంట్లింగ్కు మున్నగువారు క్రీ. పూ. 3-వ శతాబ్దినాటి యశోకుని శాసనములు ప్రాచీనతమములని తలంచిరి. ప్రిన్సెప్, ఆల్ ఫ్రెడ్, సినార్ట్ అను వారలు పై యభిప్రాయమునంగీకరించి, భారతీయులు గ్రీసుదేశీయులనుండి లిపిని నేర్చిరని నిర్ణయించినారు.

(1) సర్ విలియంజోన్సు పండితుని వ్రాతలననుసరించి సెమిటిక్ జాతులనుండియు, డికే, వైలర్ అను వారి యూహాలో దక్షిణ అరేబియానుండియు, బూహ్లర్ పండితుని యభిప్రాయానుసారము ఫినోషియను నుండియు భారతీయులు తమలిపిని నేర్చిరని తెలియ నగుచున్నది. (2) కొందరు పాశ్చాత్యపండితు లా లిపి దేశీయమని యందురు. థోమస్ అనునతడు దాక్షిణాత్యులగు ద్రావిడులలో నయ్యది యుద్భవించెననియు, (3) కన్నింగుహాందొర యాలిపి చిత్రలిపి భవమనియు నూహించిరి. (4) కాని యీ వాదములలో నొకటి రెండు ప్రతిబంధకములున్నవి. అందు మొదటిది పండితులందరును సంస్కృత బౌద్ధవాఙ్మయములలోగల లిపి సంబంధములగు ప్రశంసలను త్రోసిపుచ్చుట. రెండవది భారతదేశమున కేయేకాలముల నేయేవిధముల నితరదేశముల సంపర్కమేర్పడి యీలిపి పరిగ్రహణమున కానుకూల్యత యేర్పడెనో యీ పండితులు దెల్పలేకుండుట. ఇదియిట్లుండ భాండార్కరు, విష్ణుసరూప్ మున్నగు దేశీయపండితులెందరో ప్రాచీనభారతీయలిపి దేశీయమేయని వాదించియున్నారు (5) కాన నీదేశీయ వాదము నించుక పరిశీలింపవలసియున్నది.

సంస్కృత బౌద్ధవాఙ్మయములలో లిపికి సంబంధించిన ప్రశంసలుగలవని యిదివరలో జెప్పియుంటిమి. నారదుడు, (6) బృహస్పతి, మనువు (7) మున్నగు ధర్మశాస్త్రకర్తలు "బ్రహ్మి" యను ప్రాచీనహిందూలిపి బ్రహ్మచే నిర్మింపబడెనని చెప్పియున్నారు. సమవాయాంగసూత్రము, పణ్ణావనసూత్రము నను బౌద్ధగ్రంథ

1. Isaac Taylor - The Alphabet II. p. 304.
2. Biihler - Indian Paleography. p. 19.
3. J.R.A.S. (N.S.) V, 1420—1427.
4. Catalogue II p. 52.
5. Astosh Mukerjee Silver Jubilee volume p. 539.
6. S.B.E. 23 p. 58 ff.
7. Ibid 23, p 304.

10-1933

ములను (8) ఫుఇన్‌షులిన్ అను చైనాగ్రంథమును (9) హ్యూన్‌త్సాంగ్, బెరూనీయను యాత్రికులవ్రాతలు(10) నీగాథనే దెల్పుచున్నవి. దృష్టివాదమను జైనగ్రంథమును, (11) బౌద్ధుల లలితవిస్తారమును (12) బ్రాహ్మీలిపిలో 41 అక్షరములుండెడివని చెప్పుచున్నవి. భిక్కుపాసిత్యమున లేఖలును, లేఖకులును పేర్కొనబడియున్నారు. (13) జాతకకథలనుండి బౌద్ధయుగమున భిక్షువులు కర్రపలకలపై తమ శిష్యులకు మతసిద్ధాంతములను వ్రాసియిచ్చెడివారని తెలియుచున్నది. (14) వినయపిటకము దీనినీ బలపరచుచున్నది. (15) ఫలకమను పలకయు, వర్ణకమను లేఖినియు బడికిపోవు బాలురచే నుపయోగింపబడుచుండెడివని మహావగ్గమున గాంచనగును. (16) ఇట్టి నిదర్శనముల నెన్నిటినైనను జూపవచ్చును. వీనినుండి బౌద్ధయుగమున వ్రాత సర్వసామాన్యముగ నుండెడిదని తెలియుచున్నది. ఈ బౌద్ధ వాఙ్మయము క్రీ. పూ. 6-వ శతాబ్దినాటిదని యెల్లరు నంగీకరించియున్నారు.

ఇంతకంటెను ప్రాచీనమగు సంస్కృత వాఙ్మయమునగూడ నిట్టి నిదర్శనములుగలవు. లిపి, లిపికరయను పదములును, యవనానీయను లిపియొక్క ప్రశంసయు పాణినీవ్యాకరణమున గలవు. (17) పాణిని కాలము క్రీ. పూ. 4-వ శతాబ్దియని మాక్సుమూల రభిప్రాయపడియుండెను. కాని గోల్డ్‌స్టకర్ భాండార్కరు పండితులాతడు క్రీ. పూ. 8-వ శతాబ్దికి పిమ్మటనుండియుండుట కవకాశముకాదని నిర్ధారణ చేసియున్నారు. దీనినుండి క్రీ. పూ. 8-వ శతాబ్దినాటికే లేఖనము భారతీయులకు చిరపరిచితమని తెలియుచున్నది. పాణినీ వ్యాకరణమున కన్నను ప్రాచీనమగు వైదికవాఙ్మయముగూడ యీలిపి ప్రాచీనతను నిర్ణయించుట కుపకరించుచున్నది. అక్షర, పటలి, కాండ, గ్రంథ యనుపదములనేకములుగ వేదములలో గలవు. (18)గద్యపద్యరచనములును, విషయసూచికా నిర్మాణములును శబ్దవ్యాకరణ శాస్త్రముల యుత్పత్తినిగాంచినచో వేదకాలమునకే చక్కని లేఖనజ్ఞానము భారతీయులకుండెడిదని స్పష్టమగుచున్నది. వేదములు క్రీ. పూ. 15-వ శతాబ్ది నాటివని పండితుల యభిప్రాయము.

ఇటీవల పంజాబులో భూగర్భమునుండి బయల్వెలింపబడిన చారిత్రకసామగ్రిలో కొన్నిముద్రలు 'సీల్స్' గలవు. వానిపై నొకవిధమగు చిత్రలిపిలో గొన్ని యక్షరములు వ్రాయబడియున్నవి. రాయబహాదర్ విష్ణుసరూప్ అను పండితుడే చిత్రలిపి బ్రాహ్మీలిపికి మాతృకయనియు, దానికంటె ముందుగ వాడుకలో నుండినదనియు దెల్పియున్నారు. పంజాబులో బయల్వెడలిన యీ నాగరికత క్రీ. పూ. 3000 నాటిదని పండితులెల్లరు నంగీకరించియున్నారు. (19) దీనినుండి యీకాలమునకే భారతీయులకు లిపిజ్ఞాన ముండినదని స్పష్టమగుచున్నది. అటుపై నెట్టి విదేశీయోత్పత్తి వాదమునకును తావులేదనియు దెలియుచున్నది.

ఇంతవరకును భారతీయ లిపిపరిజ్ఞానముయొక్క ప్రాచీనతను చర్చించియుంటిమి. వ్రాయుట దెలిసినచో గ్రంథములను నిర్మింప నవకాశ మేర్పడును. ఈ పుస్తకనిర్మాణ మభివృద్ధినందుటకు లేఖనాయోగ్యములగు వస్తువు లవసరములు. ఈరెండు నుండినచో గ్రంథాలయము లేర్పడగలవు. గాన నిటుపై ప్రాచీనకాలము

---

8. W.I.S. 16,280.
9. Bor I, p 59.
10. Siynki I p 77. Beouni-India I p 171.
11. Wis 16, p 281.
12. Bib Ind. 145.
13. See Ch. II p 11.
14. Biihler-Indian Studies III.4.p.4.
15. Ibid III, 7 f 10 & 18.
16. Ibid III, 13 ff.
17. Grammar III-2-21.
18. Das Mahabharata 188 ff ; S.BE XXV index ; Hemadri - Danakanda ch 7 p 544.
19. Arch. Sur of Ind. Anul. Rept. 1926-27 p 54.

నుండియు నీదేశమునం దుపయోగింపబడుచుండిన లేఖన సామగ్రిని వర్ణింపవలసియున్నది. ఈ సందర్భమున శాసనములు, వాఙ్మయము, విదేశీయుల వ్రాతలు మున్నగు సాధారము లెక్కుడుగ దోడ్పడుచున్నవి.

## భూర్జపత్రము

క్వింటస్ కర్టియస్ అను రోమను చరిత్రకారుడు అలెగ్జాండరు హిందూదేశముపై దండెత్తునాటికి హిందువులు భూర్జపత్రములను వాడుచుండిరని వ్రాసియున్నాడు.(20) బౌద్ధబ్రాహ్మణవాఙ్మయములలో నీ భూర్జపత్రము విశేషముగ బ్రశంసింపబడినది. బెరూనీ యనునతడు హిందువులీ భూర్జపత్రములను తయారుజేయు పద్ధతిని పేర్కొనియున్నాడు.(21) ఆకులను దెచ్చి వానిని మూరెడుపొడుగును, జానెడు వెడల్పును గల ముక్కలుగా గోయుచుండిరి. అటుపై వానిమీద నూనెనుగాసి మెరుగుపెట్టెడివారు. ఇట్టియాకుల నొకదానిపై నొకటియుంచి, సన్నని మొనగల లోహదండముతో, వానిమధ్య నొకరంధ్రమును చేయుచుండిరి. దీనిగుండ నొకతాడు దూర్పబడుచుండెను. దానినీ యాకులచుట్టును జుట్టుటచే పత్రములూడకుండెడివి. ఇట్లు నిర్మింపబడిన పుస్తకములెన్నియో నేటికిని కాశ్మీరదేశములోని పండితులవద్దను, ఒరిస్సాలోను యితర భాగములందును గలవు.(22)

## వస్త్రము

నియార్కస్ అను యవన చరిత్రకారుడును, కొన్ని స్మృతులును వస్త్రముగూడ నొకప్పుడీదేశమున లేఖనసామగ్రిగ నుపయోగింపబడుచుండెనని దెల్పుచున్నవి.(23) క్రీ.పూ.3వ శతాబ్దినుండి క్రీ.శ. 3-వ శతాబ్దివరకును దక్షిణాపథము నేలిన శాతవాహనాంధ్రుల శాసనములనుండి రాజకీయవైయక్తిక వ్యవహారములు పట, పటికలేక కార్పాసపట యనుగుడ్డపై వ్రాయబడుచుండెడివని తెలియుచున్నది.(24) నేటికిని కన్నడదేశమునందలి వర్తకులు గొందరీగుడ్డపైననే తమ లెక్కలు మున్నగువానిని వ్రాయుదురు. మొదట చింతగింజలవాడకంబెట్టి చిక్కని యంబలిని గుడ్డపై పూయుదురు. అటుపై దానిపై బొగ్గుపొడిచిచల్లి గుడ్డపైభాగమును పలకవలె నల్లగజేసి దానిపై సుద్దతోనో బాతుకలముతోనో వ్రాయుదురు.(25) ఈ పద్ధతినే ప్రాచీనులుగూడ నవలంబించియుందురు. ఇట్టి గుడ్డతునకల నొకచోజేర్చి కుట్టుటచే నేర్పడిన పుస్తకములు జసల్మీర్, అన్హిల్వాడ్ పట్టిన్ మున్నగుచోట్ల గన్గొనబడినవి. (26)

## కఱ్ఱపలకలు

బౌద్ధభిక్షువులు తమ సాంసారిక శిష్యుల యుపయోగార్థమై మతవిషయములను కఱ్ఱపలకలపై వ్రాసియిచ్చుచుండిరని వినయపిటకము దెల్పుచున్నది. శకరాజగు నహపానుని కాలమునాటి యేకశాసనమున వర్తకులు తమ యొడంబడికలను, శ్రేణీమందిరమున కఱ్ఱపలకలపై వ్రాసికొనుచుండిరని చెప్పబడియున్నది.(27) కాత్యాయనుడు అర్జీపత్రములను కఱ్ఱపలకలపై పాండులేఖతో వ్రాయవలెనని శాసించియున్నాడు.(28) దండికవి తన దశకుమారచరిత్రమున రంగువేయబడిన కఱ్ఱపలకపై నొక రాజశాసనము వ్రాయబడెనని పేర్కొనియున్నాడు.(29) ఇట్టి పలకలపై వ్రాయబడిన గ్రంథమొకటి అస్సాంలో దొరకినది. అది నేడు బోడ్లియన్ గ్రంథాలయమున నున్నది.(30) ఈ కాలమునగూడ పశ్చిమోత్తర రాష్ట్రమున బీదవారు సుద్దతో కఱ్ఱపలకలపై దమతమ గ్రంథములను వ్రాసికొనుచున్నారు. (31)

---

20. Bothlingk & Roth - Sans. Wort. See under 'Bhurja.'
21. Beruni - India I p. 171.
22. Gough's papers - Kashmir Rept. 29 n 2.
23. Grundriss VII p 114.
24. ASWI IV p 104. ins no. 11.
25. Mysore & Coorg Gazetteer 1877 vol I p 408.
26. Rept. on Sans. Mss V p 113.
27. ASWI. Rept IV p.102. ins no. 7.
28. Burnell-S. Ind. Pale.p 87. n 2.
29. Ucchvasa 2.
30. Biihler-Ind Pale. p. 94.
31. Gough's pepers. p 18.

## తాళపత్రములు

బహు ప్రాచీనకాలమునుండియు భారతదేశమున తాటియాకులు సర్వసామాన్యముగ వ్రాయుటకై వాడబడుచుండెడివి. ఇటీవల మనదేశముననూ, మధ్య ఆసియాలోను క్రీ. శ. 4-వ శతాబ్దినాటి తాళపత్ర గ్రంథములు దొరికినవి.(32) హుయాన్ ష్వాంగ్ కాలమునకే గౌతమబుద్ధుని నిర్వాణానంతరము గావింపబడిన బౌద్ధ సభలో పండితులెల్లరునుజేరి తమగురుని బోధనలను తాళపత్రములపై వ్రాయించిరను గాథ ప్రబలముగ నుండినది. (33) ఈ పత్రములను తయారుచేయు విధము తెలియుచున్నది. వీనినుపయోగించువారు ఒకటి నుండి మూడడుగులవరకును పొడవును, ఒకటింబాతిక నుండినాలుగంగుళములవరకును వెడల్పునుగలతాటియాకు ముక్కలనుకోని, నీటిలో నానబెట్టి లేక యుడకబెట్టి, గవ్వలతో వీనిపైనరాసి మెరుగుబెట్టుచుండిరి. పిమ్మట వీనిపై కలముతోగాని గంటముతోగాని వ్రాయుచుండిరి. గంట ముపయోగింపబడినచో, నక్షరములపై మసినిగాని బొగ్గుపొడినిగాని బూయుచుండిరి. యడుగునను పైనను రెండుకఱ్ఱపలక లమర్పబడుచుండెడివి. పై పలకనుండి, తాటియాకులగుండా యడుగు పలకలోపలనుగూడ, మధ్యనో ప్రక్కలనో రంధ్రములను చేయుచుండిరి. వీనిలోనుండి తీయబడిన పొడవైన త్రాళ్ళు పుస్తకముచుట్టును చుట్టబడుచుండెడివి. ఇట్టి తాళపత్ర గ్రంథములు మనదేశమున వేనవేలుగలవు.

## చర్మము, దంతము

చర్మముగూడ నీ దేశమున లేఖనసామగ్రిగ నుండెడిదనుటకు వాఙ్మయములలో నెన్నియో నిదర్శనములు గలవు. చర్మముపై వ్రాయబడిన గ్రంథములు మధ్య ఆసియాలో దొరకినవి. కాని యపవిత్రతవలన చర్మము విశేషముగ వ్యాప్తినంది యుండలేదు. దంతమును ప్రాచీనులు వ్రాయుటకై ముందుగ నుపయోగించియుండిరి. ఇట్టి పుస్తక మొక్కటిమాత్రము నేడు బ్రిటిష్ మ్యూజియములో గాంచనగుచున్నది. ఇయ్యది బర్మాలో దొరకినదట.(34)

## లోహములు

లోహపురేకు లీదేశమున ప్రాచీనకాలమునుండియు వ్రాయుట కుపయోగింపబడుచుండెడివి. రాజశాసనములును, ముఖ్యములగు కుటుంబ విషయములును వెండి బంగారు రేకులపై వ్రాయబడుచుండెడివని జాతకకథలు దెల్పుచున్నవి.(35) ఇట్టి రేకొకటి తక్షశిలలో దొరకినది (36) ఆంధ్రదేశమున భట్టిప్రోలు స్థూపమును త్రవ్వినపుడార్ష శాఖోద్యోగులు వెండిరేకులపై లిఖింపబడిన గ్రంథమును గన్గొనిరి.(37) అయినను రాగిరేకులే సర్వసామాన్యముగ నుపయోగింపబడుచుండెడివి. మౌర్యచక్రవర్తుల కాలమున రాజశాసనము లిట్టిరేకులపైనే వ్రాయబడుచుండెడివి. (38) కనిష్క చక్రవర్తి బౌద్ధగ్రంథములను రాగిరేకులపై వ్రాయించెనని హుయాన్ ష్వాంగ్ వ్రాసియున్నాడు. (39) అమూల్యములగు కావ్యనాటకాదులు గూడ నిట్టి రేకులపై వ్రాయబడుచుండెడివి. తాళ్ళపాకవంశీయు లెన్నియో తరములుగ వ్రాయుచుండిన కీర్తనలు మున్నగునవి గల రాగిరేకు లెన్నియో తిరుపతిదేవస్థానమున గలవు. బర్మాలోను, సింహళములోను లభించిన యిట్టి గ్రంథములు కొన్ని బ్రిటిష్ మ్యూజియములో నున్నవి. (40)

ఈ రాగిరేకులపై రెండువిధముల వ్రాయుచుండిరి. ఇసుకను బంకమట్టిని జిగురుగాకలిపి యొకదిమ్మవలె చేసి, దానిలో నక్షరములనువ్రాసి యెండబెట్టి, ఆ యచ్చులో రాగిని కరగించిపోయుట యొకపద్ధతి. సుత్తి సహాయమున యులితో రేకులపై యక్షరములను చెక్కుట రెండవపద్ధతి. ఈ రేకులన్నిటికి నొకప్రక్కను చిల్లికొట్టి నాలుగైదింటిగుండా రింగును దూర్చి దాని నతుకుచుండిరి. లోపలివ్రాత చెడకుండుటకై రేకుల చుంబులు కొంచెమెత్తుగ చేయబడెడివి.

32. J.A.S.B. 66. p 225 ff.
33 Beals II p 225.
34. Jour Pali text SOC 1883 p 135 f.
35. Buhler-Indian studies III p 10 f.
36. Arch. sur. rept II p 129.
37. Ibid new imp see XV p 13 pl 6.
38. Buhler - ind Pale p 32.
39. Eumell - S. ind Pale p 86.

## రాళ్ళు, యిటుకలు

అనేకములరాళ్ళు యీ దేశమున సులభముగ లభించెడివి. గాన పూర్వకాలము సాధారణముగ నీరాళ్ళనే వ్యావహారికవిషయములను వ్రాసికొనుటకు జను లుపయోగించుచుండిరి. ధానధర్మములను, విజయములను ప్రశంసించు శిలాశాసనము లీదేశమున వేలకొలది గలవు. క్రీ. పూ. 3-వ శతాబ్దినాటి అశోకుడే శిలాశాసనములను వేయించుటలో తానొక ప్రాచీనాధారము ననుసరించుచున్నటుల జెప్పికొనినాడు. ఇటుల దానధర్మములేగాక కావ్యనాటకాదులుగూడ రాళ్ళపై చెక్కబడుచుండెడివి ఇందుమూలమున వానికి స్థయిర్య మేర్పడునని పూర్వుల యభిప్రాయము. చౌహామాన రాజగు నాలవవ్యాఘ్రరాజు నాతని యాస్థానకవియగు సోమదేవుడును రచించిన నాటకమొకటి. అజ్మీరులో నొకబండపై చెక్కబడినది.(41) రాజపుత్రస్థానములో బిఝోలియనుచోట నొక రాతిపైన కొన్నిసర్గలుగల జైన స్థలపురాణమొకటి గలదు.(42) విదిశలో కాళిదాస కృతమగు ఋతుసంహార మొక శిలమీద చెక్కబడియున్నది. పశ్చిమోత్తర పరగణాలో నిటేవిధమున వ్రాతగల యిటుకలెన్నియో గన్గొనబడినవి.(43)

## కాగితము

ప్రాచీనకాలమునం దేదేశమున కాగితమరుదుగ నుపయోగింపబడెను. ఈ యాచారము మొదటిసారి క్రీ.శ. 11-వ శతాబ్దమున గాంచనగుచున్నది.(44) మాల్వా, గుజరాత్, అన్హిల్వాడ్ మున్నగుచోట్ల 14-వ శతాబ్ది నాడు కాగితములపై వ్రాయబడిన గ్రంథములు లభించినవి.(45)

## సిరా

ప్రాచీనులు సిరా నుపయోగించిరని పైలేఖన సాధనములే దెల్పుచున్నవి. సిరాకు మసియని పేరు. పురాణములలో మసీపాత్ర, మసీభాండ, మసీకూప యనుపేర్లు సిరాబుడ్డికి గాంచనగుచున్నవి. క్రీ. పూ. 4-వ శతాబ్ది నాటి నియార్కస్ అను యవనదేశీయుడు హిందువులు భూర్జపత్రములపై సిరాతో వ్రాయుదురని చెప్పియున్నాడు (46) అంధేరిలోను, రాజపుతానాలోను గల యశోకుని స్థూలముపై మొదట సిరాతో వ్రాసిపిమ్మట యులితో చెక్కిరని పండితుల యభిప్రాయమైయున్నది.(47) అనేక రకములబొగ్గు. జిగురు, పంచదార మున్నగువానితో సిరా తయారుచేయబడుచుండెను.(48)

పై చర్చనుండి భారతదేశీయులకు క్రీ. పూ. 3000 నుండియు లిపి పరిజ్ఞానముగలదనియు, ప్రాచీనకాలము నుండియు వారు పుస్తకములను తయారుచేయు పద్ధతిని రాసియుండిరనియు, వారిచే వ్రాయుటకై పలు విధములగు సామగ్రి యుపయోగింపబడుచుండెడివనియు స్పష్టమగుచున్నది. తాళపత్ర భూర్జపత్రము లుత్తమ తరగతికి జెందినవి. గ్రంథాలయములకు పుస్తకములను భద్రపరచుట ముఖ్యకర్తవ్యము. సాధారణముగ నీ తరగతి గ్రంథముల నూకలోవేసి కుండలలో దాచియో, లేక గుడ్డలలోచుట్టి పెట్టెలలోనో జాగ్రతపరచుచుండిరి. వీనిని లోహపురేకులపై వ్రాయబడిన పుస్తకములను భద్రపరచుటకు నేటి గ్రంథాలయములలోవలె యద్దముల బీరువాలును, బల్లలు కుర్చీలు నవసరములేకుండినవి. దీనినుండి ప్రాచీన భారతీయగ్రంథాలయముల యొక్క స్వభావము స్పష్టమగుచున్నది.

—మారేమండ రామారావు, ఎం.ఏ, బి.ఇడి.

41. Indian Antiquary XX p 201 ff.
42. Buhler - ind Pale p 97.
43. Arch sur Rept I p 97.
44. Gough's papers p 16.
45. Rept on sans. mss. V p 123&125.
46. Bothlingk & Roth - sans. Wort. see under 'Masi'
47. Buhler - ind studies III p 61 f & 69.
48. Gough's papers 18 f; Kashmir Rept p 30.

# "చిన్న చిన్న వ్యాసాలు" గురించి

కామేశ్వరరావుగారి "చిన్నచిన్న వ్యాసాలు"* వంటి వ్యాసాలు వాఙ్మయాన్ని తీర్చి దిద్దుననుటకు సందేహం లేదు. కాని ఆవ్యాసంలో చర్చనీయాంశములు కొన్ని వున్నాయి

ఇప్పటి చిన్నచిన్న పత్రికలు చిన్నచిన్న వ్యాసాలే కావాలని వ్యాసాల సైజులు నిర్ణయం చేస్తున్నాయని వ్యాసకర్త ఆక్షేపించుచున్నాడు. కాని నేటిపత్రికాధిపతులు చిన్నచిన్న వ్యాసాలు కోరటంలో కొంత ఉద్దేశం లేకపోలేదు. వాఙ్మయపత్రిక ఒక ఉద్యానవనం లాంటిది. ఉద్యానవాటికలో రకరకముల పువ్వులమొక్కలుంటే నాజూకుగావుంటుంది. వివిధ పరిమళాలు గుబాళిస్తవి. పలువన్నెల పూవుపడంతుకలు నేత్రానందముగా నవ్వుతూ నాట్యంచేస్తారు. పలు రకములగు ననపొదలు హృదయాన్ని పల్లవింప చేస్తాయి. అల్లాగే ఒక వాఙ్మయ పత్రిక వివిధములగు వ్యాసాలు కల్గివుంటే ఒక్కొక్కవ్యాసం ఒక్కొక్క విధమగు ఆనందాన్ని యిస్తుంది. అదీకాక లోకం భిన్నరుచులతో మిళితమైవుంది. ఒక్కొక్కరికి ఒక్కొక్క విధమగు వ్యాసముపై నభిరుచి. నామట్టుకు పద్యవ్యాసం అంటే ఆసక్తి. మాకుటుంబములోనే కొందరు పత్రికలోని కథలను మాత్రమే చదివి పత్రికను జారవిడుస్తారు. నాస్నేహితు డొకడున్నాడు. అతనికి విమర్శకవ్యాసాలంటే ప్రీతి. మాగురువుగారు శాసనవిషయిక వ్యాసాలనే నిరంతరం తిలకిస్తూవుంటారు (వ్యాకరణ విషయిక వ్యాసాలతోపాటు) పత్రికాసంపాదకులు ఇన్నివిధములగు వ్యాసాలను కూర్చి ఇందఱినీ సంతోషపెట్టి ప్రఖ్యాతిని గడించాలని ప్రయత్నిస్తారు. నిజానికి వారివిధికూడా అంతేనూ. ఒకపత్రికలో తుదినుండి కడవరకు ఒకకథే ఆక్రమిస్తే కథలు చదివేవాళ్ళని ఆపత్రిక ఆకర్షించవచ్చునుగాని, మఱి తక్కినవారి మాటయేమి? ఆపత్రికకు ఎక్కువప్రచారం ఎట్లు జరుగుతుంది? కాబట్టి పత్రికాధిపతి నిత్యం తన పత్రికలో అన్నిరకాల వ్యాసాలూ ప్రకటించడానికి పాటుపడటంలో తప్పేమీ లేదు మఱి పత్రిక చిన్నదైనప్పుడు ఇన్నిరకముల వ్యాసములను—ఒక్కొక్కటి విశాఖపట్నం చేదత్రాడంత వుంటే—ఏలాగ ప్రకటించటం? అంచేత చిన్నచిన్న పత్రికలు చిన్న చిన్న వ్యాసాలనే కోరుతవి. చిన్నచిన్న వ్యాసాలంటే ప్రతిభ లేని వ్యాసాలని కాదు వాటి వుద్దేశం—తక్కువపరిమితి గల జాగాలో ఎక్కువప్రతిభను చూపే చిన్న వ్యాసాలని. అందుచే చిన్నచిన్న పత్రికలలోని చిన్నచిన్న వ్యాసాలు కొలదిమాత్రపు జాగానే ఆక్రమించుకొంటున్నా దిక్తటాలకి విరజిమ్మే ప్రతిభను వెదజల్లుతూ వుండాలి, ఒకచిన్న విరజాజిపువ్వు పెరడల్లా నెత్తావి జల్లుతూ హసించినట్లు.

ఒక్కరూపాయికే చందాదారులకి అనేక వ్యాసాలుగల సంచిక నెలనెలకీ అందచేస్తున్నామని గర్వించడంకోసం సంపాదకులు చిన్నచిన్న వ్యాసాలుకోరటంలోగల ఉద్దేశము అనే కామేశ్వరరావుగారి వ్రాత సత్యదూరమయింది. ఒక్కరూపాయికే చందా

---

* శీర్షికము : ఆంధ్రభూమిలో ప్రచురింపబడిన కె. కామేశ్వరరావుగారి వ్యాసం.

దారునకు వివిధ విషయికములగు వ్యాసములతో (ఒక్కొక్కరి యభిరుచికి తగు నొక్కొక్క వ్యాసంతో),మిశ్రితానందము, పలువన్నెల జిలుగులు ఇంద్రధనస్సులో రంగుల్లా చూపించే ముద్దుల మూటకట్టు చిన్నచిన్న వ్యాసాల్ని ప్రకటించే పత్రిక అందించటంకోసాన్ని సంపాదకులు తాపత్రయం పడతారేకాని, చందాదారుల కళ్ళకి మసిపూసి, పత్రికలో పులుముడు పులిమి, డబ్బుదోచుకుందామనే ఉద్దేశంతో ఎంతమాత్రం కాదు. ఇది అనుభవజ్ఞులకు కాని విదితంకాదు.

ఇంక పొట్టివ్యాసాల ప్రతిభనుగురించి. 'జానెడువ్యాసంలో గ్రంథకర్త యేమాత్రం పనితనం చూపించగలడు?' అంటారు కామేశ్వరరావుగారు. లోకపరిశీలన, కల్పనాశక్తి చూపించాలంటే జానెడు జాగాలో జరగదని వారి వుద్దేశం. 'పత్రికాధిపతులు చిన్నచిన్నవ్యాసా లెప్పుడైతే కోరేరో అప్పుడే వ్యాసాలలో గుణం తగ్గిపోయింది' అంటారు. నాకేంనచ్చలేదు. గ్రంథకర్త ఒక చిన్న జాగాలోనే తనపనితనంలోని సారం ఎందుచేత ఇముడ్చలేడు? చిత్రకారుడు ఒక స్త్రీని చిత్రించాలంటే ఆస్త్రీఅంత ప్రతిమనే వ్రాస్తున్నాడా? ఆస్త్రీమూర్తిని ఒక చిన్న కాగితముపై ఇమిడ్చి తద్రూపమును విస్ఫుటముగ ప్రదర్శింపచేయుచున్నాడు కదా? అట్లే గ్రంథకర్తయు తనకల్పనాశక్తిని ఒక చిన్న వ్యాసంలో ఏల ఇముడ్చలేడు? పెద్ద వ్యాసంలోఐతే గ్రంథకర్త తన లోకానుభవాన్ని, కల్పనాశక్తిని సులువుగా, విశేష ప్రయాసంలేకుండా చూపింపవచ్చునంటే కొంత నమ్మవలసివుంది. పెద్ద బల్లపైకంటె, ఒక చిన్న బెత్తెడు దంతపుముక్కపై పనివాడు పనితనం చూపించడానికి ఎంతకష్టపడుతాడో గ్రంథకర్తకూడా చిన్నవ్యాసాల్లో కొద్దిగా ప్రయాసపడవలసి వుంటుంది తనశక్తి చూపించటానికి అంతేకాని చిన్న వ్యాసాల్లో ప్రతిభ లేదని కొట్టిపారెయ్యటానికి వీలులేదు. ప్రతిభ, గుణం, భావనాశక్తి, కవిత్వపటుత్వం, కల్పనాచాతుర్యం, లోకానుభవగరిమ ఇవన్నీ వ్యాసపరిమాణాన్ని బట్టి వుండవు; గ్రంథకర్తనుబట్టి వుంటాయి సామర్థ్యంగల గ్రంథకర్త అయితే, పెద్దజాగాలో ఎంతశక్తిని చూపిస్తాడో, చిన్నజాగాలోకూడా అంతశక్తినీ యిముడుస్తాడు; చిన్న లక్కపిడతలో నాలుగు చేగోణీలు ముక్కలు చేసి ఇమిడ్చిన కుర్రాడిలాగ.

ఒకపెద్ద వ్యాసంరాసి దానిసొంపు చెడిపోకుండా చిన్నదిగా ఇముడ్చడం వీలుకాకపోతే గ్రంథకర్త ,దాన్ని పుస్తకరూపంగా ప్రకటించటం సమంజసం; లేకపోతే పెద్ద పత్రికలకు ప్రకటనార్థం పంపటం ఉచితం. ఇంతకూ, పత్రికాధిపతులను నేను కోరేదేమిటంటే రాశిలో గుణంతప్పని సరిగా వుంటుందని ఎప్పుడూ తలంచవద్దు, రాశిని చూసి భ్రమించవద్దు. ఇంతరాశివుంది; ఇందులో ఏమాత్రమైనా గుణంవుండక పోదు అనే నమ్మకంతో దానిని ప్రకటించవద్దు. వ్యాసం చిన్నది కనుక గుణంకూడా కొద్దియే అనుకోనూవద్దు. పెద్ద చిన్న తారతమ్యం చూడవద్దు; గుణమే పరిశీలించాలి; పెద్ద పువ్వని ఉమ్మెత్తపువ్వుని హృదయానికి హత్తుకొని, చిన్నపువ్వని మల్లెపువ్వుని రసికహృదయులు విసిరివేయవద్దు ఆకారంలో చిన్నదైనంతమాత్రాన గుణంలో తప్పనిసరిగా అధమంగా ఉండాలన్న నిబంధన ఏశాసనపుస్తకంలో వుంది?

—ఓలేటి సీతారామమూర్తి, బి.ఏ.

# ధర్మజునితో రారాజు

౧

పత్తన మొక్కఁడేనియును పాండుసుతా యిడనన్న నాదు సం
పత్తున కెల్ల నాసపడి బంధుజనాళి వధించి రాజ్యమే
హత్తుకొనంగ నెంచితివి అంతయుఁబోయిన రిక్తభూమి నీ
నెత్తిన గొట్టుకొమ్మనకను నీతివిదూరుఁడవైన ధర్మజా?

౨

పురుషవరుండవై సమరభూమిని నిల్చి యధర్మమంచు నీ
వరయక నిట్లు రాచమరియాద నతిక్రమణంబొనర్తు వం
చెరిగినచో నెలాగయిన నిమ్మహినేలఁగఁబూను నీదు సు
స్థిరమగు తిక్కఁ దిన్నఁగ గుదిర్చెడివాడ ననుచున్న ధర్మజా?

౩

అతులపరాక్రమోద్వలుఁడటంచు జగంబునుతింప యెట్లనా
అతఁడు గలంతకాలము జయంబులభించుట సత్యమంచు మీ
సతులనునైన కర్ణునకొసంగి వశీకరణంబొనర్పఁ బూ
నితి వపురా! యికేమనఁగనేర్తుము నీదగు రాజ్యకాంక్షకున్.

౪

ధర్మావలంబివై దనరితి వందుమా పాడు జూదంబు నీవాడినావు
సత్యవ్రతంబును సలిపితి వందుమా అనిలో నసత్యంబు లాడినావు
వీరత్వమునుజూపి వెలసితి వందుమా పగరకు వెన్నిచ్చి పారినావు
భక్తిరసంబును పరికింత మందుమా గురునిపై శరములఁ గుప్పినావు
ఐహికానందమే నిత్యమనుచునమ్మిమాన మభిమానములమాట మరచు నీదు
తుచ్ఛవృత్తిని గనిన తూథూయటంచు నుమియకుందురె జనము లీయుర్విలోన.

౫

పాలించితిని మహీపాలపాలకుఁడన నిజభుజాయితధాటిని నిఖలజగము
చవిఁజూపితిని నాదుసాహసంబెలమి సుయోధనుండను పేరు బోధపడఁగ
పొలుపొందితిని సర్వభోగభాగ్యంబుల చూచువారలకు నసూయవొడను
పోషించితి సమస్త భూజనావళి నెల్ల కన్నబిడ్డలజాడ కరుణతోడ.
సకలసామంత రాజన్య మకట ఘటిత
పాద పంకేరుహుండనై బరగినేఁడు
కాలవశమునఁ జిక్కితిగాని నేను
కాళ్ళు లేకను చిక్కుట కల్లయనుచు
దలపు మెప్పటికేనియు ధర్మరాజ!

—కొత్త సూర్యనారాయణ.

# నా ఆంధ్రభూమి

జగదేక పూజ్యులు జానకీరాములు
మెట్టి తిర్గినది నా మేటిభూమి
అనుపమయశులగస్త్యాది మునీంద్రులు
తపమునల్పినది నా ధర్మభూమి
శకపురుషులు మహా శాలివాహనముఖ్య
రాజులేలినది నా రమ్యభూమి
శ్రీగిరి తిరుపతి సింహాద్రి మున్నగు
నగములున్నది నాదు నాకభూమి

పూజ్య గౌతమి కృష్ణాది పుణ్యనదుల
నీరములఁదోఁగినది నా సారభూమి
అట్టి నాయాంధ్రభూమికి నహరహంబు
హస్తములు మోడ్చి మ్రొక్కెదనధికభక్తి

—కనుపర్తి వరలక్ష్మమ్మ.



ధూపము

[శ్రీయుత వరదా వేంకటరత్నముగారు చిత్రించినది.]



సర్ ఈనాక్ హిల్.

# సర్ ఈనాక్ హిల్

ఫోర్డు, లిప్టను, ఈస్టుమాన్, సీవర్ హూమ్ మొదలగు వణిక్పుంగవుల నామములవలె ఈనాక్ హిల్ నామము బహుళప్రచారము నందలేదు. ప్రజాలోకమున పాదుకొనిపోవుచు వారి జీవితవిధానమును పూర్తిగ మార్చివైచిన క్రొత్తదానినెద్దియు నాతడు కనుగొనలేదు. రేఖ బయలుపడి అతడు హఠాత్తుగ కోటీశ్వరుడు కాలేదు. కొద్దిపౌనులతో వర్తకము ప్రారంభించి వానిని అచిరకాలముననే లక్షలుగ పెంచలేదు. కాని అతడెప్పుడైన స్వప్నలోకమున విహరించినచో—జయశిఖర మందిన పలువురు స్వప్నలోకమున విహరించియుండుట కలదుగదా—ఆ విహారము నిరంతరపరిశ్రమ కొఱకును ప్రజాహిత జీవనము కొఱకునుగాని ధనముకూర్చుటకును యశోధనమార్జించుటకును గాదు. అతడు ఈనాక్ హిల్.

సంఘవ్యవస్థయందు అతని కెట్టి యున్నతస్థానమును లేదు. ఎట్టి విద్యాలాభమునులేదు—నిఱుపేదబాలుడు. అతనికున్న ఆస్తియంతయు కష్టపడి పనిచేయుటయందు తఱుగని ఇష్టము, అభివృద్ధికి వచ్చుటయందు తీరని కాంక్ష కాగా అతడొకగొప్ప ఫినాన్షియర్ అయినాడు; నాలుగుకోట్ల డెబ్బదిలక్షలపౌనుల విలువగల ఆస్తిగల బ్రిటనునందలి ఒక పెద్ద బిల్డింగు సొసైటీకి యజమాని అయినాడు.

ఆర్జించిన ధనవిషయమును బట్టిమాత్రమే చూచునో సర్ ఈనాక్ హిల్ జీవితము గొప్ప జయమునందినదని చెప్పజాలము. ఇంతవఱకు ఆంధ్రభూమిలో ప్రచురింపబడిన వణిక్పుంగవుల చరిత్రలు చదివినవారికి వారు వణిక్పుంగవు లగుటయేగాక కోటీశ్వరులు కూడనైయుండుట తెలియును. ఆ కోటీశ్వరులతో పోల్చిచూచినచో హిల్లు పేదవాడనియే చెప్పవలసియుండును. తుదకు అతడు పదిలక్షలకైన అధికారిగాడు. కావలయునను కాంక్ష అతనికి లేకుండుటచేతనే అతడట్లుండిపోయినాడు కాని సమర్థతలేక కాదు. జీవితారంభమునుండియు అతని ఉద్దేశము ఉపకారపరుడై యుండుట—తోడిమానవులకు చేతనైనంత హితము కూర్చుట. అతని ఈ ఉద్దేశము ఎంతవఱకు నెరవేఱినది? ఇరువదియైదు వత్సరములు అతని విశిష్టపరిశీలనమున అభ్రంకషమగు అభివృద్ధినందిన హాలిఫాక్సు బిల్డింగు సొసైటీయొక్క యొకానొక వార్షికసమావేశమున అప్పటి బ్రిటిష్ ఆరోగ్యశాఖామంత్రికి పార్లమెంటరీ సెక్రటరీగానుండిన పార్లమెంటుసభ్యుడు సర్ కింగ్స్లే ఇచ్చిన ఉపన్యాససారాంశమును తెలుపు ఈ క్రింది ఒకదినపత్రిక రిపోర్టు హిల్లు ప్రజాహితకరోద్దేశము ఎంతవఱకు నెఱవేఱినదో తెలుపుచున్నది:

“ఆంగ్లదేశమునకు హిల్లుగారు గావించిన మహోపకారమునుగూర్చి సర్ కింగ్ స్లేవుడ్ ప్రస్తావించెను. ఈ తరములో ఆంగ్ల మహాసంఘమునకు హాలిఫాక్సుబిల్డింగు సొసైటికి మానేజింగు డైరక్టరై హిల్లుగావించిన పాటి సేవను చాల తక్కువమందియే గావించిరని చెప్పుటకు ఎంతమాత్రమును సందేహింపవలసిన పనిలేదు. హాలిఫాక్సు బిల్డింగు సొసైటివంటి ఒక స్థిరమైన, సురక్షితమైన, నమ్మకమైన జాతీయసంస్థ నొకదానిని అభివృద్ధికి గొనివచ్చుటకు తోడు సంఘవ్యవస్థలో విశేషభాగమునకు అనుకూలమగు నెలవు, అధికమగు సుఖము కలిగించి ప్రజాహితమునుగూర్చి మహనీయుడై తన జీవితమును ఈనాక్హువలె అత్యంతతృప్తితో సింహావలోకనము గావించుకొనగలవాడు మఱియొకడు లేడు.”

ఎంతటి ప్రశంస! చదువను వ్రాయను నేర్చుకొనుటకు పాఠశాలకు పోవుచుండవలసిన చిన్నారితనమున పొట్టకూటికి ఒక సిల్కుబట్టలమిల్లులో ఒంటిపూట పనివాడుగా కుదిరి పనిచేసినవాడు పెద్దవారలనడుమ బహిరంగసభలో ఈరీతిని ప్రశంసింపబడువాడగుట అత్యాశ్చర్యకరమైనదే. ఈ ప్రశంసా గౌరవమునందిన పిమ్మట ఇంతకంటెను హెచ్చుఅయిన గౌరవము నాతడు పొందగలిగినాడు. అది ఎట్టిది? సర్ బిరుదమునందుట. ఈ ప్రశంసలు, ఈ గౌరవములు వచ్చుటకు కారణము అతనిదైన బహువత్సర వ్యాప్తమగు నిరంతరదీక్ష, సంతత పరిశ్రమ. ఆ నిరంతరదీక్ష, ఆ సంతతపరిశ్రమ పొట్ట

కూటికి సిల్కు బట్టల మిల్లులో ఒంటిపూట పనివాడుగా నుండినవానిని బ్రిటన్ దేశమున మిక్కిలి పెద్దదగు బిల్డింగు సొసైటీకి జనరల్ మేనేజరుగా చేసివైచినది.

ఒక్కొక్కప్పుడు స్వప్నములుకూడ నిజము కాగలవనుటను హిల్లు జీవితకథ ప్రత్యక్షీకరించుచున్నది. పఠించు ప్రతిబాలుని ఉత్సాహపూరితునిగ చేయజాలినదీ కథ. నేడు ఆంగ్లదేశమునగల మిక్కిలి పేదబాలుడగువాడు కలిగియుండు అభివృద్ధికి రాగలుగు అవకాశములుమాత్రమే ఆతనికుండెను. ఈకథలో ఉత్తేజకరమగు విషయమేదియన హిల్లు త్రొక్కిన జీవితపథమును ప్రతిబాలుడును త్రొక్కకలిగియుండుట. ఆతడు త్రొక్కిన జీవితపథమును త్రొక్కగలిగియుండుటయే కాదు ఆత డుపయోగించిన పద్ధతులనుకూడ ఉపయోగింప ప్రతిబాలునకును అవకాశమున్నది. అట్టిబాలురకు హిల్లు గుణసంపత్తివంటి గుణసంపత్తియుండునో వారు ఆతనివలె గౌరవనీయులు, తాము సేవించినవారి పూర్ణామోదమును బడయుటకు అర్హులు అగుదురు.

ఎబ్బదియేండ్లకు పూర్వము. పాటరీస్‌కు నాతిదూరమునగల లీక్ అను తావున ఈనాక్ హిల్లు జననమొందెను. ఆ ప్రాంతమునందలి పలు కుటుంబములకు వలెనే ఆకాలమున హిల్లు తల్లిదండ్రులు నిఱుపేదలై యుండిరి. ఆర్గురుబిడ్డలలో ఈనాక్ జ్యేష్ఠుడు. ఎనిమిదేండ్ల ప్రాయమున ఆ పేదబాలుని తీవ్రకాంక్ష ఏమి? త్రుణమో కణమో సంపాదించి కుటుంబపు ఖర్చుకు ఆదుకొనుట.

నేనొక ఆర్థికనిపుణుడు (ఫినాన్షియర్)ను కావలయునని ఉన్నదని ఎవరితోనైన చెప్పుము. వారు నీకు గణితశాస్త్రమున పారంగతుడవు కావలయుననియు, ఆర్థికన్యాయములను అవలోడింపవలయుననియు, అర్థశాస్త్రమర్యాదల లోతు ఎఱుంగవలయుననియు, బ్యాంకింగు, కర్రెన్సీ మున్నగు విషయములను ప్రస్తరించు పుస్తకసంపుటములను దీక్షతో పఠింపవలయుననియు, విద్యాపూర్తియైనతోడనే ఏదైన బ్యాంకునందో, ఆడిట్ ఆఫీసునందో ఉద్యోగము సంపాదింపవలయుననియు ఉపదేశింతురు.

పైన పేర్కొనిన 'వలయు'లలో ఒక్కటికూడ లేకపోయినను హిల్లు గొప్ప ఆర్థికనిపుణుడైనాడు. అవు ఒకటి ఆకాశమునందలి చంద్రునిపై దుముకుటకు ఎంతటి అవకాశముగలదో ఈనాక్కు చిన్నతనమున ఉన్నతగణితవిద్యనందుట కంతటి అవకాశముండెను. ఆతని జయనిశ్రేణికయొక్క మొదటిమెట్టు సిల్కుబట్టల మిల్లులో ఆతడు సంపాదించిన ఉద్యోగము—దానినికూడ ఉద్యోగ మనవగునా? పట్టుదారమును చుట్టు చట్రములకు చలనశక్తిని కలిగించు నొకపెద్ద చక్రమును తిప్పుట ఈ ఉద్యోగి చేయవలసినపని. ఇది యైనను ఒంటిపూటపని. పూటకు నాలుగున్నరగంటలు పని ఈపనికి వారమునకు ఒకషిల్లింగు జీతము. ప్రాథమికవిద్య నిర్బంధము. కాగా ఒకపూట సిల్కుఫ్యాక్టరిలోను రెండవపూట పాఠశాలయందును ఈనాక్ గడుపుచుండెను. ఆ దినములలో వారమునకు ఎవ్వడో ఒకపర్యాయము స్కూలునకు మొగముచూపి మిగతా దినములలో వెళ్ళకయే పూర్తి అట్టెండెన్సు ఉన్నట్టుల సర్టిఫికెట్టుల పొందుట పరిపాటియైయుండెను. ఈ వానకాలపు విద్యావిధానమువలని పూర్తిలాభమును హిల్లు బడసెను. కాగా ఆతడు పాఠశాలలో నేర్చినది ఏమియు లేదనియే చెప్పవచ్చును.

పనిదొరికిన కొద్దిరోజుల అనంతరమునకె ఆతనికి ఆ సిల్కుఫ్యాక్టరీలో చక్రము తిప్పుపనికంటె మంచిదగు మఱియొకపని ఈయబడెను. ఒంటిపూట పనివాండ్రకిచ్చు పనులలో అత్యుత్తమమైనదగు సిల్కుపేను షెడ్డులో సహాయకారిగానుండుట అనునది ఆతనికొసంగబడెను. కొద్దిజీతము—కష్టపుపని. కాని అది ఆతనికి ధనముయొక్క విలువను తెలిపినది. కొద్దియో గొప్పయో కుటుంబపుఖర్చులకు తానుకూడ ఆదుకొనుచుంటినిగదా యను సంతృప్తభావమాతని కుండునది. వారమగుటతోడనే జీతమునందికొని దాని నింటికిగొని పోవుటకు ఆతనికి ఆనందమును, ఒకవిధమగు గర్వమును కలుగుచుండునది.

అనంతరకాలమున హాలిఫాక్సు బిల్డింగు సొసైటీకి జనరల్ మేనేజరు అయి వెలుగొందిన హిల్లు తన ఈమిల్లు ఉద్యోగమునువదలి కొలదికాలము పల్లెటూరు పోయి పొలముపనివాడుగా పనిచేసెను. పొలముపని ఆతని మనస్సున కెక్కలేదు. అది తనపనికాదని ఆతడు నిశ్చ

యించెను. తిరిగి పట్టణమునకుపోయి వీధుల మొగలయందు వార్తాపత్రికలు అమ్మి పొట్టపోసికొనుటకు ప్రారంభించెను. నేడు ప్రఖ్యాత పురుషులయియున్న పలువురు జీవితారంభమున వార్తాపత్రికలమ్మి పొట్టపోసికొనియుంటిమని చెప్పుదురు. ప్రజాలోకమున అతిలోకమన్ననలనందిన ఇరువురు ప్రఖ్యాతపురుషుల విషయమునమాత్రము ఈ సంగతి ముమ్మాటికీ యథార్థమనుటకు సందియములేదు. ఆ యిరువురిలో ఒకడు సుప్రసిద్ధ నవలాకారుడగు ఎడ్గార్ వాలస్; రెండవయాతడు మన ప్రస్తుతకథకు నాయకుడగు ఈనాక్ హిల్.

వార్తాపత్రికలమ్ముట. ఈవృత్తి ఈనాక్‌కు ముద్రణ వ్యాపారముతో పరిచయము కల్పించెను. ఈ పరిచయము క్రమముగా సాంద్రమై అతడొక ప్రూఫ్ రీడరుగా ప్రవేశించుటకు వీలుకలిగించినది. శుక్రవారపు సాయంకాలములందు నియమితకాలముకంటె అదనపు కాలము ముద్రణాలయమున పనిచేయు అవకాశము నాతడు పొందగలిగెను. స్థానికవార్తాపత్రిక ముద్రించుటలోకూడ అతడు చేయికలిపెను. ఈ పనిలో అతడు తఱుచు రాత్రులంతయు మేలుకొనియుండువాడు. స్థానిక వార్తాపత్రిక పూర్వకాలపు హ్యాండ్‌ప్రెస్సుపై ముద్రింపబడుచుండెను. గంటకు ఒక వందకాపీలు తయారగుటయే దుర్ఘటముగానుండెను. కాని పనివాడుగా పేరుపొందవలయునను గాఢకాంక్షగల హిల్లువంటి బాలునకు ఆ అచ్చుపని బ్రహ్మానందమిచ్చునది. స్థానికవార్తలను అక్షరములతో కూర్చుట—అది ప్రెస్సులో అచ్చుపడుట—పేపరు ప్రతులు తయారగుట—ఇవి అతనికి నచ్చినవిషయములైనవి. క్రమముగా అతడు ప్రెస్ కంపోజిటరు అయినాడు, తరువాత అచ్చుయంత్రము నడుపువాడైనాడు. ఒకమెట్టునుండి మఱియొకమెట్టునకు సాగినాడు. అచ్చుకూటము, బైండింగుషాపు, పుస్తకవిక్రయశాల ఈ మూడు వ్యాపారములను నిర్వహించుచున్న ఫరములో అతడు పనికికుదిరెను. బాగుగానున్నది. విలువకట్టరాని మూలధనమనదగు చురుకు, కలుపుగల పనివాడు అను ప్రఖ్యాతి అతనికుండెను. కాని చదువులేమి అతని భావి అభివృద్ధికి ఒకపెద్ద అడ్డంకిగానుండెను.

ఈ స్థితిలో అచటిచర్చిలో అధికారిగానున్న విద్యావంతుని సహాయ, సానుభూతుల నాతడు పొందగలిగెను. చదువుట వ్రాయుట, లెక్కలుచేయుట అను మూడువిద్యలును అతడు హిల్లునకు నేర్పెను. ఇట్లుండ అచటి పాఠశాలోపాధ్యాయుని అభిమానమును చూఱగొని వ్యాకరణము, గణితము, ఇతరవిషయములు వీనియందు అధికప్రవేశమునందెను. ఈ ఇరువురి అభిమానమును, అతనికిగల విద్యార్జనాకాంక్షయు ఏకమై అతడావయస్సున విద్యావంతుడగుటకు ఆస్కారము కలిగించినవి. విద్యావంతుడైన అతడిప్పుడు లీక్‌నందలి యునైటెడ్ బిల్డింగు సొసైటీలో ఒకజూనియరు పోస్టును సంపాదింపకలిగెను. అందులో అతనికి ఆ గృహనిర్మాణ సంఘములతో సంబంధము ప్రారంభమైనది. కాలక్రమమున గృహనిర్మాణ సంఘవిషయక విజ్ఞానము ఆతడు సాటిమేటిలేని పండితుడైనాడు.

ఆశ్చర్యకరమగు అభివృద్ధి ఇది అని ఆ యువకునకు తోపజేయురీతిని అతడభివృద్ధినందుచుండెను. కాని అంతతో నాతనికి తృప్తికలుగలేదు తనకు వచ్చినవిద్య విశేషమైనది కాదనుట అతనికి తెలియును. అభివృద్ధి అందవలచినవాని కదిచాలదు. పెద్దపదవులకు, అనుకూలమగు విద్య నాతడు బడయుటకు ప్రయత్నము సాగించెను. ఆ ప్రయత్నము ఫలవంతమగుటకు అతనికి తెలిసినపద్ధతి ఒక్కటియే. అది విరామమెఱుగని పరిశ్రమ. రాత్రులయందు తన ఈడువారు సుఖసుప్తియందు మునిగియుండగా హిల్లు జాగరుడై అభివృద్ధిమార్గములనుబట్టి పోవువాడు విద్యల నార్జించుటలో స్వయంకృషి మానలేదు ఇతరుల సాయమును ఇసుమంతయేని బడయకయే అతడు స్వయంకృషివలన షార్టుహ్యాండ్ నేర్చుకొనెను. షార్టుహ్యాండ్ వచ్చుటచే అతడు స్టాఫర్డుషైర్‌నందలి ఉత్తరభాగమున 'స్టాఫర్డుషైర్ ఎడ్వర్టయిజర్' అను పత్రికకు ప్రత్యేకవిలేఖరి కాగలిగినాడు ఈ సమయముననే అతడొక చిన్న అచ్చుకూటమును స్థాపించియు, బుక్కుషాపు పెట్టియు వ్యాపారము సాగింప ప్రారంభించినాడు. ఏకకాలమున అతడు మూడువృత్తు లవలంబించినాడు. ప్రత్యేకవిలేఖరి; అచ్చుకూటమునకు అధిపతి; బుక్కు-

షాపునకు యజమాని. మూడువృత్తులయందును తగిలియుండుటచే అతని కేనాటికానాడే క్రొత్త అనుభవములు. ఈక్రొత్త అనుభవములతో అతడు దినదినమును క్రొత్త విజ్ఞానమార్జించువాడు.

హిల్లు ప్రజాహితజీవితము 1900-వ సంవత్సరమున ప్రారంభమైనదని చెప్పవచ్చును. స్థానిక పౌర సంఘమునకుచెందిన టెక్నికల్ అండ్ సెకండరీ ఎడ్యుకేషన్ కమిటీలో ప్రింటింగువర్తక ప్రతినిధిగా అతడు సభ్యుడయ్యెను. ప్రింటింగుశాఖలో హిల్లు సర్వమును స్వయముగనే నేర్చుకొనెనే గాని ప్రభుత్వమువారి అనుమతి నొందిన తావున ట్రెయినింగు నొందలేదు. అగుటనాతడు ప్రింటింగువర్తక ప్రతినిధిగా ఉండరాదనిఅచటి ట్రేడు యూనియనిస్టులు కొందరు అడ్డుమాటలుచెప్పిరి.

హిల్లునకు ఇదియొక సవాలు ఆయెను. ఆతడుకోరిన దిట్టిసవాలే. మాంచెస్టరు టెక్నికల్ స్కూలునకు అనుబంధముగా గిల్డుఆఫ్ లండనువారు టైపొగ్రాఫీలో (అచ్చు అక్షరములకూర్పు మున్నగువానికి చెందిన శాస్త్రము) గావించు పరీక్షకు తనను ఒక ప్రయివేటు అభ్యర్థిగా రానీయవలసినదని దరఖాస్తుపెట్టుకొనెను. గిల్డు వారు హిల్ను పరీక్షకు ప్రయివేటు అభ్యర్థిగా రానిచ్చుట కంగీకరించిరి. పరీక్షలు జరిగెను. ట్రెయినింగు అయివచ్చిన విద్యార్థులు నూటికి నలుబదిమంది ఆ పరీక్షలో అపజయమందిరి. ఎట్టి ట్రెయినింగునులేని ప్రయివేటు కాండిడేట్ హిల్ ఆటెక్నికల్ పరీక్షయందు పూర్ణజయమునందెను! అదిమొదలు ఈనాక్ ఎమచ్యూర్ అనుమాట వినిపించలేదు.

ఇంతకు ఒక వత్సరమునకుపూర్వము అతడు లీక్ పురపాలక సంఘమున సభ్యుడుగా ఎన్నుకొనబడెను. అతనిని లోగడనే లిచ్‌ఫీల్డుబిషప్ చర్చిఆఫ్ ఇంగ్లండును రీడరుగా నియమించెను. ఈ పదవిలో అతడు ఆ ప్రాంతమునందలి చర్చిల అభివృద్ధికి అమితసాయమొనర్చెను. చర్చిలలో దైవప్రార్థన సలుపుటకు నియమితులైనవారు సెలవుపెట్టు దినములలో ఈనాక్ ఆపనిని తాను చేయువాడు. ఈ పనిలో అతడు ఒక్కొక్కనాడు వివిధతావులయందు మూడుచర్చిలలో ప్రార్థనలు సలుపవలసియుండువది. క్రైస్తవులచర్చిలలో ప్రార్థనలు ప్రతి ఆదివారమును జరుగునుకదా! ఈనాక్‌వంటి వ్యాపారస్థులకు వారమునకు ఒక్క ఆదివారమే విశ్రాంతిదినము. అట్టి విశ్రాంతిదినమున వివిధప్రదేశములందున్న మూడుచర్చిలకుబోయి ప్రార్థనలు నిర్వహించుట. ఈపనిలో ఆతడు సూర్యోదయము మొదలు సూర్యాస్తమయమువఱకును ఈ చర్చిలకు వెళ్ళివచ్చుటలో కనీసము ఇరువదిమైళ్ళు నడుచుచుండువాడు. బాల్యమున అచటిచర్చి అధికారికడ తాను విద్య నేర్చియుండిన ఋణము నాతడీభంగిని తీర్చి ప్రశంసనీయుడయ్యెను.

ఈ సమయముననే ఆతడు లీక్‌నందలి వార్తాపత్రిక యొక్క నిర్వహణమున భాగస్వామి ఆయెను. ఆ పత్రికతో ఆనాటినుండి నేటివఱకును అతనికి సంబంధము కలదు. ఆ దినములలో ఆ పత్రికతో నాతనికైన సంబంధము అతనిని పూర్తిగ వార్తాపత్రికా నిర్వహణమునకు మగ్నునిగా నొనర్చియుండును. కాని 1896-వ సంవత్సరమున అతడు లీక్‌యునైటెడ్ బిల్డింగు సొసైటీకి మేనేజరుగా నియమింపబడెను. వార్తాపత్రికా నిర్వహణమా, బిల్డింగుసొసైటీ మేనేజరు పదవియా—ఏది ఎన్నుకొనుట? బిల్డింగుసొసైటీలకే అతడు అర్పితుడయ్యెను నాటినుండి ఇల్లు కట్టుకొనదలచినవాని మార్గము సుకరమొనర్చుచుండుటకే అతడు తన సర్వశక్తులను ధారపోయుచుండెను. నాలుగైదు వత్సరములలో అతడు తనదీక్షవలన లీక్‌యునైటెడ్ బిల్డింగు సొసైటీవారి వ్యాపారమును రెట్టింపుచేసెను. ఈనాక్ జీవితములో లభించిన సదవకాశముల కన్నిటియందును శ్రేష్ఠమైనది 1902 లో సంప్రాప్తమయ్యెను.

ఆ వత్సరమున హాలిఫాక్సు పెర్మనెంటు బిల్డింగు సొసైటి మేనేజరుపదవి ఖాళీవచ్చెను. ఆ సొసైటీ అప్పటికే ప్రపంచమునందలి అట్టి సొసైటీలలో పెద్దది, ధనవంతమైనది అయిఉండెను. అట్టి సొసైటీ మేనేజరు పదవి. ఎట్లు వరణీయము కాకుండును? మూడువందల దరఖాస్తులు వచ్చినవి. ఆ మూడువందల దరఖాస్తులలో ఈనాక్ దరఖాస్తుఒకటి. విచిత్రమేమన ఆ మేనేజరు పదవి ఈనాక్‌న కీయబడెను.

హాలిఫాక్సు పెర్మనెంటుబిల్డింగు సొసైటివంటి పెద్ద సంస్థకు నిర్వాహకుడగుటకు వలయుగుణములు ఎట్టివై

యుండవలయునో పోల్చుకొనుటకు ఆ సొసైటిచరిత్ర కొంత తెలిసికొనుటలెస్స మఱియు ఈ ముప్పదివత్సరములదియగు ఆ సొసైటిచరిత్రయు ఈనాక్ చరిత్రయు ఒక్కటియే యగుట ప్రస్తుతము అది ముఖ్యముగ తెలిసికొనవలసినదగుచున్నది.

1852-వ సంవత్సరమున డిసెంబరు 23 వ తేదీని హాలిఫాక్సు బిల్డింగు సొసైటి స్థాపింపబడెను. ఓక్ మార్కెట్టు అని పిలువబడు ప్రదేశమునందలి ఒక చిన్న మేడమీది ఒకగదిలో ఆ సొసైటి కార్యస్థానము. దానికి సాలుకు పదిపౌనులు అద్దె. ఒక డైరెక్టరు, ఒక స్టీవార్డు, ఒక కార్యదర్శి. ప్రతిసమావేశమునకు వీరు రావలసియుండెను. ఆ సమావేశములందు సభ్యులు చందాలనిచ్చువారు. సమావేశమునకు వచ్చుటందుకు డైరెక్టరునకు మొదటి అరగంటకు ఆరుపెన్నీలును, రెండవఅరగంటకు ఒక షిల్లింగును ఒసంగువారు. అతడు ఏ సమావేశముననైన రానిచో రెండుషిల్లింగుల జరిమానా ఇచ్చుకొనవలసియుండెను. కొద్దిమాసములలో కార్యస్థానము ప్రతిదినమును పదిగంటలుమొదలు సాయంకాలము నాలుగు గంటలవఱకు తెఱచియుంచవలసిన అవశ్యకతకలిగెను. ప్రథమ వార్షికనివేదికలో ఆ వత్సరమున సొసైటివారి జమలు 11 333 పౌనుల 1 షిల్లింగు 8 పెన్నీలనియు, ఖర్చులుపోను నిలవ 174 పౌనుల 9 షిల్లింగుల 1 పెన్నీ అనియు తెలుపబడెను. ఆ వార్షిక సమావేశమున ట్రస్టీలలో నొకడుగావించిన ఉపన్యాసము జీవితముయొక్క ప్రథమపాదముననున్న ప్రతివారును చదువదగినది. ఉపన్యాసకు డిట్లుచెప్పెను:

"ధనికునకును దరిద్రునకును సమముగ వాంఛనీయులగు రెండుగుణములను ప్రోత్సహించుటయే ఈ సొసైటివారి ఉద్దేశము. ఆ రెండుగుణములును ఏవియన ఒకటి పొదుపు, రెండు క్రమనిర్వహణము. పొదుపు, క్రమనిర్వహణములేనిచో దరిద్రుడుకాని, ధనికుడుకాని అభివృద్ధి రాజాలడు. చిన్నకుఱ్ఱవాడు కూడబెట్టిన మొదటిపెన్నీ, కూలివాడు ఆదాచేసిన మొదటిషిల్లింగు, పెద్ద జీతగాడు వెనుకవైచిన పదిపౌనులు—వారివారి భావిజయమునకు పునాదిరాళ్ళు. నిర్వహణవిషయమునకూడ నింతే. తాను చేయవలసియున్న పనులను క్రమవిధానమునకు కుదించుకొని తనకార్యమును విభాగించుకొని మెలకువతో పనిచేయువాడు తన కార్యమును సుకరముగ నిర్వహింపగలుగును. క్రమవిధానములేక కాలనియమములేకయుండు వానిపనులు చీకిలిమాకిలిగానుండును. పొదుపు అను గుణమును లోభత్వముగా మాత్రమే పరికించుట పాడిగాదు. లోభిత్వమున ఉండజాలని నైతికమగు ఔన్నత్యము పొదుపుయందుగలదు. పొదుపువలన స్వాతంత్ర్యము, ఉదారత, దేశభక్తి కలుగును. మీ సంస్థకు 'ది హాలిఫాక్సు పెర్మనెంటు బెనిఫిట్ బిల్డింగుసొసైటి' అను నామముంచితిరి. రాగలకాలమునయెల్ల ఈ సొసైటి శాశ్వతముగనుండగలదని నమ్ముచున్నాను."

ఆ ఉపన్యాసకుని నమ్మకము నిజమైనది. సొసైటి శాశ్వతమైనదైనది. ముప్పదిఏండ్ల యనంతరము 1882 వ సంవత్సరమున ఆ సొసైటీఆస్తులు ఒకమిలియను పౌనులను మించినవని ప్రకటింపబడెను. 1902 లో ఈనాక్ మేనేజరుగా నియమితుడైనపుడు సొసైటిఆస్తులు 1 500,000 పౌనులవఱకు పెరిగెను, సభ్యులసంఖ్య 8549, సంవత్సరాదాయము 559,000 పౌనులు. ఇరువదియైదేండ్ల తరువాత (1927) కూడ హాలిఫాక్సు పెర్మనెంటు ఇట్టి క్రమాభివృద్ధినే చూపుచుండెను. దీనికి కారణము ఈనాక్ యొక్క అర్థికనైపుణ్యమే. 1928 లో హాలిఫాక్సు పెర్మనెంటు సొసైటియు, హాలిఫాక్సు ఈక్విటబుల్ సొసైటియు సమ్మేళనమొనర్పబడెను. సమ్మేళనానంతరముకూడ ఈనాక్కే మేనేజరు అయి ఉండెను. సమ్మేళనానంతరము సొసైటి ఆస్తులవిలువ 47,000,000 పౌనులను మించినది. ఎంతటి పెద్ద మొత్తము! ఇది అంతయు పొదుపుగలవారు కూర్చిన చిన్నిమొత్తముల కూడికయే.

ప్రపంచమునందలి బిల్డింగు సొసైటీల కన్నిటికిని హాలిఫాక్సుసొసైటి పెద్దది. 1927 లో దానిరాబడి 20,560,350 పౌనుల 3 షిల్లింగుల 9 పెన్నీలు. ఆ సంవత్సరమున తెఱువబడిన కొత్త ఎక్కవుంటుల సంఖ్య 65,076. ఇదివఱకున్న ఎక్కవుంటులతో వీనిని చేర్పగా తేలినసంఖ్య 257,248. అనగాఏమి? 257,248 మంది ప్రజలు అప్పటికి తాము కూడబెట్టినధనమును అందు

భద్రపఱచుకొనియో, తమకు గృహములు విలుచుటలో అందుండి అప్పుగొనియో యుండిరని.

సొసైటివారి ప్రధానకార్యస్థానము హోలిఫాక్సు నందలి భవనమున అగ్నికికూడ అంటరాని ఉక్కుతలుపులతో భద్రపఱుపబడిన గదులలో వేలకొలది దస్తావేజుల పెట్టెలుగలవు. అందలి దస్తావేజుల పార్శ్యలుల సంఖ్య డెబ్బదియైదువేలు, సొసైటివారు కొనుటకు సాయముచేసిన ఇండ్ల హక్కుభుక్తముల రికార్డులే ఆ దస్తావేజులు. ఈ దస్తావేజులలో ప్రతిఒక్కటియు ఆంగ్లదేశమున ఎదేనొకకుటుంబమునకు కలిగిన సుఖమును, స్వాతంత్ర్యమును తెలుపును. కడచిన ముప్పది వత్సరములలో ఈ బిల్డింగు సొసైటీలనుగూర్చి ప్రజాలోకమున దివ్యతరప్రచారమొనర్చి తనశక్తిని, ఉత్సాహమును ఈనాక్ పూర్తిగ ఉపయోగింపకుండినచో ఎందఱో వానివలని పూర్తిలాభమును బడయలేక పోయియుందురు.

ఒకప్పుడు పాట్టకో అను సిల్కుబట్టలమిల్లులో చక్రము చుట్టువాడుగా పనిచేసిన ఈనాక్ జీవితకథను తిరిగివత్తము. ఈ వత్సరములలో నాతడు ఇతరపనులను చూడకుండనుండలేదు. బ్యాంకింగు, ఇన్సూరెన్సు, ఎక్కవుంటెన్సీ వ్యాపారములయందు ఆతనికి అభిరుచి మెండు. ఛార్టర్డు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్రెటరీస్‌న 1906 నుండియు ఆతడు ఫెల్లోగా ఉన్నాడు. బిల్డింగు సొసైటీల సంఘమునకు ఆతడు కొన్నివత్సరములు అధ్యక్షుడుగానుండెను. మూడుసారులు పార్లమెంటు ఎన్నికలలో నాతడు కాండిడేటుగానుండెను. విదేశములను చుట్టివచ్చి ఆతడు విస్తారముగ లోకజ్ఞానమును ఆర్జించినాడు. మహాసంగ్రామావసరమున ప్రభుత్వమువారు 3,000,000 పౌనుల ఋణమును గొనుట కాతడెంతయు సాయమొనర్చినాడు.

అరువదిరెండేండ్ల వయస్సునగూడ ఆతడు ఎప్పటి దీక్షతోనే పనిచేయుచుండెను. ఉదయము తొమ్మిది గంటలకప్పుడే ఆతడు వ్రాతబల్లవద్ద కూర్చుండి పనికి ప్రారంభించును. దినదినమును పలుప్రముఖులతో సంప్రదింపులు, సభలు—నిత్యము చేయవలసియుండు వ్యాపారము ఉండనేఉన్నది. వీనికితోడు లండనుకు ఒక్కొక్కప్పుడు రైలుప్రయాణముకూడ తగులుచుండును. లండనులో ఆతనికి తలమున్కలగు పని వేచియుండును. కాగా ఆతడు దినమునకు పదునాలుగుగంటలుపనిచేయవలసియుండును. ఉండును గాక! ఆతనికి భారమనిపించదు. ఏమనగ? అది ఆతనికి నచ్చినపని. అట్టిపని చేయుచుండ వలయుననియే ఆతడెల్లవేళల కోరుచుండును.

ధనమువెచ్చించి ఉన్నతవిద్య నేర్చుకొను సదవకాశము లేకపోవుటచేతనే ప్రపంచమున నేను జయమందలేక పోయితినని విచారించు పేదయువకుల చిత్తవృత్తి గ్రహించుటమాత్రము ఎంత ఆర్థికనిపుణుడైనను ఈనాక్‌హిల్‌నకు చేతగాదు. తాను పేదవాడేగదా? తానుధనమువెచ్చించి ఉన్నతవిద్య నేర్చుకొను సదవకాశములేనివాడే కదా? తాను జయమందెనే? ఇతరులుకూడ ఎందుకందలేరు అని ఆతనిప్రశ్న. సర్ ఈనాక్ జీవితము ప్రారంభింపనున్న యువకుల కిచ్చు సందేశమేమి? 'ఎంతటి కష్టములు కలుగుగాక జంకవలదు. సంతత పరిశ్రమచేతను, క్రొత్తసంగతులు నేర్చుకొనవలయునను కాంక్షచేతను ఎంతటి కష్టములనైనను కడచనవచ్చును. నాకు జీవితము ఆదినుండియు ఆనందమయము, సుఖమయము, ఫలయుతము అయినది. నిరాశచెందవలదు పనిచేయుచునే యుండుము. ఇతరులను ఆనందపెట్టుటకు ప్రయత్నించుము. సర్వము నీకు సుఖమగును.'

యువకుడా! ఈనాక్‌హిల్ సందేశమాలించితివి. నీవుబుద్ధిమంతుడవేని సిల్కుమిల్లులో ఒంటిపూట పనివాడుగానుండిన వానిని సాయంకాలములందు స్వయముగ షార్టుహ్యాండు నేర్చుకొనిన వానిని జ్ఞప్తికి తెచ్చికొనుము. ఈ విషయములను జ్ఞప్తికి తెచ్చుకొనిన ఊపులోనే 47,000,000 పౌనులకుమించిన విలువగల ఆస్తితో 350,000 వర్కింగు ఎకౌంట్సుతో విరాజమానమగుచున్న హోలిఫాక్సు బిల్డింగు సొసైటీనిగూడ జ్ఞప్తి కెలయించుకొనుము. ఈనాక్‌హిల్ విశ్వరూపము నీకు పొడగట్టుచున్నదా? మానవుడు తన జీవితమును తన యిచ్చవచ్చినమచ్చున చేసికొనగలడను విషయమును రూఢిపఱచుటకు ఇంతకంటె మంచితార్కాణ మిక నేమికావలయును?

# త్యాగి

'నామాట వినరా, నాయనా'

'అమ్మా, యీ వొక్క విషయంలోమాత్రం నన్ను విడిచిపెట్టు. చిన్నప్పటినుంచీ నిన్ను కాదని యేపనైనా చేశానా? తల్లివగు నువ్వు నాకు యీమాత్రం స్వాతంత్ర్యం యివ్వకపోతే ఎలా'

'నేడో రేపో అనికూచున్న యీ ముసలి ప్రాణాన్ని శాంతంగా పోనీక, అంత్యకాలాన్ని లేనిపోని కలతల పాల్జేస్తున్నావురా, బాబూ'

'నేనేం చేశానే'

'ఏంచేశావూ, చెప్పినట్టు చెయ్యకపోవడమే. అది చాలదూ.'

'యీ విషయంవల్లవచ్చే ఫలితాలకు బాధ్యుణ్ణి నేనూ—అంచేత దీన్నిగురించి యెక్కువగా యోచించవలసిన వాణ్ణికూడా నేనే అయివున్నాను——ఇంతేనా—'

'నాకుమాత్రం అవసరంలేదూ నీ కష్టసుఖాలు—ఏదో నే బ్రతికివుండగా ఒకయింటివాడివైతే చూచి ఆనందించాలని నాకూ—'

'అలానే కానీ, యీ మాఘంలో చేసికుంటానన్నాగా—ఏదో సంబంధంచూచి'—

'బాగుంది, ఏదో శాస్త్రంచెప్పినట్టూ—బంగారంలాంటి పిల్లను వదిలేసి-నువ్వు సుఖపడితేచాలు అని కాదూ కట్నాల కాశపడలుకుని యీ సమ్మంధంకుదిర్చా'

'అప్రను నా శ్రేయస్సు కోరే—'

'మరి ఇహనే, పోనీగుణాల్లో అంటావా—యీ కలియుగంలో లేదు అటువంటి సుగుణవతి—విద్యలోనా యిక అపరసరస్వతే—ఎన్నినోములు నోచుకోవాలా అలాటిపిల్లను చేసికోడానికీ—'

'నాజీవితం అంతా ధారపోసినా అట్టిబాలికను పొందలేనన్న మాట నిజమేనమ్మా—ఆమె సౌందర్య దేవతనీ—సుగుణాల ప్రోవనీ—చదువుకున్నదనీ—నాకూ తెలుసును. అంచేతనే ఆమెను వివాహం చేసికోడానికి నామనస్సంగీకరించకుండా వుంది'

'ఏం'

'పాపం, ఆపేదబాలిక జీవితాన్నంతా దగ్ధం చేయడం భావ్యంకాదనీ'—

'దగ్ధంచెయ్యడమేమిటీ'

'అవును ఆమె నీకుమార్తెయై—నాలాటి కురూపికివ్వవలసివస్తే తెలుస్తుంది నీ కావిషయం స్పష్టంగా'

'ఎక్కడైనా వుందా యీయిద్దూరం—వస్తూవున్న లక్ష్మిని కాలితో తన్నివేయడం'

'ఎక్కడాలేదని మనం అన్యాయంగా వర్తించడం ధీరత్వం కాదమ్మా'

'అన్యాయం ఏంవుంది దీనిలోనూ'—

'ఆకాశాన్ని వుండవలసిన దివ్యతారకల్ని అధోలోకానికి త్రోచివెయ్యడం అన్యాయంకదూ—అర్హుడగు యువకునితో సౌఖ్యాన్ని ఊలలాడవలసిన ఆ అమాయకపు బాలికను నావంటి కురూపికి అంటగట్టి దుఃఖభాజనిని చేసివేయడం అన్యాయంకాదూ.'

'ఏమిటీ రాద్ధాంతాలన్నీని—ఆపిల్ల వొప్పుకుంటూంటేని'

'బీదవాళ్ళవడంచే ధనవంతుల యింట్లో పడితే సుఖపడుతుందని తల్లి తలుస్తోంది. ఆమాత్రపు కాపిడుతుంది. దున్న ప్రేమాతిశయాలచే పిల్ల సమ్మతిస్తోంది?

'నాకివన్నీ తెలీవు—ఆపిల్లను చేసికొని తీరాలి'

* * *

'బాబూ యీబీదపిల్లను చేపికునేవారెవరూ ?'

'ఎవరా, యీసౌందర్యరాశికై పడిగాపులుపడి వుండని వారెవరూ ?'

'ఏదో మీయందు దయచే ఆలాఅంటారు—మరి మీలాటి బీదవానికే యిస్తే యిహ చెప్పనవసరమే లేదు కదా—ఇహ నెవరున్నారూ నాయనా.'

'మీరు తుచ్ఛమైన ఐశ్వర్యానికి ఆసించి పిల్ల యొక్క క్షేమాన్ని యోచించడంలేదు. ఒక్క ధనమూలాన్నే ఆమె సుఖిస్తుందని తలుస్తోన్నారు మీరు. మీమాట తీసివెయ్యాలేక, మీయందున్న అమితమైన ప్రేమచే, ఆపూజును మోయడానికి సిద్ధపడుతోంది

ఆమె. కాని నేనంత కర్కశున్నికాను. ఆమెను నాకన్న ప్రభాకరునికిస్తేనే యెక్కువ సౌఖ్యం పొందుతుంది'

'ఆ దరిద్రునికా'

'ఆ, ప్రేమకు దారిద్ర్యం అడ్డురాదు.'

'నాయనా అనాథయగు యీపిల్లను వివాహంచేసికోడాని కిష్టంలేక ఏదో చెబుతోన్నావు—పోనీ—మా ఖర్మం ఏంచేస్తాము.'

'అలాఅంటే నేనేంచెప్పనూ—పాపం ఆఅమ్మాయి మీయందలి ప్రేమచే ప్రభాకరుని స్నేహాన్నికూడా త్యజించింది. నామాటవిని అతనికే యీమెనివ్వండి—ధనంవిషయంలో నాదీబాధ్యత.'

'ఎంత అపకీర్తి, కూతురుపెండ్లికి డబ్బుయాచించు కుందని నలుగురూ——'

'యాచించుకోవడం ఏమిటి. కోరినేను భరిస్తానంటే—'

'వద్దునాయినా యీచిక్కులన్నీ — మాయందు దయవుంటే యీపిల్ల నుద్ధరించు.

* * *

'ప్రభాకరునిదగ్గరనుంచి వుత్తరంవచ్చింది—'

'ఆ'

'ఏమని వ్రాశాడూ'

'అతను పిచ్చివాడైపోతోన్నాడు'

'ఏం'

'మీరంటే చాలాకోపంగావుంది ఆయనికి'—

'అవునది సహజమే—పాపం—ప్రభాకరుడు భగ్నహృదయుడు—'

'మీతత్వం తెలీదతనికి'

'రమ్మని రాయాపోయావు.'

'వ్రాసా'

'అతన్నికూడా తీసికుని వెడదాం బరోడా'

'వస్తాడా'

'నేను చేస్తానుగా ఆయేర్పాటులన్నీని'

'అతనెందుకూ'

'మనడైవర్సుకాగానే అక్కడే పెండ్లిచేసికోవచ్చు మీరు—'

'పెండ్లీవద్దూ పెడాకులూవద్దూ బ్రహ్మచారిణిగా వుండిపోతాను'

'ఏమి—ప్రభాకరునిగతీ—'

'లేకపోతే లోకం బ్రతుకనిస్తుందీ'

'లోకానికి వెరవడం మనవంటివాళ్ళ లక్షణంకాదు—పాపం నీకై ప్రభాకరుడు వున్మత్తుడైపోయాడు. దీనికంతా వేగుపురుగుని నేనూ. అంచేత నన్నుగురించి అయినా నువ్వు వివాహంచేసికోక తప్పదాతనిని.'

'అబ్బాలోకం—ఇంతలోకం—శిరమువంచి కృంగిపోవాలసిందేగాని—'

'సుశీలా, ఎందుకలాభయపడతావ్ అమాయకంగా-'

'కాలపాశంలా చుట్టుకున్న యీ సాంఘిక శాసనాలూ'

'ఎవరియిష్టంవచ్చినట్టు వారు శాసనాల్ని కల్పించుకోవచ్చు. మనస్వాతంత్ర్యానికీ, మన యిచ్ఛకూ అడ్డువచ్చే శాసనాలు, అవి సాంఘిక శాసనాలైనా, నైతిక శాసనాలైనా, వాటికి మనంయెప్పుడూ విదూరులమయ్యే వుండాలి. మననీతివేరు. మననైతిక శాసనాలువేరు. మనయీ నైతికశాసనాలే మరొకరికి అవినీతికరములగు శాసనాలుగా మారిపోవచ్చు. అవినీతికరములైన శాసనాలే మరొకప్పుడు నైతిక శాసనాలుగా మారతాయి. మనిద్దరమూ దాంపత్యభావంతో పెండ్లిచేసికొననేలేదు. ఇప్పటివరకూ ఆమలిన భావం మనలో లేనేలేదు. రెండు ముసలిప్రాణాల్ని రక్షించడానికి అనిత్యములగు అప్పటికి నైతికములగు శాసనాలకి వశమయ్యాం. ఇప్పుడా అడ్డంకి తీరిపోయింది. అంచేత ఆశాసనాల్ని యిప్పుడనుసరింపనవసరంలేదు.'

'మీజీవితం అతివంద్యనీయమైంది. త్యాగనీయమైంది. కడు ప్రశంసనీయమైంది. ఇలాటి వుదారత—సరే మీయిష్టంవచ్చినట్టు కానీండి. నేనుమీకు సో—యెవర్ని.'

'ముమ్మాటికి సోదరివే. సోదరివగు నిన్ను, పురోహితులు చదివిన ఆ యేవేవో మంత్రాలు భార్యనుగా చెయ్యలేవు.

—కంటిపూడి జానకిరామచౌదరి.

# రాధాకృష్ణ

ఆ అమ్మాయి సానిపిల్ల! పేరు కనకలక్ష్మి, కాని ముద్దుకి కనకం అంటారు, వయస్సు పన్నెండేళ్ళు.

కనకం అందమైనదే. చామనచాయకి తక్కువైన రంగు శరీరం. అయినా, నిర్మలమైన సరస్సులోని తళుకూ, మధ్యాహ్నపు ఆకాశంలోని రక్తి ఆ శరీరంలో ఘనీభవించివున్నాయి. చేరడేసి కళ్ళల్లో ఎప్పుడూ నవ్వుల నిగనిగ మెరిసిపోతూ వుంటుంది. యవ్వనచిహ్నాలు పరిస్ఫుటంగా పొడగడుతూన్న అందం విడటానికి సిద్ధంగావున్న మల్లెమొగ్గని స్ఫురింపజేస్తుంది...

'కనకం! కలకత్తా వెళదామా?'

'ఎందుకక్కయ్యా?' అంది కనకం విప్పారిన నేత్రాల్లో విస్మయాం విస్తరిస్తూ.

'ఎందుకా! వేషాలు వెయ్యటానికి...సినిమాలో ఆక్టు చెయ్యడానికి వెళ్తున్నాను...'

కనకం అక్కయ్యపేరు మిస్. సరళ—అసలు పేరు రంగనాయకి కాబోలు, నాటకాలాడటం మొదలెట్టేక పేరు మార్చుకుంది. సరళ అందమైంది కాకపోయినా, నాజూకుగా అలంకరించికొని, సరికొత్త ఫేషన్‌లో బట్టలు సింగారించుకొని ఎందరినో తనకి దాసానుదాసులని చేసుకోగలిగింది. ప్రేమచూపడంలో పూర్తియైన నటన ఆమెకి జీవితంలోనే అలవాటు. ఇక రంగస్థలం మీద ఆమె అసమాన. నటనకితోడు కంఠం వీణమీటని వెటకారం చేస్తుంది.

కనకం అక్కమాటల కర్థం గ్రహించింది.

'నన్ను వదిలివెళ్ళకదా ఇక్కడ?'

'నువ్వుకూడా పార్టు తీసుకోవాలి'

'అయి బాబో! నాకు నాటకాలంటేనే భయం. అందులోనూ సినిమా ఎలాగక్కయ్యా!'

'నీకేం భయంలేదు! నేను చెప్తానులే...'

'ఏం సినిమా అక్కయ్యా!'

'కృష్ణలీలలు,—నేను యశోద; నువ్వు రాధవేషం వెయ్యాలి...'

కనకం ఆలోచనలో పడిపోయింది. రాధ జ్ఞాపకం తెచ్చుకుంటూంది.........

'ఏం కనకం. ఏంవాలోచిస్తున్నావు?'

'ఏంలే దక్కయ్యా! నేనూ నటించగలను, చేతవుతుందా అని...'

'అదంతా డైరెక్టరు చూసుకుంటాడు...తరిఫీ చేస్తాడు...'

'డైరెక్టరంటే'

'అంటే, సినిమాలో నటించేవారిని తయారుచే చేతకాని వారిచేతకూడా స్వతస్సిద్ధమైన ప్రకృతిని చూపించే శక్తి కల, సృష్టికర్త...ఏం తెలిసిందా!...'

'సరిగ్గా తెలీలేదు. కాని అతడు మానవసహజమైన గుణానికి అతీతుడు, నలుగుర్నీ తెలుసుకొని వశపర్చుకొనేవాడూ అని అర్థం అయింది... .....' అంటూ కనకం కిటికీలోంచి, దూరంగా గోదావరిలో ప్రతిబింబిస్తూన్న చంద్రకిరణాలని చూస్తూ అగాధమైన ఆలోచనలలో మునిగిపోయింది.

* * *

డైరెక్టరు దుర్గాదాసు కవి, చిత్రకారుడు. అతని పద్యములు, కథలు, నాటికలు ఆంధ్రలోకమునకు వన్నె తెచ్చినవి.

రాధ నటనాపరీక్ష నాడు సాగుచున్నది. వారము రోజులకు ముందే, రాధ ఎట్లునటించవలెనో ఆమె చెయ్యము లెట్టివో ఆదుర్గాదాసు స్పష్టపర్చి కనకం తలకెక్కించినాడు. ఆమె పరీక్షలో నెగ్గిన కాని రిహార్సలు మొదలుపెట్టుటకు వీలులేదు.

అది రాధా భక్తిప్రణయ ఘట్టము. దుర్గాదాసు కెదురుగా కనకం—రాధ—నిల్చుంది. నిశ్శబ్దంగా చుట్టూ నిల్చి చూస్తున్నారు తక్కిన నటులు, పరీక్షా ప్రణాళిక. డైరెక్టరు కృష్ణుని పలుకులు పల్కుతున్నాడు.

౫.౨౧

రాధా! విస్తుపోయి నిల్చున్నావేం! ఆహ్వానిం
' అతని కంఠం, చిరునవ్వు రాధ హృదయం
పోయేయి......ఆమె పలకవలసినవి రెండే
తక్కినది భావప్రకటన. అందులోనే ఆమె
లసింది.

నకం కళ్ళని మైకం కమ్మింది. ఆ మైకంలో ఆమె
ం మరిచిపోయింది. ఆమెలోవున్న రాధా స్వరూపం
కలు బారింది...

'కృష్ణా...కృ ..ష్ ..ణా...'

రాధకళ్ళల్లో క్షణం మెరిసింది కన్నీటి ఛాయ, భయం
విపోయింది, కాంతి ప్రవహించింది, ప్రేమ పుల
కించింది; ఆమె బుగ్గలలో, పెదిమలలో, ఆపాద మస్త
కమూ. భక్తిచైతన్యం, ప్రణయవిలక్షణతా కెరటము
వెనక కెరటములాగ పొరలిపోయినై.

'భేష్' అన్నాడు దుర్గాదాసు.

* * *

రాత్రి పది గంటలు.

దుర్గాదాస్ ఆలోచనల్లో మునిగితేలుతూ, విద్యు
ద్దీపం చుట్టూ మూగిన దోమలగోల వింటున్నాడు.

స్విచ్ నొక్కిన చప్పుడు. గదంతా చీకటి గాజుల
గలగల.

అతను నివ్వెర పడ్డాడు.

'ఎవరు?'

'నేను రా...కనకం'

'.........'

'నేను రాధ వేషం వెయ్యలేను.'

'ఆఁ!...ఏఁవి...!'

'మీరు కృష్ణవేషం వేస్తారా!

'.........'

'.........'

'వెయ్యను...'

'సరే! నేను రాధ వేషం వెయ్యలేను...'

'...... ..'

మళ్ళీ గాజుల గలగల!

'కనకం...'

'.........'

'రాధా!...వుండు...'

'కృష్ణా!...కృ ..ష్...ణా!'

—వఝ్ఝల కాళిదాసు.

---

# నూలువడికే రప్పద్మముఖులు

సీ. గుంపు వంపును లేక కొనసాగఁ బ్రోగువెంట మెఱుంగుఁ జూపు పేరెనులు వారఁ
బ్రాయంపుఁ బడుచులఁ బనిగొంటివే దూదియ నెడి పాటలఁ దేనె చినుకులీన
నేకుతోఁ జెలఁగు కేలెత్తుచో భుజమూల కాంతులు బయలఁ బంగారు సేయఁ
బుడుకఁ ద్రిప్పెడు రయంబునఁ బైఁట జాఱుచో మినుకు గుబ్బలు తళుక్కని రహింప

గీ. ముడిచికొన్నట్టి తెలిగంజి మడతచీర
లడిది తొడనిగ్గు చేఁ బనుపంటినట్లు
పొసఁగఁ జరణాభ త్రొక్కుడు బొమ్మమీఁద
బచ్చెన ఘటింప వడికి రప్పద్మముఖులు.

—శుకన

# వర్ణవ్యవస్థ : మహాత్ముఁడు

నేడు ప్రపంచమునందలి యుత్తమపురుషులలో కెల్ల గాంధీమహాత్ముఁడు తలమానికమువంటి వాడని యొక భారతీయులేగాక యన్నిదేశములవారును గొనియాడు చున్నారు. 'పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చదుష్కృతాం ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే' అన్న గీతావాక్యానుసారము నేడు ప్రపంచమున వ్యాపించియున్న స్వార్థపరత, పరవంచన మొదలగు దుర్గుణముల రూపుమాపి విశ్వమానవ సౌభ్రాతృత్వమును నెలగొల్ప నవతరించిన సాక్షాన్నారాయణుడే మహాత్ముడని పెక్కుర యభిప్రాయమై యున్నది. మహాత్ముడంత గొప్పవాడనబడుట కతని యందుగల గొప్పతనమేమియో విచారింపవలయును. మహాత్ముడు రాజకీయవేత్తయా? మతకర్తయా? అని విచారించిన శ్రీకృష్ణ భగవానుకు 'యే యథామాం ప్రపద్యంతే తాంస్తథైవ భజామ్యహం' అని చెప్పినట్లు మహాత్ముతుడును రాజకీయవేత్తలకు రాజకీయపురుషుడు గాను మతకర్తలకు మతకర్తగాను గాన్పించును. మనము ప్రస్తుతము రాజకీయవేత్తయగు మహాత్ముని గురించి కాక మతకర్తయగు మహాత్ముని గురించియే మాట్లాడవలెను. మహాత్ముడు ప్రస్తుతము చేయుచున్న యస్పృశ్యతానివారణ మొదలగు కొన్ని కార్యములను బట్టి స్వార్థపరాయణులగు కొందరు మహాత్ముఁడు వర్ణాశ్రమ నాశకుడుగాని, వర్ణాశ్రమ రక్షకుఁడుకాడని నిందించుచున్నారు. కాని నిజముగా వర్ణాశ్రమములన నేమి? తన్నిర్మాతల యుద్దేశ్యమేమి? అని యాలోచించినచో మహాత్ముఁడు వర్ణాశ్రమరక్షకుడో వర్ణాశ్రమ నాశకుడో తేలగలదు. ఈ వర్ణాశ్రమ ధర్మములు మన హిందూమతమునకే కాని మరేమతమునందును లేవు. ఇది మన యదృష్టముచే మనకులభించిన మహాభాగ్యమని మన హిందువులు పలుమారులు వచింప మనమెల్లరము వినియేయున్నాము. నేడట్టి వర్ణాశ్రమవ్యవస్థలన్ని యు నశించి మీరు మమ్ములను తాకకూడదు మేము మిమ్ములను తాకకూడదను నన్యోన్యద్వేష భావములు ప్రబలి సంఘమును నిర్మూలముచేయుచుండ హిందూమతకర్తయు మూడులోకములచే గొనియాడబడుచున్న భగవత్స్వరూపియునగు గాంధీమహాత్ము డూరకుండ గలడా?

అట్టిలోపముల సవరించి సంఘాభివృద్ధికై యతడు పాటుబడుచుండ నా మహనీయుని యదార్థస్వరూపమును దెలిసికొనలేక సంఘనాశమునకు నీతడు కడంగెనని పెక్కురు నిందించుచున్నారు కాని మహాత్ముల విషయములల్పులకు గోచరింపవనియే మనము తలంపవలయును. మహాత్ముఁడు 'సంఘమునకు వేదముచదువు వాడెంత యవసరమో చెప్పులుకుట్టువాడును నంతియే యవసరము, కనుక నొకజాతి గొప్పదనియు నొకజాతి తక్కువదనియు మీరు భేదాభిప్రాయములు పెట్టికొనకూడదని చెప్పుచున్నాడు నిజమాలోచించిన నంతియే.

మానవున కవయవము లెంత యవసరమో సంఘమునకు వర్ణము లంతవసరము. చేయి కుంటిదైనను కాలు కుంటిదైనను మనుజుడెట్లు హీనదశను పొందునో సంఘమునకు నేవర్ణము లేకపోయినను నటులనే సంఘము క్షీణించిపోవును.

కనుక జాతులన్నియు సంఘమున కత్యవసరములే, అన్నియు సమాన గౌరవములుకలవే. మన దేశములో కష్టపడి పనిచేయువాడు గౌరవహీనుడనియు నాలు గక్షరములు నేర్చికొని షోకిల్లాగా తిరిగేవాడు గౌరవము కలవాడనియు చెప్పుదురు. ఇదిచాల విహ్యము. కష్టపడి పనిచేయువా డెప్పుడును గౌరవము నే పొంది

వలయును గాని యగౌరవమును పొందరాదు. లేనిచో సంఘము బాగుపడదు. ఇతరదేశములలో కష్టపడి పని చేయువాడే గౌరవనీయుడు. కనుకనే యాదేశము లభివృద్ధి నొందుచున్నవి. కూర్చుండి మాటలుచెప్పువాని నెప్పుడైతే మనము గౌరవముగా జూచుచున్నామో యప్పుడే హిందూమతము నశించినది.

పూర్వము చాతుర్వర్ణములు సమానగౌరవములు కలవే. మనవారు బ్రాహ్మణులు విష్ణువు ముఖమునుండి పుట్టినారనియు క్షత్రియులు, బాహువులనుండి పుట్టినారనియు, వ్యాపారు లూరువులనుండి పుట్టినారనియు శూద్రులు పాదములనుండి పుట్టినారనియు నిందుచే నొకజాతికంటే నొకజాతి గొప్పదనియు చెప్పుచున్నారు. అట్లయిన గంగాదేవి విష్ణుమూర్తి పాదములోనుండియే గదా? పుట్టినది. ఆమెచే ముల్లోకములు పవిత్రములగుట లేదా? గంగచే ముల్లోకములు పవిత్రములు కావనమెందులకు? గంగసోదరులని చెప్పబడు శూద్రులు ముట్టగూడనివారని చెప్పుట యెందులకు

కనుక నీ దురభిప్రాయములన్నియు వదలి అన్ని జాతులు సమానగౌరవము కలవేనని తలంచి పూర్వుల ప్రకారము వారివారి యభిరుచులనుబట్టి వృత్తులేర్పాటు చేసి సంఘాభివృద్ధికై మనమెల్లరము పాటుపడవలయును. లేక యీ యుచ్చనీచస్థితులను నంతరములు సంఘములో నుండువరకు ప్రజల కన్యోన్యద్వేషము పెచ్చుపెరిగి యొకరినొకరు క్రూరజంతువులవలె చూచుట దక్క నన్యోన్యప్రేమచే బద్ధులై శాశ్వత శ్రేయస్సునకును తద్వారా విశ్వమానవ కళ్యాణమునకును దోడ్పడజాలరు. మహాత్ముని దృష్టిలోని వర్ణాశ్రమ విభాగమిట్టిదే, దాని ననుసరించి యాతడు వర్ణాశ్రమ రక్షకుడో వినాశకుడో యాలోచించిన నెల్లరకు సుబోధకమగును.

—వెన్న అనంతరామమ్మ.


# ఆంధ్రభూమి

సచిత్రాంధ్ర మాసపత్రిక.

| | | | | | |
|---|---|---|---|---|---|
| సంవత్సరమునకు | ... | రు. ౩-౦-౦ | నాలుగు మాసములకు | ... | రు. ౧-౦-౦ |
| అర్ధసంవత్సరమునకు | ... | రు. ౧-౮-౦ | విడిసంచిక | ... | రు. ౦-౪-౦ |

ఆంధ్రకీర్తిగ్రంథమాల : ౧.

## ఆంధ్రరమణీమణులు

(మొదటిభాగము.)

ఇందు రుద్రమ్మ, గణపమ్మ, నాగమ్మ, మాంచాల, రాగమ్మ, మహాలక్ష్మమ్మ, సీతమ్మ, మల్లమ్మ, రమణమ్మ అను తొమ్మండుగురు తెనుగుతెలవల జీవితములు తేటతెనుగున బాలికలకును, స్త్రీలకును ఉపయుక్తముగ నుండునట్లు వ్రాయబడినవి. స్త్రీవిద్యాభిమాను లాదరింపదగిన గ్రంథము. గ్లేస్డుకాగితములు, క్రౌనుసైజు 96 పుటలు చక్కని అచ్చు. ప్రతి ఒక్కంటికి 0—9—0 అణాలు.

చిరునామా :—

ఆంధ్రభూమి కార్యాలయం : వేపేరి, మదరాసు.

# ప్రోటిబహుమానము —రూ. 10—

## దాగుడుమూతల పజ్ల్

ఈదిగువ నిచ్చిన ఉదాహరణము చూచి, అట్లే తక్కిన పదములను కనిపెట్టి కూపనులో వ్రాసి డిశంబరు 20-వ తేదీలోపున ఆంధ్రభూమికి పంపవలెను. సరియైన సమాధానములు సంపాదకుని వద్ద ఒక సీలు కవరులో ఉంచబడినవి. పైమాసపు సంచికలో అవి ప్రచురింపబడును. వాటితో సరిపోవునట్లు తప్పులులేకుండ సమాధానముల నంపువారికి రూ. 10. బహుమానమీయబడును.

షరా :—సమాధానములు కూపనులోనే వ్రాయవలెను. దిద్దుబాట్లు, కొట్టివేతలు కూడదు. ఒక్కొక్కరు ఎన్ని కూపనులయినను పంపవచ్చును. ఒక్కొక్క అచ్చు కూపనుకు 1 అణాయును, వ్రాతకూపనుకు 2 అణాలును (తపాలాబిళ్ళలు) ప్రవేశరుసుముతో పంపవలెను.

### ఉదాహరణము.

| సూచన : నగరము. | | కనిపెట్టవలసినపదము : అలహాబాద్. |
|---|---|---|
| అ టు కు లు | | అ టు కు లు |
| ఫ ల హా ర ము | (2) | ఫ ల హా ర ము |
| గో హా రు క న్య | (1) | గో హా రు క న్య |
| చి న్న బా వ | (3) | చి న్న బా వ |
| దు ర్గా ప్ర సా ద్ | (4) | దు ర్గా ప్ర సా ద్ |

మొదటివరుసలోని అక్షరములను అట్లే ఉంచి, దాని దిగువనున్న పంక్తులను కుడివైపుకాని, ఎడమవైపు కాని కొన్ని స్థానములు జరుపవలెను. ఏవరుస ఎన్నిస్థానములు జరుపవలెనో, ఆసంఖ్య యీయబడినది. అట్లు జరిపిన పిదప, వరుసలను పైనుండి క్రిందికి చదివినచో యిచ్చిన సూచనకు సరిపోవు పదమొకటి యేర్పడవలెను. ఆపద మొక్కటిమాత్రము కూపనులో వ్రాయవలెను.

### దాగుడుమూతల పజ్ల్.

**1. సుగంధపుష్పము.**

| | |
|---|---|
| పా ల తె లు పు | |
| చ ల్లి మి రి య ము | (2) |
| జా ల రి తె గు లు | (1) |
| వి లా స వ ని త | (3) |
| బి ల ము | (2) |

**2. రోగము.**

| | |
|---|---|
| అ మ వ శ ని శి | |
| మా రో త్సా హ ము | (4) |
| అ సా వే రి | (2) |
| వే ద శా స్త్ర ము | (3) |
| జ ల జ న య నే | (2) |

**3. పతివ్రత.**

| | |
|---|---|
| సా తా ని జా తి | |
| గా న వి ద్య | (2) |
| ఆ సు ప త్రి కి | (1) |

**4. పక్షి.**

| | |
|---|---|
| రా చ బి డ్డ | |
| అ క్ర మ ము | (1) |
| వా వి లి చి గు రు | (2) |
| శా రి క లు | (1) |
| క ర్పూ ర ము | (1) |

**5. కవయిత్రి.**

| | |
|---|---|
| కు ము ది ని | |
| తో లి ప్రొ ద్దు | (3) |
| ప ద్మ న య న | (2) |
| గ ర శ ము | (2) |
| సా ని ప డు చు | (1) |

**6. నది.**

| | |
|---|---|
| భూ శ య న ము | |
| బ ద రీ ఫ ల ము | (2) |
| గా న కు మా రి | (2) |

7. తెలుగు పత్రిక.

వి వ స ర్వ ము
మ నో హ ర ము (2)
అ ది యే స్వ ర్గ ము (1)
తి మ్మ నా ర్యు ని ది (3)

8. పురాణగ్రంథము.

స భా స దు లు
ప ట్టు చీ ర (3)
ల క్ష్మీ వ్ర త ము (2)
వి ము ఖ త (1)

9. మచ్చికజంతువు.

శు క్ర నీ తు లు
వా న ర ము (1)
నా గ క న్య (2)
ము ద్దు మో ము (3)

10. స్వరాజ్యసాధన.

సు ఖ వ్యా ధు లు
ని లు వు ట ద్ద ము (3)
అ రు వు బే ర ము (1)

11. రాగము.

యా త్రై సా ర్థు భూ మి ని
వే యి పా ర ల తో (2)
ఆ వి రి లీ ల (1)

12. వ్యసనము.

వ సు మ తి
కా రా గా ర ము (1)
నా గు పా ము (2)
న క్ష త్ర ము (2)
ము ర శీ గా న ము (3)

---

## కూపను

## దాగుడుమూతల పజిల్

1 ............ 7 ............
2 ............ 8 ............
3 ............ 9 ............
4 ............ 10 ............
5 ............ 11 ............
6 ............ 12 ............

సంపాదకుని తీర్పును అంగీకరింతును.

పేరు..............................

విలాసము..............................

..............................

సం॥ చందా రు. 1-8-0. విడి సంచిక అణా.

# ప్రభ

జాతీయ హాస్యరస పక్ష పత్రిక.

ప్రతినెలా 5-20 తేదీలందు వెలువడును. జంకులేని విమర్శనలూ, పక్షపాతంగాని ముచ్చటలూ, హాస్యంతో గూడిన కథలూ, రచనలూ చదివితీరాలి. చాకిరేవూ, జీవనజ్యోతీ, విశ్వసందర్శనం, రోకటిపోటులు యింకా యెన్నో ప్రత్యేక శీర్షికలుంటాయి. చిత్రపత్రంలోని వ్యంగ చిత్రాలు చూచితీరాల్సిందే.

ప్రతిచోటా ఏజెంట్లుకావాలి. వెంటనే వివరాలకి వ్రాయండి. ఆలసిస్తే ఆశాభంగం. వివరాలకు క్రింది చిరునామాకు వ్రాయండి. ప్రభ కార్యాలయము.

ఎలమఱ్ఱు: కృష్ణా జిల్లా.

# జీవితాలు

అన్నీకొంటే ఖర్చులు లాభం.

| | |
|---|---|
| డీవెలరా | 0—5—0 |
| దేవీజోన్ | 0—3—0 |
| గాంధీగారంటే | 0—0—6 |
| లెనిన్ | 0—0—3 |
| వినాయక్ | 0—10—0 |
| లక్ష్మీ | 0—12—0 |
| కర్షకుడు | 0—1—0 |
| మనధనం | 0—0—3 |

గద్దె లింగయ్య. ఆదర్శగ్రంధమండలి

ఎలమఱ్ఱు: కృష్ణా జిల్లా.

# అపనీతముల యుత్పత్తి

ఆహా! సస్యపోషిణి యగుటచే సకలమానవ ప్రాణాధారమై, బాహ్యనేత్రముల కచేతనమువలె కన్పట్టినను, నిజమునకు కోటానకోట్ల సూక్ష్మజీవులకు నివాసయోగ్యమై, యీ భూతలోపరిభాగమగు 'అపనీతము', జీవకళ లుట్టిపడుచున్నదని యెందఱకు తెలియును! వఱ్ఱగింజయొక్క పరిమాణములో వందలకొలది సూక్ష్మజీవులకు స్థానమొసంగి, వానివాని ప్రకృతులకు తగినట్లు తాను పరిణామపరంపరలకు పరివర్తిత నందుచు, ఒకవంక వానికి, వేఱొకవంక వృక్షములకును జీవనాధారమైన అపనీతముల యుత్పత్తి ప్రకారమెట్టిదో తెలియుట యెంత అవసరము! అపనీతమున కడుగుననున్నది అంత రపనీతము. అపనీతమును, అంతరపనీతమును అన్ని విధముల వ్యత్యాసము గలిగియేయున్నవి. ఒకటి జీవకళ లుట్టిపడుచున్న చైతన్యరాశి. సస్యముల బెంచగలిగినది. వాతావరణ పరిస్థితులకు సదా పరిణామరూపమును దాల్చుచున్నది. రెండవదియో, జీవులు పెరుగుట కనువగునది కాదు. సస్యపోషిణి కాదు. పరిణామ పరంపరలతో దానికంతగా జోక్యముండదు.

అపనీతము లెప్పుడెప్పుడెట్లేర్పడు చున్నవి, ఎట్లు మారుచున్నవని యెరుగుట, అపనీత శాస్త్రజ్ఞులకు లాభకరముగ నుండుటయేగాక, సామాన్యప్రజకు వినోదముగ నుండును. మనము ఇరుగుపొరుగు చేలలోనే రెండుమూడు రకముల నేలలను చూచుచున్నాము. కారణమేమి? ఆయా నేలలనే మనము వాని పుట్టుపూర్వోత్తరములగూర్చి యడుగవచ్చును. పెదవి మెదపకయే అని మనకు సమాధానమీయగలవు. ఒకభూగర్భశాస్త్రజ్ఞుడే వానిభాషను అర్థముచేసుకొనగలడు. సామాన్యమానవులకది అర్థముగాని మూగబాసయే.

అపనీతములకు మూలాధారములు కొండలు, లేక శిలలు. ఇవి అనేకములగు అనేకవిధ పదార్థముల సమ్మేళనమువలన నేర్పడినవని మనకు తెలియునుగదా. కొండ లెప్పటికిని అట్లేయున్నట్లు కనబడుచుండినను, అవి తరుగుట, పెరుగుట యను రెండుప్రకృతులకు గురియగుచునే యున్నవి. వర్షపాతము, హిమప్రవాహము, వాయుప్రసారము, గ్రీష్మతాపము, శీతలకంపము, చెట్టు చేమ, పురుగుప్రాణి, ఆదిగాగలుగు నివియన్నియు ప్రకృతిశక్తికి కనుసన్నల మెలగుబంట్లు. ఈ ప్రకృతి పరికరములు సదా తమ కర్తవ్యమును సాగించుచునే యుండును. అన్నియు కనుకట్టుగా జరిగిపోవుచుండును. కన్నుతెఱచులోపల నూతనరూపము! ప్రకృతికి చేతగానిదేమున్నది!

అపనీతము లేర్పడుటకుముందు భూతలోపరిభాగమంతయు, శిలామయమే. పిమ్మట రానురాను, వాతావరణము తన పరికరముల వానిపై బ్రయోగించి, కర్కశశిలలను సారవంతములగు అపనీతములుగ మార్చివైచినది. అయితే, అపనీతములను అవి యేర్పడిన విధమునుబట్టి రెండువిధములనిరి. 1. మూలాపనీతములు. 2 ఎగుమతినేలలు. మొదటిరకము, ఎట్టిచోటనున్న శిలలట్టిచోటుననే విచ్ఛిత్తినంది, ఆప్రదేశమందే నిలకడగ యేర్పడిన నేల. అనగా యీ నేలకు అడుగున భూమ్యంతర్గతముగనున్న శిల దానికి మాతృకయైయుండెనన్నమాట. మొత్తముమీద నేలలన్నియు నిట్టివేయైనను, ఒకచోట బుట్టిననేల అనేకకారణములవలన, మఱొకచోట నిలకడబొంది, క్రొత్తపేరున వ్యవహరింపబడవచ్చును. అట్టివానినే యెగుమతినేల లనదగును. సుక్షేత్రమై, సారవంతమై, విశాలమైన గంగాసింధు మైదానమిట్టి అపనీతముల యేర్పాటే.

శిలలు విచ్ఛిత్తినందు మార్గములను, భౌతికములనియు, రసాయనికములనియు, చైతన్యములనియును, మూడువిధములని నుడివియుండిరి. ఉష్ణమండలముల లోను, ఎడారులయందును, ఒక్కదినముననే 60-70 (ఫా) డిగ్రీల భేదముగల వాతావరణ ఉష్ణోగ్రతలు జూపబడుచుండును. ఇట్టిచో, శిలాంతర్భూతములగు వివిధ శిలాకణములు వివిధములగు ఉష్ణోగ్రతలను బూనియుం

డును. అట్టి సమయమున, దడదడ నాలుగుదినములు ఆకాలిన కటికరాళ్ళపై బడినవెంటనే, వివిధ కణములు సులభముగ విడిపోయి, బండలు చిటపట పగిలిపోవును. శీతల సమశీతల మండలములలో శిలలు బ్రద్దలగు విధము కడుంగడు విచిత్రముగనుండును. సన్నని రంధ్రములలో బడిన నీటికణములు, చల్లనై ఘనీభవించి, ఉబ్బి, పెద్ద పెద్ద బండలనైతము ఛిన్నాభిన్నములు చేసివైచుచున్నపుడు, 'ఆహా ప్రకృతి యెట్టి విచిత్రసంఘటనముల గల్పించి, యెంతటి సులభమార్గములతో తనకార్యముల నిరాటంకముగ సాగించుచున్నదా!' యని ఆశ్చర్యము గొలుపకపోదు. చిన్న మొక్కలుసైతము పెద్ద పెద్ద బండలపగుళ్ళలో మొలచి, వానిని బ్రద్దలుచేసి పెరుగుచుండుట జూచిన ప్రతివారికి మొలచుచున్న మొక్కయొక్క 'జీవశక్తి' యెట్టిదియో తెలియకపోదు. మానవుడు 'డైనమైట్' ఆదిగాగల అనేకములగు ప్రేలుడు ద్రవ్యముల సహాయ్యమున చిరకాలము చేసిన కృషిని మించినకృషి ప్రకృతి కొన్నినిముసములలో సులభోపాయముగ జేసివైచుచున్నది.

చీమలుప్రాకిన రాళ్ళరిగిపోవుచున్నవి గదా! మఱి, ఝంఝామారుతము, సైకతమేఘముల నొక్కొక్కతఱి, ఉవ్వెత్తుగనెత్తి, కొట్టునపుడు కఠినశిలలు గాను, కఠినతరలోహమైనను అరిగి తీఱవలసినదే! ఈజిప్టు దేశమందలి 'పిరమిడ్లు' యీ మారుతాహతిచే నరిగి నున్ననై పోయి, తొల్లిటిరూపును గోల్పోయిన వనుటలో అబ్బురమేమి? ఇట్లు, పశుబల సాదృశమగు శక్తిరూపమున కొండలెట్లు బ్రద్దలగుచున్నవో తెలియుచున్నది. బ్రద్దలైన కొండలెట్లు సూక్ష్మరూపమునుబడసి అపనీతావస్థను బొందుచున్నవో ముందు తెలియనగును.

శిలలనేక విధములగు రసాయనిక సంపర్కములకు లోనగుచుండును. ఎంత మంచిదైనను ప్రవాహములలోని జలము, కొన్ని వాయుపదార్థములను, ఘనపదార్థములనుగూడ తనయందిముడ్చుకొనియే యుండును. ఇట్టివానిలో బొగ్గుపులుసు వాయువు ముఖ్యమైనది. తన్నిమిత్తముగ ఆ జలము కొన్ని అనౌషధ పదార్థములపైవర్తించి వానిని మార్చి, అపనీతపదార్థముగా జేసివైచును. మఱియు, కొన్ని పదార్థములపై నీరుపడిన వెంటనే అమితమైనవేడిబుట్టి, అవి సూక్ష్మపదార్థములై పోవును. సున్నపురాళ్ళపై నీరేవిధమున పనిచేయునో, పై విధమును అట్టిదియే. మఱికొన్ని పదార్థములతో నీరు రసాయనిక సంయోగమునుబొంది, నూతన పదార్థముల నేర్పఱచును. హిమప్రవాహములు శిలలపై పాఱుచు, వాని పైభాగమునంతయు నాకినవిధమున తనలో కలుపుకొనిపోవును. అగ్నిపర్వతములయందు బుట్టిన ఉష్ణవాహినులు, ఉష్ణగుండములు, శిలలను సునాయాసముగ కరగించివైచుట సర్వసాధారణ విషయము. వీనికిలోడుగ వృక్షముల వ్రేళ్ళు సైతము, అనేక ద్రావకములను స్రవింపజేసి, రాళ్ళను మార్చివైచుచు కడుగుటలో కారణభూతము లగుచునేయున్నవి.

అపనీతముల యేర్పాటునందు చైతన్యమార్గములును ముఖ్యములైనవే. చైతన్యమార్గములనగా, సజీవములగు జంతు వృక్షములచే జరిగింపబడు కార్యకలాపమంతయు ననియే భావము. వానపాము మొదలుకొని, పెద్దపెద్ద కలుగులజేయు కొండయెలుకవఱకు గల బొరియలు జేయు నన్ని జంతువులును, నేలలను క్రిందివానిని పైకి, పైవానిని క్రిందికి గొనిపోవుచు అపనీతముల యేర్పాటునందు తోడ్పడుచున్నవి. భూస్థాపితములైన వానిని కళేబరములకుతోడు, తక్కినజంతు కళేబరములును నశించి, అపనీతముతో నైక్యమై, అపనీతరూపమునే బొందుచున్నవి. అపనీతనివాసములగు, అనేక రకముల సూక్ష్మజీవులు చేయుకృషి యింత అంత గాదు. నత్రజని సూక్ష్మజీవులని, గంధక బాక్టీరియా (సూక్ష్మజీవు)లని, చెప్పబడున విట్టివియే. ఔషధనౌషధ పదార్థములపై నివి వర్తించి, వానిని సులభగ్రాహ్యములగు వృక్షాహార పదార్థములగ మార్చి, వృక్షముల కత్యంతోపయోగకారిణులగునీసూక్ష్మజీవులే.

చెట్టుచేమను, చివఱకు గరికపోచనుగూడ నాస్థారము లేని, కఠినశిలలపై జీవములు పెరుగవని తలంచుట పొరపాటు. పక్షపాతమెఱుగని గాలి, ఒక్కసారి ఆ కొండపై ప్రసరించినచాలును. ఆ కొండచట్రాళ్ళ సన్నని పగుళ్ళలో అప్పుడే కొన్ని సూక్ష్మజీవులు స్థావరమేర్పఱచుకొన్న వన్నమాట. పిమ్మట నాలుగుదినములు పడినవెంటనే, ఆకొండ పైభాగమున పాచివంటి పచ్చిక తల

రొత్తును. అది నశించును. సూక్ష్మజీవులు దానిని పరిణామ పరంపరలకు లోనుజేసి, భూసారముగా మార్చివైచును. వెంటనే వేరొకకారు. పిమ్మట మరియొకటి. ఇట్లు పాచిగా బయలుదేరిన మొలకలకారు, మహావృక్షములకు ప్రథమసోపానమై, ఆకొండ పైభాగమంతయు అడవులసైతము పెంచగలిగిన సారవంతమైన అపనీతముగా తయారగుచున్నది.

మన మొక సరస్సునో, మడుగునో చూతము. అందు అనేకవిధములైన మొక్కలు, తీగెలు మొలచును. అవి నశించును. వానిస్థానే మఱియొక తెగ. అది నశించును. ఇట్లు ప్రతిసంవత్సరమును, ఆ జలాశయము కొంతకొంత పూడిపోవుచుండును. కొంతకాలమున కా జలాశయము పూర్తిగ పూడిపోయి. దానిస్థానమున నొక ఉద్యానవనమో, ఒక చిట్టడవియో పెరిగిపోవును. ప్రకృతిలోని యిట్టి గారడీలవలననే అరణ్యసంచారులు, ఒకచోట చూచిన సరస్సును కొంతకాలమైన పిమ్మట కానక వేఱొండుచోట చూచినట్లుగ భ్రమించుచుందురు. ఇట్లు వృక్షములు, జంతువులును, తమతమ తాహతులకు తగినట్లు, అపనీతముల నేర్పరచుట యందు భాగస్వాములగుచున్నవి.

నీరు, గాలి, యెట్లు అపనీతముల నేర్పరచుటయందు సహాయ్యపడుచున్నవో తెలియుట ముఖ్యము. కొండల పైభాగమందలి సారవంతమైన అపనీతముల తనతోడ లాగుకొనివచ్చి, క్రిందనున్న లోయల సుక్షేత్రముల నొనర్చునది నీరుగాక మఱియేమి; కూలంకషములగు నదీప్రవాహములు, మర్మరధ్వనుల జరజర బాఱు సెలయేళ్ళు, మాఱుళ్ళుబెట్టు కొండవాగులు ఒకచోటనుండి వేఱొకచోటికి సారవంతమైనగాని, సారహీనమైనగాని అపనీతముల నెగుమతి రవాణా చేయుచునే యుండును కదా! లేనిచో, కరాచీ మొదలుకొని అస్సాంవఱకును వ్యాపించిన సుక్షేత్రమగు గంగా సింధు మైదాన మెందుండివచ్చును! ఒకప్పుడు 'భూలోక ధాన్యాగార' మని పేర్వడ్డ ఈజిప్టుదేశపు సారవంతమైన అపనీతములు, దేశీయములు కావట. అనేకమైళ్ళ దూరముననున్న అబిసీనియా పర్వతములనుండి దిగుమతి చేయబడినవట. నదీసాగర సంగమములవద్ద, నీటియడుగున, సారవంతమైన నేల యెంత దాగియున్నదో, యూహింప శక్యమా? వాన కురిసిన వెంటనే, చిన్నచిన్న కడుగులుగా కొట్టుకొనిపోవునీరు, చేలలోని నేలను కోతబెట్టి, భూసారమును తనయందిముడ్చుకొని, ప్రక్క చేనిలోనికో ప్రక్క కాలువలోనికో యీడ్చుకొనిపోయి, యెన్నిచేలను సారహీన మొనర్చుట లేదు! ఇట్టి నీటికోత నాపుటకే, కొండ పంటల పెంచువారు, చెట్లబారుల నాటంకములుగ పెంచుట, 'మెట్లసాగు' అనబడు విధానము నవలంబించుట జరుగుచున్నది.

* * *

శిలలి ట్లనేకవిధముల విచ్ఛితినంది, సూక్ష్మకణములుగామారి, సూక్ష్మతర కణములరూపమగు అపనీతావస్థను బొందుచున్నవి. వీని నేర్పరచుటలో ముఖ్యములు, వాతావరణ ప్రకృతులు సూక్ష్మజీవులని యిదివఱకే తెలిసియుంటిమి.

ఒక్కకొండనుండే వివిధవాతావరణ పరిస్థితులలో రెండుమూడురకముల నేలలు బుట్టుచున్నవి. సింహాద్రి కొండల (పశ్చిమకనుమల) బూడిదవర్ణపు గ్రానైట్ కొండలనుండి, అమితవర్ష ప్రదేశములలో యెఱ్ఱని నేలలు, తక్కినచోట్ల నల్ల నేలలు బుట్టుచున్నవి. ఇట్లే రెండురకముల కొండలనుండి వివిధ పరిస్థితులలో ఒక్కటేరకము నేలగూడా ఏర్పడవచ్చును. కావున నేలనుబట్టి దాని మాతృకయగు శిలను వ్యక్తీకరించుట సులభముకాదు. నేలల చరిత్ర మానవచరిత్రను మించిపోయి యున్నది! కాని, మానవచరిత్రలో ఉన్నంతగా నేలల చరిత్రలో మనకంత సమగ్రజ్ఞాన మింతవఱకలవడలేదు.

సామాన్యరైతు, నేలలను వానివాని రంగులనుబట్టియు, సులభముగ సాగుచేయతగినవా కావాయను విచారణను బట్టియు, వానిని విభజించియున్నాడు. ప్రాజ్ఞులగు అపనీతశాస్త్రజ్ఞులు, పరిశోధకులు, అపనీతములెట్టి శిలాజనితములు, ఎట్టి పరిస్థితులకు లోనైనవి, యెట్టి నిర్మాణముగలవి యని విచారించి, తదనుసారముగ వర్గీకరణము చేసియున్నారు ఈ శాస్త్రజ్ఞుల కృషి శాస్త్రీయ వ్యవసాయమున అత్యంతోపయోగమును బడసి ప్రథమ తాంబూలమును బడయగలదు.

—జాగు గోపాలరావు.

# పువ్వులు

౧

[చైత్రమాసం. డొంకలనిండా చెట్లనిండా తీగెల నిండా బాగా విడిచిన చక్కని పూలు. మెరిసిపోయే రంగులు. మత్తెక్కించే వాసన. చల్లని గాలి. కొండమీద చెట్లచాటునుంచి పైకివొచ్చే ఎఱ్ఱని సూర్యబింబం. తల దువ్వుకొని చామంతిపూల దండ, గులాబిపూలు పెట్టుకొని వెళుతూన్న పద్దెనిమిదేళ్ళ అందమైన యువతి. దార్లో ఎడాపెడా అన్నీ దట్టమైనపొదలు.]

యువతి—ఎంత బాగున్నాయో ఈపూలు? తోటలో పూనొకటేనా ఇలా ఉందా? [పువ్వులన్నీ నవ్వుతుంటూ తీగెలమీద ఊగిపోతాయి]

పాపం! మనుషులు నడవని అడివి. ఇల్లాగే విడిచి ఆ తీగెలమీద అలాగే వాడిపోతాయి. ఎవరు కోసుకుంటారు వీటిని? అబ్బ! చూస్తే—ఎందుకో—ఎల్లాగో ఉంది!

పువ్వులు—మాకోసం నువ్వేమీ విచారపడనక్కర్లేదు. అల్లా ఎక్కడికేనా వెళ్ళి మరీ విచారించు.

[మొగం ఎఱ్ఱచేసుకుంటాయి]

యువతి—విచారించక్కర్లేదూ? ఎవరికోసం? మీమంచిచెపుతున్నా కోపమే? [గుప్పునవొచ్చే వాసనపీల్చి]

అబ్బ! ఏమి సువాసన? ఉత్తిది! ఉత్తిది!! బూడిదలోపోసిన పన్నీరు. ఎవరికి కావాలి ఇక్కడ? పాపం!

పువ్వులు—మనంఅంటే ఎంత దయో! పాపం! దెయ్యంలా గుడ్లు మిటకరిస్తూ చూస్తోంది. వీలయితే పుణుక్కుపోదామని. [ఆకుల్లోంచి బాగా వొదిగించుకుని చూస్తూ అంటాయి]

కొన్నిపువ్వులు—మాకు భయంవేస్తోంది బాబూ! భయం! భయం!! [ఆకుల్లో ఒదిగిపోతాయి]

యువతి—మీకేం తెలియదు. లేకపోతే అల్లా అనరు. మిమ్మల్నిచూస్తే యింకా గుండె కంగిపోతోంది. కోసుకోనా?

పువ్వులు—చెప్పలేదూ? సంగతది. దూరంగాఉండి విచారించు! ముట్టుకోడంమాత్రం వొద్దు. మా సంగతి మాకుతెలుసు. మీ కెందుకన్నాము కాదూ? ఇంకేమి?

యువతి—తరవాత ఎంతేనా ఆనందిస్తారు వినండి! కోసుకోవొద్దూ? [యెఱ్ఱనిచేతులు చాస్తుంది.]

పువ్వులు—వొద్దు! వొద్దు!! మాజోలికి రాకు!

[వొణికిపోతాయి. ఆకులు కదిలిపోతాయి. ఎండ కొంచెం బాగావొస్తుంది].

యువతి—మీకేం తెలియదు. నామాటవింటే—

పువ్వులు—అక్కర్లేదు. ఆగు! ఆగు!! ఆ మొద్దుచేతులతో మమ్మల్ని తాకకు! మారంగులు మాసిపోతాయి. మారేకులు కందిపోతాయి. హృదయంలేని మనుషులు కోసి పెట్టుకోడమేనా మా సౌందర్యానికి పరమావధి? వొద్దు!

యువతి—మనుషులు కోసుకుంటే ఈ గతేమి మీకు?

పువ్వులు—ఏమిటీ? 'మాగతా? మీరు కోసుకోనక్కర్లేదు. మీ సంబంధం మాకు మునుపేవొద్దు. భగవానుడు వీరి వాసనలేని వెలుగిస్తాడు మాకు. మీకు తెలియకుండా గాలి ప్రాణం పోస్తాడు మాకు. చంద్రుడు చల్లనివెన్నెల కుమ్మరిస్తాడు. మబ్బులు నీళ్ళుపోస్తాయి. భూదేవి బువ్వపెడుతుంది. దేవుడుచూసి ఆనందిస్తాడు. మాలోమేము ఆడుకుంటాము. పాడుకుంటాము మాట్లాడుకుంటాము. ఊగుతాము. మీ కేంపని?

యువతి—మీకేం తెలవదు. నా తల్లో గులాబిపూలని చామంతిపూలని అడగండిపోనీ.

[తల వెనక్కితిప్పి పూలని చూపిస్తుంది. గులాబిపూలు సిగ్గుపడతాయి. చామంతిపూలు వెలవెలపోతాయి. అడివిపువ్వులు నవ్వుకుంటాయి. గుప్పున సువాసనలు లేగుతాయి.]

పువ్వులు—మా కర్మంకూడా ఇలా కాలాలనా?

యువతి—కర్మం ఏమి? కర్మం

పువ్వులు—నూనె కారుతున్న ఆయిన పజుట్టు

పొరల్లోపడి నలిగిపోడం కాదూ అదృష్టం? వొద్దు! వొద్దు!!

యువతి—మీకు తెలియదు. వినరుకూడాను.

[చెయ్యిచాచుకుని దగ్గిరికి వెళుతుంది]

పువ్వులు—ఇదిగో! నీకే! నీకే! వొద్దు! రావొద్దు! నీకుకాదూ?

యువతి—మీకింత చెప్పినా తెలియదేమిటి?

[చెయ్యి పూలమీదికి జాపుతుంది. గాజులు గల్లు మంటాయి. పువ్వులన్నీ బెదిరిపోతాయి. గొల్లుమని ఆకులలో దాగిపోతాయి. తలలోపూలు తొంగిచూస్తాయి. ఆకు ఆకుకి బాకులాంటి ఒక్కొక్కముల్లు పైకి నిలిచి ఉంటుంది]

యువతి—అమ్మరోయ్! ఎంతంతున్నారో ముళ్లు! కదిలితే గుచ్చుకోవూ? అమ్మో! వెధవపూలు. ఈ ముళ్ళల్లోపడి ఏడవవలసినవే ఎవరికి కావాలి? ఎందుకూ పనికిరావు. [వెనక్కి వెడుతుంది ఆకుల్లోంచి పూలు పైకిచూస్తాయి. పక్కున నవ్వుతుంటాయి.]

పువ్వులు—బుగ్గలమీద ఆ ఎరుపు ఏమిటి?

[యువతి వెనక్కి తిరిగిచూస్తుంది. కొంగు గాలికి ముళ్ళమీద తగులుతుంది. పూలు కిలాకిలా నవ్వుతుంటూ ఊగిపోతాయి]

యువతి—అబ్బ! పాడుముళ్ళు! కొంగుఅంతా చిరిగి పోయింది [ఇటు అటూ చూచి] ఎటువెళ్ళాడో? అరిచినా పలకడు.

పువ్వులు—అలావెళ్ళాడు. అల్లాగే!

[నవ్వుతూ తలలు ఆకులలోదాచుకుని తొంగి చూస్తాయి.]

యువతి—చప్పునరా? ఎటువెళ్ళావు?

[గట్టిగా అరుస్తుంది నిలబడి] [తెరపడుతుంది]

౨.

[పొదలమీద తీగలమీద చెట్లమీద రంగులరంగుల పూలు గాలికి ఊగిపోతూఉంటాయి. పెద్ద పెద్ద చెట్ల నీడలుకూడా కదులుతుంటాయి పొదలమధ్య దారిలో యువతి వెడుతూఉంటుంది [తల్లోపూలు వెనక్కి చూస్తూఉంటాయి.]

తలలోపువ్వులు—ఎంతహాయిగా ఉంది? చక్కని గాలి. ఇక్కడ ఈపూలన్నీ ఎంత స్వేచ్ఛగాఉన్నాయి?

పొదలలో కొన్ని పువ్వులు—అదేమిటి? ఆ పూలు వాడుమొగాలతో ఆ యినపతాళ్ళలో అలా నొక్కుకు పోతున్నాయి? మీకేమీ బాధగాలేదు?

తలలోపువ్వులు—బాధకాదూ? ఏం చెయ్యం? ఊళ్ళలోఉన్న మాకందరికి తప్పనిది ఈ ఉరి.

కొన్ని పువ్వులు—విడవకపోయినా బాగుండేదేమో! పాపం! మనుషులుకి దయఉండదేమో?

తలలోపువ్వులు—చాలా విలువగల కృత్రిమ హారాలు బలవంతంగా పెడతారు పెరగకమానుతుందా? ఏంచెయ్యం?

కొన్ని పువ్వులు—ఎంతచక్కని రంగులు ఎలావాడి పోయాయి? ఎలా ఊరుకుంటున్నారు?

తలలోపువ్వులు—రంగులేక్కుపోసి బలవంతంగా వేసినవే ఈ రంగులుకూడా. ఎంతచేసినా సాధ్యమై నంతవరకూ మా రంగులు కనబడనీయం. మా సౌరభం పైకి రానీయం.

నల్లనిపువ్వులు—అక్కడ మీకు ఏంతోస్తుంది?

తలలోపువ్వులు—నిజమే! తోచదు. ఇక్కడకి రావాలని ఉంటుంది. కాని, ఈగాలిలో భయంవేస్తుంది. మనుషులచేతులు తాకితేనేగాని భయంపోదు. మనుషులు చూస్తేనేగాని మాకు సంతోషంలేదు. అలవాటు ఏంచేసేది?

ఎర్రనిపువ్వులు—ఎప్పుడేనా ఇలాంటి గాలి రుచి చూచారా?

తలలోపువ్వులు—ఈ హోరుగాలిలో వొణుకు కూడా వొస్తోంది. ఎంతో కొత్తచేసింది. మీకు అల వాటు మరి.

పచ్చనిపువ్వులు—ఎందుకు మిమ్మల్నందరినీ అలా కట్టలాగ కట్టేశారు?

తలలోపువ్వులు—మాబాధ వారికెందుకు! వారి సౌకర్యానికి దారంపోసి సూదితోగుచ్చి కడతారు. జుట్టులో పెడితే ముక్కిపోతూ అలాపడి ఉండవలసిందే.

నీలిపువ్వులు—నీరసంగా ఎలాఉన్నారో పాపం!

[నవ్వుతుంటూ ఆకులలో దాగుకుంటాయి. తలలో పువ్వులువిని సిగ్గుపడతాయి. ఏమిటో గొణుగుకుం టాయి. యువతికి ముల్లు గుచ్చుకుంటుంది. వొరిగి చూచుకుంటుంది. పండూరు డొంకమీంచి యువతి తలలో పూలమీద పడుతుంది. పైకి చూస్తాయి]

కొన్నిపువ్వులు—మరిచిపోయారూ? గుర్తుపట్ట లేరూ మమ్మల్ని? ఎన్నాళ్ళయింది విడిపోయి? మనిషి లోకంలో పడ్డాక గుర్తేలావొస్తాము? ఎరగరుపాపం!

తల్లోపువ్వులు—గుర్తులేదు. ఎరగం. మనుష్యుల్లో పడితే అంతే కాస్త వంకరగాఉంటే కత్తిరిస్తారు. పొడుగయితే తెంపివేస్తారు. ముందుముందుకూడా ఆ లాగే ఉండేలా చేసేస్తారు. ఎన్నో కృత్రిమపు పనులు చేస్తారు. ఎలాగాగుర్తుండడం? పూర్తిగా మరిచిపోయాము

[వింతగా చూస్తూ సిగ్గుపడతాయి].

మరికొన్ని పచ్చపూలు—అబ్బ! ఎలా నలిగిపోతూ న్నాయో? [చూచి ఆకుల్లో ఒదుగుతాయి].

తలలోపువ్వులు—మనలనిచూసే ఎలా నవ్వుకొం టూన్నాయో?

[సిగ్గుపడుతూ గొణుకుకొంటాయి. ఎండకి యువతి కొంగు ముసుగువేసుకుంటుంది. లోపల పూల మాట వింటూ తీగెలమీద పూలు ఏమోఅంటూంటాయి. యువతి వెళుతూఉంటుంది. చల్లగాగాలి వీస్తూంటుంది]

[తెరపడుతుంది]

### 3

[సముద్రతీరం కెరటాలమీదనుంచి చల్లని నీటిబిందు వులని తీసుకొచ్చేగాలి పొదలనిండా గాలికి ఊగిపోయే రంగులరంగుల పూలు. యువతి ఎర్రని బుగ్గలమీద కన్నీళ్లు పడుతూంటాయి. ఇరవైయేళ్ళ యువకుడు మంచి రూపసి కన్నీళ్ళు తుడుస్తూంటాడు. తలలోపూలు వాడి ఉంటాయి.]

యువతి—ఇంతలో ఎలా విరిగిపోయిందో?

యువకుడు—పోనీలే! ఇందుకేనా?—

[బుగ్గలమీది కన్నీళ్లు తుడుస్తాడు]

యువతి—ఎంతెంత ముళ్ళున్నాయనుకున్నావు?

యువకుడు—ఎందుకు వెళ్ళావు అక్కడికి?

యువతి—అడొంకమీద ఎంతెంత మంచిపూ లున్నాయనుకున్నావు? చాలామంచివి.

యువకుడు—ఏడొంకమీద?

[యువతి రేగినజుట్టును సర్దుతూంటాడు]

యువతి—అదుగో! అడొంకమీద.

[డొంకకేసి చూపిస్తుంది]

యువకుడు—నన్ను పిలవకపోయావా? కోసిఇచ్చే వాణ్ణి ఎన్నిపూలనేనా.

యువతి—ఎంత అరిచాను? పలకందే నువ్వు.

యువకుడు—నే కోసిఇస్తానురా వెడదాం అక్కడికి.

[ఇద్దరూ డొంకదరికి వెళుతారు]

ఈ పువ్వులేనా? బాగున్నాయి.

యువతి—ఔను! అవే! కోసిపెట్టు!

యువకుడు—ఇవేనా? నిమిషంలో కోసిఇస్తా. వెధవముళ్ళు ఏంచేస్తాయి?

[జేబులోంచి మడతచాకు తీశాడు. ఒక వెదురుగడ కోశాడు. చాకు దానికికట్టాడు. డొంకమీద పడి పూల గుత్తులుకోశాడు. పువ్వులు వలవల ఏడ్చాయి. రంగులు మాసిపోయాయి డొంకమీదిపూలు భయంపడి గొల్లున అరుస్తూ ఒకటివెనుక ఒకటి ఒదిగిపోయాయి. కొన్ని తీగెలు తెగిపోయాయి. కొన్ని నలిగిపోయాయి. మొగ్గలు రాలిపోయాయి. ఆకులు వాడిపోయాయి డొంక చిన్నపోయింది.]

యువతి—మంచివాడవు. ఎన్నిపువ్వులు కోసి పెట్టావు?

యువకుడు—మంచిపూలు. అన్నీ ముళ్ళే.

యువతి—నువ్వే ఓగుత్తితీసుకో?

[తలలో గుత్తులుపెట్టుకుంది]

యువకుడు—సముద్రంవొడ్డుకి వెడదాం? నీకు మంచిపువ్వులు కోసిపెడతాను.

[ఇద్దరూ వెళుతూఉంటారు. పువ్వులన్నీ తీగెలమీద వాడిలిపోతూ దాగుకుంటూంటాయి. సువాసన ఆగి పోతుంది.]

[తెరపడుతుంది]

—కనకదండి గోపాలకృష్ణశాస్త్రి.

# మణిమాల

## స్త్రీలలో హెచ్చుమంది

### ఏమాసమున గర్భము ధరింతురు ?

ఫ్రెడ్ సి. కెల్లీ అనువారిట్లు వ్రాయుచున్నారు: పాశ్చాత్య ప్రపంచమునందలి వివాహముల విషయమై లెక్కలు తయారుచేసి వానిని పూర్తిగ పరిశీలించి ఒక సుప్రసిద్ధ విద్వాంసు డీక్రింది నిర్ణయములు చేయగలిగినాడు. ఇంతకుపూర్వము వివాహానుభవములేని కన్యలకంటె ఇదివఱకు వివాహితలై దాంపత్య సుఖానుభవముకలిగి ఇపుడు భర్తలను కోలుపోయిన విధవలే మగవారిని ఆకర్షించి తిరిగి వివాహముకావించుకొన సమర్థలైయుందురు. విధవలకు పురుషుని వశ్యము గావించుకొనగల విద్య చక్కగ అలవడియుండును. ఎంతవయసు వచ్చినను కన్యల కట్టివిద్య లెస్సగ అలవడదు. మఱియు వయస్సు ముదిరినస్త్రీ పురుషుల నాకర్షించుటకు అలంకరణ విషయమున అతిశ్రద్ధగలదై యుండవలయును. కావున వారు ఉందురు. సదా అలంకృతలై పురుషుని వశ్యముచేసికొనగలుగుటలో ప్రౌఢలై యుండుటచే వారు కన్యలకంటె సులభముగ భర్తలను సంపాదింతురు. పునర్వివాహమాడుటకు ముప్పదియైదేండ్ల ప్రాయమున విధవకు ఎట్టి అనుకూలము, అవకాశము గలదో అట్టి అనుకూలమే అట్టి అవకాశమే ఆమెకు నలుబదియవయేట కూడ ఉండును. కాని కన్య విషయమున ఇది నిజమనుటను లెక్కలు తెలుపకున్నవి. ముప్పది అయిదవఏట వివాహవిషయమున కన్యకుగల అవకాశము నలుబదియవయేట ఆమె కుండదు. ఇరువదియైదు ముప్పదివత్సరముల నడుమ పునర్వివాహము గావించుకొను విధవలసంఖ్య యెంతయున్నదో ముప్పదియైదు నలుబదివత్సరముల నడుమ వివాహము గావించుకొను విధవలసంఖ్యయును అంతేయున్నది. అనగా విధవల పునర్వివాహ విషయమున వయస్సుముదురుట అనునది ఒక అడ్డంకిగా లేదన్నమాట. విధవలు వివాహమునకు పురుషుని వశ్యము గావించుకొనుటయందు కన్యలకంటె పైచేయిగా నుండుటయేగాదు వారు తమకంటె చిన్నల పురుషులనుగూడ వశీకరణము గావించుకొనుటయందు అధిక ప్రవీణలై యున్నారు. సాధారణముగ పురుషుడు తనకంటె పెద్దదియగుస్త్రీని వివాహమాడుటకు విముఖుడై యుండును. అందును ఈ విషయమున అతడు తనకు ముప్పదియైదేండ్లు దాటినపిమ్మట మిక్కిలి పట్టుదల కలిగియుండుట లెక్కలు తెలుపుచున్నవి. అయినను పురుషుడు తనకంటె పెద్దవయస్సుగల స్త్రీని పెండ్లాడుచో అది ఒక కారణముచేనైయుండునని నిర్ణయించుకొననగును. వయస్సునుగూర్చి విచారింపనవసరములేనంతటి ముగ్ధసౌందర్యముతో ఆస్త్రీ ఒప్పుచుండుట ఆస్త్రీని ఆమెకంటె తక్కువవయస్సుగల పురుషుడు పెండ్లాడుటకు హేతువు. స్త్రీ పురుషులు ఒండొరులను వరించుకొనుటలో సమానగుణముల నెక్కువ పర్యాలోచింతురు. తనకుగల గుణమువంటి గుణములు—తనకుగల ఆలోచనలవంటి ఆలోచనలు గల స్త్రీని పురుషుడు, పురుషుని స్త్రీ ప్రేమించును. ఒక్క గుణవిషయముననే కాదు. ఆకారరేఖ విషయమునగూడ దంపతులు సమానధర్మమునే కాంక్షింతురు. సాధారణముగ జనులలో పొడుగువారు పొట్టివారిని, పొట్టివారు పొడుగువారిని ప్రేమింతురని యొక నమ్మకము గలదు. ఇది నిజమనుటను లెక్కలు నిరూపించకున్నవి. పురుషుడు వయసున తనకంటె పెద్దదియగు స్త్రీనైన వివాహమాడుట కంగీకరించునుగాని తనకంటె పొడగరియగు స్త్రీని వివాహమాడుటకుమాత్ర మంగీకరింపడు. విధురుల (భార్యలుపోయినవారు)కంటె విధవలే సాధారణముగ ఏ దేశమందైనను హెచ్చుగ నుందురు. దీనికి కారణము పురుషులకంటె స్త్రీలు చిరజీవులగుట, పురుషులు సాధారణముగ తమకంటె తక్కువవయస్సులో నున్నవారిని వివాహమగుట. జూను తరువాత అక్టోబరే హెచ్చు వివాహములు జరుగుమాసము. డిసెంబరు, మార్చి నెలలలో అన్నిమాస

ములలోకంటె మిక్కిలి తక్కువసంఖ్య వివాహములు జరుగును. శీతకాలములలో వివాహములు చాలతక్కువగాజరుగుటకు హేతువు అప్పుడు గృహములకు బాడుగ మొదలగునవి విశేషించియుండి వివాహవ్యయములు విస్తరించియుండుటయే సంవత్సరమునందలి పండ్రెండు మాసములలో స్త్రీల గర్భధారణ విషయమున మే మాసము అగ్రస్థానమును వహించుచున్నది. లెక్కలు తీవ్రముగ పరిశీలించినచో మే మాసమున స్త్రీలలో హెచ్చుమంది గర్భము ధరించుచుండుట విస్పష్టమగుచున్నది. —అమెరికన్ లీజియన్ మంత్లీ.

* * *

## దయ్యములు లేవు

దయ్యములు గలవను మూఢవిశ్వాసము మానవులకు ఆదినుండియు గలదు. దయ్యములనగా చనిపోయిన మనుష్యులయొక్క ఆత్మలు అగోచరములగు రూపములుదాల్చి బ్రతికియున్న మనుష్యుల నావహించి బాధించునందురు. అది వట్టిభ్రమ. ఏలననగా దయ్యమనునదే లేదు. లేకపోయిన యిట్టి నమ్మకము ఆదియందుగల మానవులకు కలుగుటకుగల కారణము విచారించిన మానవులు పశుప్రాయులైయున్న దినములలో మనుష్యుని మరణచిహ్నములు సరిగా గ్రహించలేక హృద్రోగముచేతనైనను, మానసిక రోగముచేతనైనను, లేక మరి యే యితర కారణముచేతనైనను స్పృహతప్పి పడిపోయిన వారినికూడ మృత్యుతుల్యులుగ పరిగణించుచుండెడివారు. అనాగరికులగు ఆదిమ నివాసులు మనుష్యుని బాహ్య చైతన్యముడిగినవెంటనే వాడు చనిపోయెనని వాని బంధువులు, మిత్రులు ప్రేతముయొద్ద కూర్చొని పోయినఆత్మను తిరిగి శరీరమునందు ప్రవేశింపమని ప్రార్థనలు చేసెడివారు. అట్టియెడ పైని చెప్పిన రోగములచే పోయిన స్పృహ మరల వచ్చిన, వానిఆత్మ తమప్రార్థనలు మన్నించినదనియు అనుకొందురు. నిజముగా చనిపోయిన మనుష్యునికి స్పృహ ఎప్పటికి రాకపోవుటచే వాని ఆత్మ తమ ప్రార్థనలు వినలేదనియు మరియు దానికి తిరిగి తాను విడిచిన శరీరములో ప్రవేశించుట కిష్టములేదనియు, ఆయాత్మ అచ్చటనే దయ్యమయి తిరుగుచుండుననియు, నమ్ముచు దాని తృప్త్యర్థము భోజనపదార్థములు, గృహములు మొదలగునవి కట్టించి అర్పించుచుండెడివారు. క్షుద్రదేవతారాధనలు, భూతములు, మొదలగునవి బూటకములని గ్రహించలేక అవిద్వాంసులు, విద్వాంసులును చిన్ననాటినుండియు భయమనునదిఏ కోశమునులేక నిర్భయముగనుండు తమ చంటిపిల్లలను 'ఇదిగో బూచి, అదిగో దయ్యము, అమ్మో!' యని జడిపించుచు పిరికితనమునకు వారి మనస్సులో తావుగల్గించి పిరికిపందలుగను మూఢ నమ్మకముగలవారిగను మార్చుచున్నారు. కనుకనే అనేకులు నేను మంచి భూతవైద్యుడను ఎటువంటి దయ్యమునైనను క్షణములో పోగొట్టుదునని ప్రజలను మోసముచేసి ధనమార్జించి జీవనము చేయుచున్నారు. మనము దయ్యముపట్టినది అని చెప్పు మనుష్యులుచేయు చేష్టలు, ప్రేలాపనలు ఇస్టీరియా అను ఒకవిధమైన మానసికరోగముచే కలుగునవిగాన అది భూతవైద్యులనబడు మోసగాండ్రు చేయు, పూజలు, జంతుబలులు, దిగదోడుపులు మొదలగు బూటకపు పనులవలన పోవునదికాదు. ఇస్టీరియా అనువ్యాధి నూతనముగా యౌవనమంకురించు జాలిగుండెగలవారై ధైర్యవిహీనులైయున్న స్త్రీ, పురుషులకు తరచుగ వచ్చుచుండును ఈవ్యాధి వచ్చినవారు తమలోతాము మెల్లగను ఒక్కొక్కప్పుడు గట్టిగను నవ్వుకొనుటయు, ఏడ్చుటయు, దుర్భాషలాడుటయు, అర్థములేని మాటలాడుటయు, ఎన్నడో వినియున్న నూతనభాష మాట్లాడుటయు పరుగెత్తుటయు, కొట్టుట తాము కట్టిన బట్టలను విప్పుకొనజూచుట ఇంక నెన్నో వికారచేష్టలు చేయుచుందురు. ఇవన్నియు చూచిన మనవారు దయ్యమో, భూతమో పట్టినదని భ్రమించి వ్యాధినివారణకై మందులిప్పించక మంత్రతంత్రములు చేయించుచు, పోగులు తావీజులు కట్టించుచు కాలవ్యాపనచేయుటచే రోగము మరింత విజృంభించి ఒకప్పుడు రోగి మృత్యువాతబడుటగూడ తటస్థించుచుండును. కనుక భయంకరమగు వేషములు వేయుచు కడియములు మొదలగునవి ధరించి దయ్యములను భూతములను పోగొడుదుమని తౌటకము బూటకము చేయు మోసగాండ్రను నమ్మకుడు. —నార్నిండి రామారావు.

# ఆరోగ్యవిజ్ఞానము

## ౯. బదరీ - రేగుచెట్టు

భేదములు:—ఇది 'బదరము, ముష్టి ప్రమాణబదరము (ఆపిల్సు), వికంకతము (అడవిరేగు), కరమర్దము' అని నాలుగువిధములుగా నుండును. అందు మొదటిది సాధారణబదరము, రాజబదరము (కాశీ రేగుపండు), హస్తిబదరము, క్షుద్రబదరము, భూబదరము (పుల్లరేగు), వారిబదరము అని తిరిగి యారువిధములుగానుండును. కరమర్దమను (వాకపండు), బదర భేదముగూడ తిరిగి మహా-క్షుద్రభేదముచే రెండువిధములుగానుండును

పచ్యమానబదర గుణములు:—పండుచున్నట్టి రేగుకాయ పెద్దదిగనుండి సౌవీరముగ వ్యవహరింపబడును. ఇది మధురరసమును, గురుగుణమును. శీతవీర్యమును గలిగియుండును. మలభేదనము జేయును. శుక్రమును వృద్ధిపొందించును. బృంహణము. పిత్తమును శమింపజేయును దాహము, రక్తదోషము. క్షయము, తృష్ణ అను నీ వ్యాధులను బోగొట్టును.

పక్వబదర గుణములు:—బదరఫలము పండినప్పుడు మధురరసమును, గురు సర గుణములను, ఉష్ణవీర్యమును గలిగియుండును. మలాదులను నిరోధించును రుచిని బుట్టించును. త్రిదోషములను వృద్ధిబొందించును.

క్షుద్రబదరగుణములు:—చిన్నరేగుపండు అమ్లరసమును కషాయతిక్తానురసములను కొద్దిగ మధురానురసమును స్నిగ్ధ గురు గుణములను గలిగియుండును. వాతపిత్తములను శమింపజేయును.

శుష్కబదరఫల గుణములు:—ఎండిన యన్నిజాతుల రేగుపండ్లును లఘుగుణమును గలిగియుండును. మలభేదనమును జేయును. జాఠరాగ్నిని వృద్ధిబొందించును. తృష్ణను క్లమను రక్తదోషమును బోగొట్టును.

వికంకతఫల గుణములు:—అడవిరేగుపండు మధురరసమును గలిగియుండును. త్రిదోషములను శమింపజేయును.

ఆపిల్ పండు గుణములు:—మధురరసమును, గురుగుణమును శీతవీర్యమును మధురవిపాకమును గలిగియుండును. బృంహణము. రుచినిబుట్టించును. శుక్రమును వృద్ధిపొందించును. కఫమును వృద్ధిజేయును. వాతపిత్తములను శమింపజేయును.

కరమర్దః—వాక (వా) చెట్టు,

ఆమఫలగుణములు:—పెద్దది చిన్నదియగు వాకచెట్ల పచ్చికాయలు అమ్లరసమును, గురుగుణమును, ఉష్ణవీర్యమును గలిగియుండును. రుచినిబుట్టించును. రక్తపిత్తమును గలిగించును కఫమును వృద్ధిపొందించును. తృష్ణను బోగొట్టును.

పక్వఫలగుణములు:—పెద్దది చిన్నదియగు వాకచెట్ల పండ్లు మధురరసమును లఘుగుణమును గలిగియుండును. రుచినిబుట్టించును. పిత్తమును వాతమును శమింపజేయును.

ప్రయోగములు:—

1. అర్శోరోగమునందు:— బదరఫలముల కషాయమునందు నీరువెచ్చగనున్నప్పుడు అర్శోరోగిని గూర్చుండబెట్టి యవగాహస్వేదము చేసిన శూల శమించును.

2. అతీసారమునందు:—రేగుపండ్లును, పెరుగును దానిమ్మపండ్ల రసమును గలిపి యూషముజేసి యందు అధికముగా స్నేహముజేర్చి సేవించిన అతిసారము శమించును.

3. మదాత్యయమునందు:—రేగు చిగుళ్ళు వేప చిగుళ్ళు వీనిని మెత్తగానూరి పుంతదుకాయలనురుగుతో జేర్చి లేపనముజేసిన మదాత్యయమునందలి విదాహము శమించును.

4. కాసమునందు:—రేగాకుల కల్కమును సైంధవ లవణచూర్ణమునుగలిపి నేతితో భర్జనజేసి సేవించిన స్వరభేదము, కాసయు శమించును.

5 ప్లీహయందు:—రేగాకులను మెత్తగానూరి తైలముజేర్చి ప్లీహవృద్ధిపైనియుంచి యుపనాహ స్వేదముజేసి పిమ్మట ముసలముతో ప్లీహను నదమవలెను. ఈ విధముగజేయుచు పాలను సేవించుచుండిన ప్లీహాభివృద్ధి శమించును

6 రక్తాతిసారమునందు:—అంకుడుపట్ట, రేగుపట్ట వీనిచూర్ణమును తేనెతోగలిపి పాలతో సేవించిన రక్తాతిసారము శమించును.

7 మసూరికయందు:—రేగుపండ్ల చూర్ణమును గుడముతోజేర్చి సేవించిన త్రిదోషజమగు మసూరిక శీఘ్రముగ పాకమునుబొందును.

8. ప్రదరమునందు:—రేగుపండ్ల చూర్ణమును బెల్లముతోగలిపి సేవించిన ప్రదరము శమించును

9. స్థౌల్యమునందు:—రేగాకుల కల్కమును కాంజికమునందుజేర్చి పేయను సిద్ధముజేసి సేవించిన స్థౌల్యము శమించును

10. ప్రవాహికయందు:—ఆరెచెట్టాకులను, రేగాకులను మెత్తగానూరి పెరుగునందు జేర్చి సేవించిన ప్రవాహిక శమించును.

11. భస్మకాగ్నియందు:—రేగుగింజల కల్కమును జలముతోసేవించిన శీఘ్రముగ భస్మకాగ్ని శమించును

12. శిరోరోగమునందు:—రేగుచెట్టు వేరును పిప్పళ్లను గలిపి మెత్తగానూరి లలాటమునందు లేపనముజేసిన శిరశ్శూల శమించును.

౫ అశ్వత్థః - రావిచెట్టు

ప్రయోగములు:—

1. వాతరక్తమునందు:—రావిచెక్క కషాయమును తేనెతోజేర్చి సేవించిన వాతరక్తము శీఘ్రముగ శమించును.

2. వ్రణమునందు:—రావియాకులను వ్రణములపై ఆచ్ఛాదనముచేసిన శీఘ్రముగ రోపణమగును.

మద్దిపట్ట, అత్తిపట్ట, రావిపట్ట వీనిచూర్ణమును వ్రణములపై అవచూర్ణముచేసిన శీఘ్రముగ చర్మము కలుసుకుని మానును.

3. ప్రమేహమునందు:—రావిచెక్క కషాయమును సేవించిన నీలమేహము శమించును.

4. వాజీకరణమునకు:—రావిచెట్టుయొక్క ఫలములు, మూలము, పట్ట, ఊడలు వీనితోగాచిన పాలయందు చక్కెరను తేనెనుజేర్చి సేవించిన వాజీకరణమగును.

5. భగ్నవ్రణమునందు:—రావి, మోదుగ, మద్ది వీని పట్టలను భగ్నవ్రణములపైనుంచి కట్టుకట్టిన శీఘ్రముగ రోపణమగును.

6 కర్ణరోగమునందు:—రావి, మారేడు, జిల్లేడు, ఆముదపుచెట్టు వీనియొక్క పత్రములను గ్రహించి తిలతైలమును సైంధవలవణమును బాగుగాకలిపి దీనితో వానికి ప్రత్యేకముగా లేపనముజేసి పుటపాకవిధి ననుసరించి పాకముజేసి యందుండి స్వరసమును గ్రహించి సుఖోష్ణముగ నున్నప్పుడు కర్ణపూరణముచేసిన కర్ణరోగము శమించును.

7. వ్రణశోథమునందు:—మర్రి, అత్తి, రావి వీని యొక్క పట్టలను మెత్తగనూరి అందు హెచ్చుగ ఘృతమును గలిపి వ్రణశోథపు ప్రదేహముజేసిన శోథ నిర్వాపణమవును

8 గర్భలాభార్థము:—రావిచెట్టుపై మొలచిన బదనికతో గాచిన పాలను సేవించిన గర్భప్రదమవును.

9. వమనమునందు:—ఎండిన రావిపట్టను బాగుగా గాల్చి జలమునందుగలిపి కొంతకాలముంచిన పిమ్మట పైకితేరినట్టి ద్రవమునువడియగట్టి పానము జేసిన వెంటనే దుస్తరమగు ఛర్ది గూడ శమించును.

10. అగ్నిదగ్ధవ్రణమునందు:—ఎండిన రావిపట్ట యొక్క మృదుచూర్ణమును అగ్నిదగ్ధవ్రణముపై నవచూర్ణనముజేసిన శీఘ్రముగ మానును.

11. శిశువులముఖపాకమునందు:—రావిపట్ట చూర్ణమును తేనెతోగలిపి బాలుర నోటిపూతకు లేపనముజేసిన శమించును.

—డాక్టరు ఏ. వి. శర్మ ఎ. ఎం. ఏ. సి.

# ఇన్స్యూరెన్సు విషయములు

## క్రొత్త భీమాకంపెనీలు: కొన్ని సమస్యలు

[‘క్రొత్త భీమాకంపెనీలు: కొన్నిసమస్యలు’ అను శీర్షికతో ‘కమర్షియల్ గెజెట్’ అను పత్రికయందు యస్. సి. బెనర్జీ అనువారు ఒక చక్కనివ్యాసమును వ్రాసియున్నారు. తెనుగు మాగాణికి నడిబొడ్డు అయిన బెజవాడయందు స్థాపింపబడి వ్యవహరించుచున్న డెక్కన్ ఇన్సూరెన్సుకంపెనీ అధ్యక్షులగు శ్రీయుత శీలంశెట్టి గోవర్ధనరావుగారు తాము ఆంగ్లమున ప్రచురించుచున్న ‘ది ఇండియన్ పోలసీహోల్డర్సు రెవ్యూ’ యందు సదరు వ్యాసమును ఎత్తి ముద్రించిరి. దాని భావముల నిచట తెనుగు పాఠకులకు అందించుచున్నాము.
—సంపాదకుడు.]

క్రొత్తగా పుట్టి పెరుగుచున్న జీవితభీమాకంపెనీలను గూర్చి వ్రాయునపుడు నాకు ఈ కంపెనీలు క్రొత్తవి యగుటయే ఒక చెడ్డసమస్యయను కొందఱు మహనీయుల పలుకులు జ్ఞప్తికివచ్చును. క్రొత్తకంపెనీలు హిందూదేశమునందలి జీవితభీమా విధానపు భావిని పచ్చము పాడొనర్చునని వారిభావన. హైందవభీమా విధానమను పొలమున ఈ కంపెనీల ఉద్భవము కోరరానిదని వారి తలంపు వానిని ఆర్థికముగా ముట్టరాని వస్తువులుగా మాత్రము చూడవలసియుండునని వారు జనసామాన్యమును ప్రబోధింతురు. శపింపబడుటకును, దూరమున నుంచుటకునుమాత్రమే అవి తగినవని వారి ఉద్దేశము.

ఇది న్యాయసమ్మతమైనదేనా? నూత్నసముద్భవమైనదను ఒక్క విషయముచేతనే ఈ కంపెనీలను గూర్చి తుది నిర్ణయమునకు వచ్చుట మంచిదికాదు. కంపెనీలు స్థాపింపబడిన తొలిదినములప్పటి ప్రమాదములు ఒక భీమాకంపెనీని ఆర్థికప్రపంచమున కోరరాని దానిగా నొనర్చుచుండుచో నేడు హిందూదేశమున క్రమాభివృద్ధియందున్న జీవితభీమా విధానము వంటిది యుండి యుండుట సంశయాస్పదమగును. భారతదేశమున నేడు ఐదు పెద్దభీమాకంపెనీలు కలవు. ఆ అయిదును అంతటి పెద్దవి ఎట్లు అయినవి? బహుకాల వ్యాప్తమును, నెమ్మదియునైన పరిణామముచేతనే, తొలిదినములలో పెద్ద తప్పిదములనుగావించి వానిని సవరించుకొనుటచేతనే. మన ఈ పిదప ప్రపంచమున సంస్థలు క్రమాభివృద్ధినందు పద్ధతి ఇదియే.

హిందూదేశపు భీమాక్షేత్రమున ఈనడుమ పదుల కొలది పుట్టుచు ఆక్షేత్రమును క్రిక్కిరచేయుచున్న కంపెనీల వలననే కొందఱికి ఇట్టి అభిప్రాయము కలుగుటకు కారణమైయుండును. అయితే ఎన్నికంపెనీలు పుట్టనగునో, ఎన్నికంపెనీలు ఉండనగునో మనము చెప్పగలమా? ఈ విషయమై పొందదగు ఆఖ్యారియాల్ నిర్ణయమేమైనగలదా? పశ్చిమ ఖండములయందు భీమాకంపెనీల పుట్టుకనుగూర్చి అట్టి నిర్ణయమువంటి దెప్పుడైన చేయబడెనా?

౫౩౭

జనాభాసమస్య ఎంతపెద్దదో ఈ సమస్యకూడ అంత పెద్దదనియే నేను భావించుచున్నాను. జననముల సగటుసంఖ్య పెరుగుచున్నది. సమష్టి కుటుంబములు నశించిపోవుచున్నవి పట్టణములందు నివసించువారి సంఖ్య త్వరాభివృద్ధిని చూపుచున్నది. చేయదగియు, చేయగలిగియు ఇన్సూరుచేయకున్న వారి సంఖ్య కొలది యిడరానిదిగనున్నది. మఱియు నవీన జీవితవిధానమున మానవునకు అనేకములగు క్రొత్త అవసరములు కావలసియున్నవి. ఇవిఅన్నియు క్రొత్త కంపెనీలకు అవకాశముండుటను నిరూపించును.

ఇట్లంటినని నన్ను అన్యథా భావింపవలదు. అధికముగ ఉన్నది పుష్టి అను భావముతో నేనీ సమస్యను పర్యాలోచించుటలేదు. ఈ క్రొత్తకంపెనీల విషయమునగల అభ్యంతరమంతయు వాని సంఖ్యాబాహుళ్యమునందు గాని, వాని నూతనత్వమునందు గాని లేదని నా అభిప్రాయము. అవి నడుపు కార్యక్రమముమీదనే ఆ అభ్యంతరము నిలిచియుండును. ఇచటనే సమస్య అంతయు కేంద్రీకరింపబడియున్నదని నా తలంపు. ఈ సమయమున ఈ కంపెనీలు ఎదుర్కొనవలసిన కొన్ని ప్రత్యేకకష్టములు గలవు, వాని దారి అంతయు కష్టములను కంటకములతోడను, ప్రమాదములను గోతులతోను నిండారియున్నది కాగా వానిపై ఈ ప్రారంభదశలో చన్నీళ్ళుచల్లుట కూడదు. సక్రమముగ నిర్వహింపబడుటకు చక్కని సహాయకరమగు ఉపదేశమును ఆ కంపెనీలు కోరును. వానిని బొత్తిగా తృణీకరించుటగాని, స్థితిలేకుండ లయమొనర్చుటగాని సమస్యను సడలించుటకాదు. ఈ క్రొత్త కంపెనీల రాకవలన భీమా ప్రపంచమున అపూర్వమగు స్పర్థ ఏర్పడెడుమాట నిజమే. ప్రతి వ్యాపారమునందువలెనే భీమా వ్యాపారమునకూడ అనుచితమగు స్పర్థ హానికరమైనదే. కాని స్పర్థలో అనుచితవిషయము ప్రాయికముగా ఎచ్చట ఉండుచున్నది అనుసంగతి వాదగ్రస్తమైనది. ఏమైనను మొదట స్పర్థవిషయమున దోషమొనర్చినవారిని పట్టుకొనుటకు చేయు ప్రయత్నమంతయు వ్యర్థమైనది. వ్యాపారమునకు ఆయువుపట్టు స్పర్థ. అట్టి స్పర్థను లేకుండచేయుట అనునది తెలివైనపని అని చెప్పజాలము. హిందూదేశము భీమాక్షేత్రమున క్రొత్తకంపెనీల అవతరణము స్పర్థను తీవ్రతరమొనర్చినది ఆ కారణమున పోలసీవిధానము విశాలపఱుపబడినది, ప్రీమియములును తగ్గినవి. జీవితభీమావలని లాభములను ప్రతిగృహమును పొందగలుగుటకు అవకాశము లేర్పడినని. మోనాపలీ వ్యాపారమున నాకు నమ్మకములేదు. కావున జీవిత భీమా సంస్థలు ఎన్నిఉండవలయును, ఎట్టివి ఉండవలయును అను ప్రశ్నకు నా సమాధానమేమియన పడిపోకుండ నెన్నియుండిన అన్ని యుండవచ్చునని.

ఈ సృష్టిలో క్రొత్తదనము చెడ్డతనమును ఎంతమాత్రమును సూచింపదు. ఇట్లనుటచే ఇప్పుడు పుట్టిన బిడ్డడు కూడ తండ్రియంతటి బలశాలి అనిచెప్పుటకాదు. క్రొత్తకంపెనీ పాతకంపెనీయంతటి సత్తువతోనుండదు. కాని తగినపనిచేసి దానికి పోషణప్రోత్సాహములు కలిగించుచో అది పాతకంపెనీ అంత బలముకలదిగను, ఒక్కొక్కప్పుడు దానికంటె బలయుతమైనదిగను అగుటకు అవకాశము కలదనుటకు కారణమేమైన కలదా? ఆ క్రొత్తకంపెనిలో ప్రతిజీవికిని ఉండు పెంపొందవలయునను కాంక్ష మిళితమై ఉండనే ఉన్నది. ఆకాంక్ష క్రమవిధానమున పోషింపబడుచో ఆ కంపెనీ భావికాలమున అతివిస్తృతి నందగలుగుట సహజము. మఱియు క్రొత్తకంపెనీలకు కొన్ని విశేష లాభములు లేకపోలేదు. భీమా న్యాయసూత్రములు ఇపుడు మునుపటికంటె మంచి కట్టుదిట్టము కలిగియున్నవి. ఈ కట్టుదిట్టమున క్రొత్తకంపెనీలరక్షణ భద్రమైయున్నది. పాతకంపెనీల చిరకాలానుభవముచే కరతలగట్టిన విజ్ఞానమంతయు క్రొత్తకంపెనీలకు వారసత్వమైయున్నది. పాతకంపెనీలకు ఈ విజ్ఞానానుభవము ఒక్కొక్కప్పుడు విశేషధనవ్యయముతో అయినదనుమాట మనము మఱువరాదు. కాగా క్రొత్త కంపెనీల మార్గము అగోచరమనుటకు వలనులేదు. గడ్డిగాదములు తొలగింపబడి సాగలిసాగుటకు సర్వసిద్ధమొనర్పబడియున్న క్షేత్రము నేటి క్రొత్తకంపెనీలకు

లభ్యమగుచున్నది. క్రొత్తకంపెనీలకు ఇన్ని వీళ్లున్నవి. కాగా వీనివలని లాభమును అవి బడయకుండుటకు కారణమేమియు అగుపించదు.

క్రొత్తకంపెనీల విషయమున కొన్ని లోట్లుకూడ లేకపోలేదు. క్రొత్తలో తొందరపాటు సహజము. వ్యాపారమును కూర్చుకొనుటలో ఈ తొందరపాటు ముఖ్యముగ ప్రదర్శితమగును. గుణ మెట్టిదగుగాక ఖర్చు ఎంతయగుగాక విశేష వ్యాపారమును కూర్చుటయే క్రొత్తకంపెనీల ముఖ్యాశయమైయుండును. ఈపద్ధతి తప్పక దుష్ఫలితముల నిచ్చును. రాశిగాక రక్షణ ప్రధానమను విషయమును క్రొత్తకంపెనీలు తప్పక విస్మరించును. ఇన్సూరెన్సు శాస్త్రానుభవము విరజిమ్ము వెలుగున నడచుటలో ఇట్టిలోట్లు కలుగకుండపోవును. జీవితభీమా వ్యాపారము ఒక స్థిరమైన శాస్త్రముపై ఆధారపడియున్నది. కాగా స్వప్యలేపన్ వ్యాపారమునకు దిగుచో క్రొత్తకంపెనీ అయినను పాతకంపెనీ అయినను నష్టముపాలగుట తప్పదు. ప్రారంభదశలో ఎట్లున్నను కాలముగడచిన కొలదిని పరిస్థితులు వాటి యంతట అవియే చక్కబడునను నమ్మకము కలిగి యుండుట జీవితభీమా వ్యాపారముయొక్క మూల సూత్రముల అవగాహము తప్పియుండుటను తెలుపును. సకాలమున సరిచేయబడినచో ఒక తప్పిదమునుండి మఱి యొక తప్పిదమునకు జారుచు కంపెనీ సర్వమును కదల జేయు కాలమూర్తికి లోగును. ప్రారంభదశను అతి క్రమించిన కంపెనీయొక్క అభివృద్ధి ఇక కాలముతో కూడుకొన్నదియు అనంతరము దాని అభివృద్ధి జగ న్నాధుని రథగమనమువలె నవ్యమైయుండుననియు చెప్పుమాట విషయము తెలియక చెప్పు మాటగాని అన్యము కాదు. ప్రారంభదశయందుకంటె అనంతకాల ముననే భంగిభయమునకు హెచ్చు అవకాశముగలదు. జలమగ్నమైయుండి తాకినపడవను బ్రద్దలుచేయు కొండలను తప్పించి భద్రత అను హార్బరును చేర్చుటకు మొక్కవోని నేర్పరితనము, దూరదర్శిత్వము, మంచి ఆలోచన ఉండవలయును.

— సశేషము.

## డు పజ్‌ల్ సమాధానములు.

| | | | |
|---|---|---|---|
| 1 | పొడుము | 9 | ఆడుది |
| 2 | ఉడుత | 10 | ముడుపు |
| 3 | కొడుకు | 11 | పిడుగు |
| 4 | మడుగు | 12 | అడుగు |
| 5 | ఉడుము | 13 | బడులు |
| 6 | ఆడుట | 14 | బాడుగ |
| 7 | చిడుము | 15 | పిడుక |
| 8 | విడుపు | 16 | గొడుగు |

ఈ పజ్‌ల్‌నకు పోటీచేసియున్న వారిలో ఒక్కరు కూడ అన్నిటికిని సరియైన సమాధానములు వ్రాయలేదు. ఈ క్రింది ముగ్గురుమాత్రమే ఒక్కొక్క విషయమందు తప్పినారు.

౧ శ్రీమతి వడ్లమూడి రామానుజమ్మగారు
కేరాఫ్ వడ్లమూడి వేంకటరత్నముగారు
పండితుడు బోర్డు హైస్కూలు బాపట్ల, గుంటూరుజిల్లా.

౨. యస్ బి. కె. రావుగారు
మెయిన్‌రోడ్డు, కాకినాడ.

3. పి. యస్. ఉమామహేశ్వరరావుగారు
బూగ్‌స్ట్రీట్, తిరుపతి, చిత్తూరుజిల్లా.

అన్నిటికి సరియైన సమాధానములు వ్రాసినవారు ఒక్కరును లేకపోవుటచే మా ఆంధ్రభూమి ఒక్కొక్క సంవత్సరం పై ముగ్గురకు ఉచితముగా పంపుటకు నిర్ణ యించినాము.

ఐతే యిందు మా పత్రికకు యిదివరలోనే చందా దారులుగ నున్నవారున్నచో వారి బహుమానధనము వారు కోరినరీతిని అందజేయుదుమని మనవి.

పోటీబహుమానము పొందినవారు మాకు తిరిగి వారి పూర్తి చిరునామా వ్రాయుచు బహుమానధనము ఏరీతిగా వారికి అందజేయవలెనో మాకు తెల్పనిదే బహుమానము వారికి పంపజాలమని యిదివరలోనే మనవిచేసియున్నాము. కొంతమంది మాకుముందు లేఖవ్రాయకయే మా బహుమానము పంపినారుకారు అని వ్రాయుచున్నారు అట్టివారికి తెలియునిమిత్తమై పైసంగతి మరల ప్రకటింపవలసివచ్చినది. పోటీబహుమాన సమాధానములు పంపునపుడు యాత్రలలోనుండి అచ్చటి చిరునామాలుగాని ప్రయాణములలోనుండి కేరాఫ్ పోస్టుమేస్టరు కేరాఫ్ స్టేషన్ మాస్టరు అను చిరునామాలుగాని వ్రాయక పూర్తి చిరునామా వ్రాయవలయునని కోరుచున్నాము.

## జిజ్ఞాస మీమాంస

విజ్ఞానసంపాదనావసరమున వివిధవిషయములందు కలుగు సందేహములను నివారించుకొన పత్రికాముఖమున జిజ్ఞాస సలుపుటకును—ఇందలి ఏ ఒక్క జిజ్ఞాసకైనను సరే సరియైన సమాధానము తెలిసియున్నచో దానిని కూడినంత సంగ్రహముగ వ్రాసి, ప్రచురణార్థము పంపుటకును ఆంధ్రభూమి పాఠకులను ప్రార్థింతుము.

—సంపాదకుడు.

### ౩౪. పుట్టినరోజు

నాల్గు సంవత్సరముల కొకసారి ఫిబ్రవరి నెలలో ఇరువదితొమ్మిదిరోజులు వచ్చుట ఎల్లరకు తెలిసినవిషయమే. మనకు తిథులుకూడ కలవుగాన అంతఇబ్బంది యుండదు కాని ఆంగ్లేయులలో ఫిబ్రవరి 29-వ తేదీని జనన మొందినవారికి ప్రతిసంవత్సరము పుట్టిన రోజు ఎట్లు వచ్చును ?

—అల్లమరాజు నరసింహమూర్తి.

### ౩౫. మంత్రములు

కొన్ని చర్మవ్యాధులు- భూతప్రేత పిశాచాదులు మంత్రములకు లొంగుటకు కారణమేమి ? పాము, తేలు మొదలగు విషజంతువుల కాట్లవలని బాధ కేవలము మంత్రము వలన నివారణయగుట నిజమేనా ? రక్తముతో కలిసిన విషము మంత్రోచ్చారణవలన నెట్లుపోవును ?

—దేశరాజు వీరభద్రరావు.

### ౩౬. క్షురకర్మ

క్షురకర్మ చేయించుకొనుటకు మంచిరో జెందులకు చూడవలయును ?

—దేశరాజు వీరభద్రరావు.

### ౩౭. కవల బిడ్డలు

సాధారణముగా సహోదరులలో నొకరిపై నింకొకరి కుండు ప్రేమకంటే కవల బిడ్డలకు ఒండొరులపైగల ప్రేమ అధికమా ? కవల బిడ్డలకు జన్మమొకసారి ప్రాప్తించినట్లే వారి జీవితములో కష్టసుఖములుకూడ ఇద్దరకును ఏకకాలమున సంభవించుటకు అవకాశమున్నదా ?

—క్రొవ్విడి రామం.

### ౩౮. డబ్బుకు బదులు భూమి

ప్రస్తుతము దేశమును-ఆవరించిన ఆర్థిక మాంద్యమువలన పలువురు లోగడ చేసిన ఋణములను తీర్చలేక నగదుకు బదులు పొలములను ఇచ్చుచున్నారు ఇందువలన ఋణదాతలు వందలకొలది యెకరములకు ఖామందులగుచున్నారు. ఇది దేశమునకు లాభమా ? నష్టమా ?

—ఆర్ శ్రీరామమూర్తి, బి.ఎ.

### ౩౯. పిప్పళ్ళపంట

తెనుగుదేశమున పిప్పళ్ళు పండింపవచ్చునా ? వచ్చునేని ఆ మొక్కలను ఎప్పుడు నాటవలయును ? ఎట్లు పెంచవలయును ?

—అడపా నారాయణుడు.

### ౪౦. అరిటి సొరుగు కోత

గోదావరిజిల్లాలలో అరిటితోటలలోని చెట్ల సొరుగు ఎప్పటికప్పుడు కోసి బాగు చేయుచుందురు. ఇతరప్రాంతములందు ఈ పద్ధతి లేదు. ఈపద్ధతి మంచిదా ? చెడ్డదా ?

—యాతం మల్లయ్య.

# సంపాదకీయ సమాలోచన

## జయ్‌విజయ ఇన్సూరెన్సుకంపెనీ
## బీదవారలకు భీమాసంరక్షణ :—

తెనుగువాని సొంతములైన ఐదు, ఆరు భీమాకంపెనీలలో జయ్‌విజయ ఇన్సూరెన్సు కంపెనీ ఒకటి. ఈకంపెనీ ఇంతకుమునుపు జయ్‌భారత్ ఇన్సూరెన్సు కంపెనీ అను నామమున వ్యవహారింపబడుచుండునది. ఇది 1931-వ సంవత్సరమున ఆంధ్రవైశ్య ప్రముఖులగు శ్రీయుతులు వి. వి. పున్నయ్య, డి. చెంచయ్యగార్లచే స్థాపింపబడినది. మూడు వత్సరములలో ఆకంపెనీ మంచి వ్యాపారమును గావించెను. ముప్పదివేల మంది పోలసీదారులను సంపాదింపగలిగెను. సుమారు ఐదులక్షల రూపాయిల క్లెయిములను ఇచ్చియుండెను. లాహోరునందలి భారత్ ఇన్సూరెన్సు కంపెనీవారు నామ సాదృశ్యమునకు ఈ కంపెనీవారిపై దావా తెచ్చి డిక్రీపొందియుండిన కారణమున దీని నామము జయ్‌విజయగా మార్చబడెను. ఈ నూత్న నామముతో వ్యవహరించుచు ఈ కంపెనీ పెక్కు ఆకర్షణీయములగు నూత్న పద్ధతులను ప్రవేశపెట్టినది. 250 రూపాయిలు మొదలు ఎంతపెద్ద మొత్తమునకైనను కూడ పట్టాలనిచ్చుటకు దొరకొని ఈకంపెనీ వారు ప్రజాసామాన్యమున కెంతయు ఉపకరింపగలుగు పరిస్థితుల కల్పించిరి.

ముఖ్యముగా వీరు ప్రిమియములు నెలసరివాయిదా పద్ధతులమీద వసూలు చేయుటకు సంకల్పించియున్నారు ఇది చాలశ్లాఘనీయమైనపద్ధతి. హిందూదేశమున సామాన్యజనులు హెచ్చు. వారి యాదాయములకు తగినట్లు కొద్ది మొత్తములకు, భీమా చేయుటయు ప్రీమియములు నెలసరి వాయిదాల పద్ధతిమీద వసూలుచేయు కంపెనీలు మనదేశమందు లేనేలేవని చెప్పవచ్చును. కాని ఇంగ్లాండు మొదలగు దేశములయందు వారమునకు ఒకపెన్నీచొ॥ వసూలుచేయుచు వ్యాపారముసాగించు కంపెనీలు, చాల గొప్పవికలవు. నెలకొక పెన్నిచొప్పున ప్రతి పాలశీదారుని వద్దనుండియు వసూలు చేయుట ఎంతకష్టమొ చెప్పనక్కరలేదు. దీనికి చాల ఓపిక, సామర్థ్యము, పరిపాలనా దక్షత చాలయవసరము. అట్టి పద్ధతులపై వ్యాపారము చేయుటకు మొదలుపెట్టిన ఈ యాంధ్ర భీమాసంస్థకు మా యభివందనములు. మదరాసు వర్తకులలో వర్థమాన చంద్రులును, గొప్ప రాజకీయవేత్తలును భారత శాసన సభాసభ్యులును అగు శ్రీయుత సామి వెంకటాచలముశ్రేష్ఠిగారు ఈ కంపెనీకి అధ్యక్షమహాశయులు. కవితాత్మగల విద్యావంతులును, ఆంధ్రభూమి భీమా విషయములనుగూర్చి చక్కని వ్యాసములు వ్రాయుచున్నవారును అగు శ్రీయుత

జమిలి సమ్మాళ్వారుగారు జయవిజయ ఇన్సూరెన్సుకంపెనీకి మేనేజింగు డైరెక్టరుగా ఉన్నారు.

1933-వ సంవత్సరము డిసెంబరు 31-వ తేదీతో అంతమయ్యెడు వత్సరపు నివేదిక విమర్శనార్థము మాకార్యాలయమునకు పంపబడినది. ఈనివేదికకు అనుబంధముగ రెవిన్యూ ఎక్కౌంటు స్టేటుమెంటులు. బాలెన్సుషీటు, ఆడిటరు రిపోర్టు జతచేయబడియున్నవి. మ్యూచ్యుయల్ బెనిఫిట్ స్కీముక్రింద ఈ కంపెనీ మూడువత్సరములలో 30,584 పట్టాలను జారీచేయగలిగినది. ఇట్టిపద్ధతి నవలంబించియున్న ఇతర కంపెనీల వ్యాపారముతో పోల్చి చూచినచో నీ కంపెనీవారుచేసిన వ్యాపారము అతి విస్తృతమైనదని అంగీకరింపక తీరదు. అయినను ఆక్చ్యుయరీ ఆదేశము ననుసరించి 1933-వ సంవత్సరపు నవంబరు 20-వ తేది నుండియు ఈ పద్ధతిలో క్రొత్తవ్యాపారము నిలిపివేయబడి నవీనవిధానముతో ప్రావిడెంటు స్కీములు, యిండస్ట్రియల్ స్కీములు ప్రజాసామాన్యమునకు అందుబాటున ఉండునట్లు ప్రవేశపెట్టబడినవి. ప్రవేశపెట్టిన కొలది కాలముననే యీ విధానమున 718 పట్టాలు జారీచేయబడినవి. మ్యూచ్యుయల్ బెనిఫిట్ స్కీమ్ రిజర్వుఫండు 1933 డిసెంబరు 31-వ తేదీకి 43,732—10—9. ప్రారంభవత్సరములగు మూడేండ్లయందే ఇంతటిపెద్ద రిజర్వును కూర్చుట పట్టాదారుల క్షేమభద్రతలకు పూటకాపు. ఈరీతి వ్యాపారమును చేయుచున్న అన్ని ఇన్సూరెన్సు కంపెనీలలోను సత్వరముగ క్లెయిములను పరిష్కారము చేయునవియను ఖ్యాతినొందిన కంపెనీలు రెండే. ఆరెండింటియందును ఈకంపెనీ యొకటి. ఈవిషయము యీకంపెనీ నిర్వాహకుల వ్యాపార కౌశల్యమును ప్రదర్శించుచున్నది. యిట్టికంపెనీ అనేకవిషయములచే ప్రజామోదమును బడయదగి యున్నది. శాస్త్రీయములగు నూతన భీమాపద్ధతులు అమలులో పెట్టబడినవి. ప్రజాసేవయే ఈ కంపెనీవారి ప్రధానాశయమగుట ఆపద్ధతుల నొకపరి పరామర్శించుటవలన తేటతెల్లమగును. వివాహ విద్యాసౌకర్యములను కలిగించు పోలసీలుకూడ నుండుట ఒక విశేషము. ఇట్లు ఇన్నివిషయములు ఈ కంపెనీ స్థిరత్వమును, రక్షణను ప్రస్ఫుటము చేయుచున్నవి. క్రమాభివృద్ధినంది జయ్ విజయ యిన్సూరెన్సు కంపెనీ విస్తరించిన వ్యాపారముతో ప్రజాసేవ గావించుగాక యని కోరెదము

నాటకరచన పోటీ :—

ఆంధ్రనాటకకళా పరిషత్తువారు కడచిన డిసెంబరుమాసమున చెన్నపురిలో జరిగిన తమ తృతీయసమావేశమున తెలుగు భాషలో రచింపబడెడి యుత్తమనాటకమునకు వేయిన్నూటపదునారులు బహుమతిగా నొసంగునట్లు తీర్మానించి యుండిరి. ఇంతవఱకు తెనుగున గ్రంథరచన విషయమున జరిగిన బహుమతిపరీక్షలు మిక్కిలి కొద్ది ఆ జరిగిన కొద్దియైనను నవలల విషయమున

జరిగినవి. రాజమండ్రి చింతామణి బహుమతులేమి, మదరాసు విజ్ఞానచంద్రిక బహుమతులేమి, విశాఖపట్టణము ఆంధ్ర విశ్వవిద్యాలయము బహుమతులేమి నవలల విషయముననే జరిగినవి మదరాసు విశ్వవిద్యాలయపు యాజమాన్యమున జరుగు రామారాయణింగారి బహుమతులును, యిపుడు ఆంధ్ర విశ్వవిద్యాలయమున జరుగు మఱికొన్ని బహుమతులును నవలలకు యితరములైన గ్రంథములకే అయినను అందు శాస్త్రవిషయక గ్రంథములేగాని నాటకముల ప్రశంసలేదు. కావ్యములందు రమ్యములగు నాటకముల విషయమున యిట్లు కొఱవడియున్న పోషణ ప్రోత్సాహములను తీర్పగడంగినందులకు ఆంధ్రనాటకకళా పరిషత్తువారెంతయు ప్రశంసనీయులై యున్నారు. ఈపోటీకి నాటకములను పంపు గ్రంథకర్తలు గమనింపవలసిన నిబంధనలు ప్రచురితములైనవి. అందు ముఖ్యములైనవి: పోటీకి పంపబడు నాటకము స్వతంత్ర రచనయై అదివఱకు ప్రచురింపబడనిదిగను, ప్రదర్శింపబడనిదిగను ఉండుట - నాటక వస్తువు వర్తమానకాలమునందలి ప్రజల జీవితమునకును, ఆధునిక పరిస్థితులకును సంబంధించినదియు ; సంఘమునకుగాని మతమునకుగాని రాజకీయమునకుగాని చెందినదియు అయిఉండుట. ఇతర నిబంధనలు మదరాసునందలి పోస్టుబాక్సు 288 చిరునామాగల పరిషత్తు కార్యాలయమునకు వ్రాసి బడయనగును. ఆంధ్ర దేశపు నాటకరచయితులు ఈ సదవకాశమును యథామతి నుపయోగించుకొందురని ఆశించుచున్నాము.

## మునిసిపాలిటీలు . భీమాకంపెనీలు :—

సర్వవిధముల ప్రజాక్షేమమునకు పాటుపడవలసిన స్థానిక సంస్థలు ప్రజాభివృద్ధికి దోహదముచేయు వ్యవస్థలలోనివగు భీమాకంపెనీలయెడ సహకారము చూపుచుండుట అభినందింపదగినది. ఆంధ్రమహానగరమగు విశాఖపట్టణమున నూతనముగ మునిసిపాలిటీకి ఎన్నుకొనబడిన సభ్యులు అచటి జగన్మోహిని యిన్సూరెన్సుకంపెనీ కార్యాలయమున సమావేశమై పట్టణముయొక్క ఆరోగ్య పరిస్థితులను గూర్చి ఈనడుమ ముచ్చటించిరి. పురపాలక సంఘములకును, భీమా కంపెనీలకును ప్రజారోగ్యము ప్రత్యేకముగ వరణీయమైనది. కావున యిట్టి సమావేశములు ప్రోత్సహింపదగినవి. ఈ సమావేశ కారకులగు జగన్మోహిని ఇన్సూరెన్సు కంపెనీ అధ్యక్షులు వి. ఎ. గుప్తగారు ప్రశంసనీయులై యున్నారు.






## శ్రీ దత్తాత్రేయ అజీర్ణమాత్రలు

మలబద్ధకము హరించును.

ఒకసీసాకొరకు మాకు వ్రాయవలసిన అవుసరములేదు. మీగ్రామము పచారిషాపునందు తప్పక దయచేసి అడగండి. సీసా 0 4 0 ధరకేదొరకును.

## గందర్వకళ

రక్తపుష్టి, వీర్యవృద్ధి, నరములకుబిగి కలిగించు అయ్యని లేహ్యము. అనేకులకు మరల మగతనము కలిగించి మెప్పు పొందినది

పౌను రు. 3—0—0.

గంధర్వఫార్మసీ, రాజమండ్రి.

## శిశుపోషణి

ఇది చిన్నపిల్లలకు కలుగు సమస్తవ్యాధులను బోగొట్టి పిల్లల ఆరోగ్యమును వృద్ధిబొందించును. దీనిని ప్రతినిత్యమును వాడుచుండిన బల్లపెరుగుట, కోరింతదగ్గు, బాలాపస్మారము, పాలు కక్కుట మొదలగు క్రూరవ్యాధులు రాకుండ కాపాడును. మూడుమాసముల వయస్సు మొదలు 5 సంll ముల వయస్సువచ్చువరకు నుపయోగింపవచ్చును ఉపయోగించువిధానము మందుతో పంపబడును.

వెల 50 మాత్రల సీసా అణాలు 4.

ఇంకను ఇప్పటికాలమున ప్రతినిత్యము సేవింపదగిన "కూష్మాండరసాయనము", ద్రాక్షారిష్టము, స్వర్ణాదివటి (టానిక్కుపిల్సు), హిమసారతైలము (బేదింగ్ అండ్ హైరాయిల్) మొదలగు ఔషధములు మావద్ద సిద్ధముగా నున్నవి.

వలయువారు—

లక్ష్మీనారాయణకంపెనీ, కాకినాడ.

డ్రగ్గు కెమికల్‌స్టోర్సు, వెస్టుకలక్టరేటు, గుంటూరు

భారతభైషజ్యనిలయము, వేపేరి, మదరాసు, అని వ్రాయవలెను.

## స్వర్ణమాలిని

ఇయ్యది కాసరోగములను, జీర్ణజ్వరములను, విషమజ్వరములను బోగొట్టి మిక్కిలి సుగుణమిచ్చును. క్షయరోగములయందు మిక్కిలి యుత్తమము. వారమురోజులమందు. రు 4-0-0.

### బ్రహ్మీతైలము.

జ్ఞాపకశక్తిని వృద్ధిచేసి మెదడునకు చలువనిచ్చును ఉన్మాదఅపస్మారములను పోగొట్టును

6 ఔన్సులువెల 1-0-0

ఇతర ఆయుర్వేదౌషధములన్నియూ దొరకును.

భవానీ ఫార్మసి.

320, తంబుశెట్టి వీథి, మదరాసు.